అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 04-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 247 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ విధించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్



మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద లను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీని విధిం చాలని కోరారు. ఈ మేరకు ఆయన మంగళ వారం ఒక ప్రకటన విడుదలచేశారు. రాష్ట్రంలో కురుస్తున్న అత్యంత భారీ వర్షాల వల్ల 22 జిల్లాల్లో తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని తెలిపారు. ఇప్పటికీ దాదాపు 21 మంది మరణించారనీ, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు. సుమారు 173 మండలాల్లో భారీ వర్షాలు నమోద య్యాయని వివరించారు. ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ తదితర జిల్లాల్లోనష్టం తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు రూ.5,500 కోట్లు నష్టం జరిగినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసిందని తెలిపారు. 66 ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు ఎక్కువగా దెబ్బతి న్నాయని పేర్కొన్నారు. 196 చెరువులు, 64 కాల్వలు తెగడంతో లోతట్టు ప్రాంతాలు మునిగి పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 4.15 లక్షల ఎకరాల్లో ప్రధానంగా వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని వివరించారు. 85 వేల మంది రైతులు నష్టపోయినట్టు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసిందని తెలిపారు. రాష్ట్రంలో జరిగిన నష్ట తీవ్రతను గుర్తించి ప్రజానీకాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు ఆర్థిక సహాయం విడుదల చేయాలని కోరారు.

నెల రోజులుగా రాష్ట్రంలో సీజనల్ వ్యాధులైన విషజ్వరాలు, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి వాటితో ప్రజలు అల్లాడి పోతున్నారని తమ్మినేని తెలిపారు. ప్రతి ఇంటిలో ఒకరు ఏదో ఒక వ్యాధికి గురయ్యారనడంలో ఆశ్చర్యం లేదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారమే 2.93 లక్షల మంది వ్యాధుల బారిన పడ్డారని ప్రభుత్వం ప్రకటించిం దని గుర్తు చేశారు. లెక్కకు రాని వాటిని కలిపితే ఈ సంఖ్య రెట్టింపు ఉంటుందని వివరించారు. డెంగ్యూ వ్యాధికి గురైన వారు వేల సంఖ్యలోనే ఉన్నారని తెలిపారు. దీనికి తోడు ఈ వర్షాల వల్ల అంటువ్యాధులు ఇంకా విజృంభించే అవకాశముందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, ఇతర వైద్య సౌకర్యాలు తగినంతలేవని వివరించారు. దీన్ని అదనుగా చేసుకుని రోగులను ప్రయివేటు ఆస్పత్రులు దోచుకుంటున్నాయనీ, అప్పులపాలు చేస్తున్నాయని విమర్శించారు. అందువల్ల రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి, వరద ప్రభావిత ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.



చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తాం

హైడ్రా తరహాలో రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్‌డ్రైవ్

- ఆక్రమణల తొలగింపునకు పక్కా ప్రణాళిక
- జిల్లా కలెక్టర్లు ప్రత్యేక వ్యవస్థ రూపొందించుకోవాలి
- ప్రకృతి విపత్తులపై బ్లూ బుక్ తయారు చేసుకోవాలి
- మున్నేరు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపుపై సమీక్షిస్తాం...
- మహబూబాబాద్‌లోని వరద ప్రాంతాల్లో పర్యటన
- యువ శాస్త్రవేత్త అశ్వినీ కుటుంబ సభ్యులకు ఓదార్పు..
- మంత్రులు, అధికారులతో సమీక్ష

నవతెలంగాణ -మహబూబాబాద్, ఖమ్మం

ప్రకృతిని చెర బడితే అది ప్రకోపిస్తుందని.. ప్రకృతి ప్రకోపంతోనే ఉత్తరా ఖండ్‌లోనైనా, మన రాష్ట్రం లో నైనా విపత్తులు సంభ విస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భారీ వర్షాల సమయంలో వరదలు సంభవించి కాలనీలకు కాలనీలే మునిగి పోవడానికి కారణం చెరువులు, నాలాల ఆక్రమణే కారణమన్నారు. హైడ్రాను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిం చాలనే డిమాండ్ వస్తోం దని, దీనికి ఎక్కడికక్కడ కార్యాచరణ రూపొం దించుకోవాలని జిల్లా కలెక్టర్లకు, అధి కారులకు ముఖ్యమంత్రి సూచిం చారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువుల్లో ఆక్ర మణ తొలగింపును ప్రాధాన్యంగా పెట్టు కున్నామని, చెరువులు, నాలాల ఆక్రమ ణలో ఎంతటి వారున్నా తొలగింపునకు వెనుకాడ బోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ముందుగా చెరువులు, నాలాల ఆక్రమణపై నివేదిక రూపొందించు కోవాలని, ఏవైనా కోర్టు కేసులు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ రాంనగర్‌లో ఒక నాలాపై ఆక్రమణలు తొలగించడం వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చేయగలి గామని ముఖ్య మంత్రి ఉదహరించారు.

ఖమ్మంలో మంత్రి పొంగులేటి నివాసంలో మంగళ వారం విలేకరులతో ఇష్టాగోష్టిలో, మహ బూబాబాద్ జిల్లా సమీక్షలో ఈ విషయాలను ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆకేరు వాగు పొంగడంతో కారు కొట్టుకు పోయి యువ శాస్త్రవేత్త నూనావత్ అశ్వినీ, ఆమె తండ్రి మోతీలాల్ మృతిచెందిన విషయం విదితమే. మంగళవారం ఉదయం ఖమ్మం నుంచి నేరుగా సింగరేణి మండలం గంగారాం తండాలోని అశ్వినీ ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేరుకున్నారు. అశ్వినీ, మోతీలాల్ చిత్రపటాలకు పూల

...16లో

ఖమ్మంలోనే ఎక్కువ నష్టం

తెలంగాణలోని ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలు కవల పిల్లల వంటివని, కృష్ణాతో పోల్చితే ఖమ్మంలోనే ఎక్కువ నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి తెలిపారు. జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో మరింత నష్టం వాటిల్లకుండా చూసుకోగలిగామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో త్వరగా చేరుకోవడానికి వీలుగా హెలీకాప్టర్లను పంపుతారని, ఖమ్మానికి విజయవాడ దగ్గర ఉన్నందునే అక్కడకు హెలీకాప్టర్లు చేరుకున్నాయని.. ఈ సమయంలో ప్రాంతం, రాజధాని వంటివి చూసుకోకూడదని సీఎం అన్నారు. భారీగా నష్టం వాటిల్లినందునే కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ప్రధాని మోడీని రాష్ట్రంలో పర్యటించాలని కోరామన్నారు.



మహబూబాబాద్‌లో జనం అవస్థలు

పువ్వాడ ఆక్రమణలు తొలగిస్తే హరీశ్ సహకరిస్తారా ?

ఖమ్మం ముంపు బారిన పడడానికి మాజీ మంత్రి పువ్వాడ ఆక్రమణలే కారణమని తనకు ఫిర్యాదులు అందాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి ఇష్టారీతిగా కాలువలు ఆక్రమించారని, దాంతో ఖమ్మం ముంపు బారిన పడిందని తాను పరామర్శిస్తున్నప్పుడు స్థానికులు చెప్పారన్నారు. పదేండ్లకాలం నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు ఈ ఆక్రమణలపై ఏమంటారని ప్రశ్నించారు. వాటిని తొలగించేందుకు హరీశ్ అంగీకరిస్తారా అని అడిగారు. ఖమ్మంలో పువ్వాడ ఆక్రమణలకు సంబంధించి వాస్తవాలు వెలికితీయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు...తాము అధికారం లోకి వచ్చాక తొలిసారిగా వేసిన టెండర్ ఖమ్మం మున్నేరు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపుకేనని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం అంతకు మించిన ఎత్తులో నీరు వచ్చినందున.. ఆ ఎత్తు పెంపు సమీక్షిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

సీఎంకు పాలనపై పట్టులేదు

వరద బాధితులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- మృతుల సంఖ్యను ప్రభుత్వం దాచిపెడుతోంది : మాజీమంత్రి హరీశ్
- సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో మాజీ మంత్రుల పర్యటన



నవతెలంగాణ- ఖమ్మం/కోదాడరూరల్

సీఎం రేవంత్‌రెడ్డి వ్యంగ్యంగా మాట్లాడటమే తప్ప ప్రభుత్వ పాలనపై పట్టులేదు.. వరద ముంపు గురించి లోతట్టు ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరిక జారీ చేయకపోవడం వల్లే వేలాది మంది కట్టుబట్టలతో నిరాశ్రయు లుగా మిగిలారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం వల్లే విపత్తు జరిగిందని విమర్శించారు. మంగళవారం బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ క్రమంలో ఖమ్మం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావుతో కలిసి హరీశ్‌రావు మాట్లాడారు. వరద బీభత్సం వల్ల ప్రతి

...15లో

అమీన్‌పూర్‌లో 'హైడ్రా' కూల్చివేతలు

38 గుంటల ప్రభుత్వ భూమి స్వాధీనం

ఫ్యూజియన్ స్కూల్ ప్రహరీ నేలమట్టం

6లో..

పదిలోపు డీఎస్సీ ఫలితాలు!

- నేడు తుది కీ విడుదల
- విద్యాశాఖ కసరత్తు

15లో..

పొమ్మన్నారా.. పొగబెట్టారా..!

ఆర్అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి రాజీనామా

టిమ్స్ అంచనాల పెంపుపై సర్కారు గుర్రు

- సెలవులో ఉన్నప్పుడు మరొకరికి పోస్టింగ్
- అసంతృప్తితో రాజీనామా
- విజిలెన్స్ విచారణ నేపథ్యంలోనే తప్పుకున్న ఈఎన్సీ ?



(ఫైల్)

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఐ గణపతిరెడ్డి రాజీనామా చేశారు. వ్యక్తిగత సెలవు నుంచి తిరిగొచ్చిన ఆయన, సోమ వారం సాయంత్రం ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్‌కు రాజీనామా లేఖను పంపారు. ఈఎన్సీ రాజీనామాకు గల కార ణాలపై ఆర్అండ్‌బీలో చర్చోపచర్చలు జరుగు తున్నాయి. టిమ్స్ భవనాల అంచనాలను అనూహ్యంగా పెంచడం, దీనిపై సీఎం గుర్రుగా ఉన్న నేపథ్యంలో ఎట్టకేలకు పదవికి రాజీనామా చేయాల్సి వచ్చినట్టు సమాచారం. దీర్ఘ కాలికంగా ఈఎన్సీ హోదాలో ఉన్న గణపతిరెడ్డి సోమవారం వరకు విధులు నిర్వర్తించారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఆర్అండ్‌బీలో ఆయన కీలకంగా వ్యవహరించిన విషయం విదితమే. ఈతరుణంలో గణపతిరెడ్డిని పొమ్మన్నారా ? పొగబెట్టారా

...3లో




ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాలు విలీన జాబితాలో ఉన్నాయి.

- పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో.. బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్ తారామతిపేట పంచాయతీలు విలీనం
- శంషాబాద్ మున్సిపాలిటీలో.. బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్,

...15లో



ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

తొమ్మిది మంది మావోయిస్టుల కాల్చివేత.. మృతుల్లో ఆరుగురు మహిళలు

వివరాలు 15లో

పెరిగిన పర్సనల్ లోన్స్

• జులై ముగింపు నాటికి 14 శాతం వృద్ధి • గృహ రుణాల డిమాండ్‌లో తగ్గుదల

క్రెడిట్ కార్డు అప్పులు రూ.2.8 లక్షల కోట్లు



ముంబయి : కుటుంబ భారాలను అధిగమించడానికి వ్యక్తిగత రుణాలపై ఆధారపడటం భారీగా పెరిగింది. ఏడాదికేడాదితో పోల్చితే 2024 జులై ముగింపు నాటికి వ్యక్తిగత రుణాల్లో ఏకంగా 14 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. మొత్తంగా బ్యాంకింగ్ రుణాల్లో ఈ విభాగం వాటా ఏకంగా ఒక్క శాతానికి చేరిందని ఆర్‌బీఐ గణంకాలు వెల్లడించాయి. వ్యక్తిగత రుణాలతో పోల్చితే బంగారం రుణాలు ఏకంగా 39 శాతం పెరగడం గమనార్హం. ఆహారేతర రుణాల్లో వ్యక్తిగత రుణాల వాటా అత్యధికంగా 32.9 శాతంగా ఉంది. ఆ తర్వాత సర్వీసెస్ వాటా 27.4శాతం, ఇండస్ట్రీస్ 22.2శాతం, వ్యవసాయం, సంబంధిత కార్యకలాపాల వాటా 12.8 శాతంగా నమోదయ్యింది. ఇక క్రెడిట్ కార్డుల బకాయిలు జులై చివరి నాటికి భారీగా ఎగిశాయి. కాగా.. బ్యాంకుల మొత్తం రుణాల్లో వీటి వాటా కేవలం ఒకశాతం మాత్రమే. వార్షిక ప్రాతిపదికన క్రెడిట్ కార్డు రుణాలు 22 శాతం వద్ధితో రూ.2.8లక్షల కోట్లకు ఎగిశాయి.

వాస్తవానికి బంగారంపై రుణం వెంటనే అందుబాటులో ఉంటుంది. మరోవైపు వ్యవసాయ రంగ రుణాల్లో 18.1 శాతం పెరుగుదల ఉంది. అన్ని రంగాలకు కలిపి మొత్తం రుణాలు రూ.21.6 లక్షల కోట్లకు చేరాయి. పరిశ్రమలకు ఇచ్చే రుణాలు 13.7శాతం పెరిగాయి. గృహ రుణాలకు డిమాండ్ అతి తక్కువగా ఉంది. ఈ రంగం రుణాల్లో 12.8 శాతం మాత్రమే పెరుగుదల చోటు చేసుకుంది. కాగా.. గృహ రుణాల మొత్తం పరిమాణం ఇప్పుడు రూ.28 లక్షల కోట్లు దాటిందని ఆర్‌బీఐ వెల్లడించింది. ప్రజలు ఎక్కువగా గంటల వ్యవధిలో లభించే రుణాల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపింది.



97.96 శాతం చేరిన రూ.2వేల నోట్లు

చలామణిలోని రూ.2వేల నోట్లు ఇప్పటి వరకు 97.96 శాతం బ్యాంక్‌లకు చేరాయని ఆర్‌బీఐ వెల్లడించింది. ఇంకా రూ.7,261 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని పేర్కొంది. 2023 మే 19న రూ.2వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్టు ఆర్‌బీఐ స్పష్టం చేసింది.



తెలంగాణ విద్యాకమిషన్ ఏర్పాటు

చైర్మెన్ సహా ముగ్గురు సభ్యులకు చోటు

- రెండేండ్లపాటు పదవీకాలం
- నాణ్యమైన విద్య అందించడం కోసం రోడ్‌మ్యాప్
- సమగ్ర విద్యావిధానం రూపకల్పన

విప్లవాత్మక మార్పులకు శ్రీకారం మార్గదర్శకాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ విద్యాకమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం మంగళవారం జీవోనెంబర్ 27 ద్వారా మార్గదర్శకాలను విడుదల చేశారు. చైర్మెన్ సహా ముగ్గురు సభ్యులు ఈ కమిషన్‌లో ఉంటారని స్పష్టం చేశారు. వారి పదవీకాలం రెండేండ్లపాటు ఉంటుందని వివరించారు. విద్యాశాఖ విభాగాధిపతి స్థాయి అధికారి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని తెలిపారు. కమిషన్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ విద్య నుంచి ఉన్నత విద్య వరకు విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టేలా నిర్ణయాలుంటాయని తెలిపారు. అన్ని స్థాయిల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని ప్రకటించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య దొరకడం లేదని పేర్కొన్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్-2021) ప్రకారం ప్రాథమిక విద్యలో, పలు పబ్లికేషన్లు, పరిశోధనల ప్రకారం విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు అభ్యసనా సామర్థ్యం పడిపోతున్నదని వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కోసం రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలని సూచించారు. విద్యారంగంలో సంస్కరణలు తేవాలని తెలిపారు. బోధనా పద్ధతుల్లో మార్పులు రావాలని పేర్కొన్నారు. అభ్యసనా సామ ర్థ్యాన్ని పెంపొందించాలనీ, నిరంతర పర్యవేక్షణ ఉండాలని కోరారు. మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా విద్యారంగంలో మార్పులు

...6లో

8లో..

అది రాజ్యాంగ ఉల్లంఘనే

ఆర్ఎస్ఎస్‌లో ప్రభుత్వోద్యోగులు చేరమనే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి : కేంద్రాన్ని కోరిన మాజీ సివిల్ సర్వెంట్ల గ్రూప్



15లో..

న్యాయ సంస్కరణలకు 23వ లా కమిషన్ ఏర్పాటు

చైర్మెన్, సభ్యులను నియమించని కేంద్రం



వరద సహాయంపై స్పందించండి

- వివిధ రంగాల ప్రముఖులకు చనగాని దయాకర్ విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వరద బాధితులకు సహాయం అందించేందుకు సినీ ప్రముఖులు, విద్యా, వ్యాపార వేత్తలు వెంటనే స్పందించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాలకు దాదాపు రూ.10వేల కోట్ల ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు వెంటనే స్పందించి వరద బాధితులకు భరోసానిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుగా, ప్రజలకు సహాయంగా సినీ ప్రముఖులు కదిలి రావాలని విజ్ఞప్తి చేశారు. కేరళలో వాయనాడ్ బాధితుల కోసం ఎంతో మంది ప్రముఖులు స్పందించారని గుర్తు చేశారు. అదే తరహాలో వ్యాపారవేత్తలు ముఖ్యమంత్రి సహాయనిధికి సాయం చేయాలని కోరారు. వరద బాధితులకు సీఎం తక్షణ సహాయం కింద రూ.10వేలు ప్రకటించారని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ ఏనాడూ బాధితులను పరామర్శించలేదని విమర్శించారు.

కందార్ డయాబెటిక్ సెంటర్‌పై దాడి

- కాలంచెల్లిన మందుల స్వాధీనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సికింద్రాబాద్ తార్నాకలోని కందార్ డయాబెటిక్ సెంటర్‌పై డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో చట్ట విరుద్ధంగా నిల్వ ఉంచిన ఫిజీషి యన్ శాంపిళ్లతో పాటు కాలం చెల్లిన మందులను సీజ్ చేశారు. వీటి విలువ రూ.55 వేలు. ఈ దాడిలో 9 రకాల ఫిజీషియన్ శాంపిళ్లను, ఆరు రకాల కాలం చెల్లిన మందులను గుర్తించారు. ఫిజీషియన్ శాంపిళ్లు, కాలం చెల్లిన మందులను నిల్వ ఉంచితే డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ కింద జరిమానాతో పాటు అత్యధికంగా రెండేండ్లు జైలు శిక్ష పడుతుందని డ్రగ్ కంట్రోల్ అథా రిటీ డైరెక్టర్ జనరల్ వి.బి.కమలాసన్ రెడ్డి హెచ్చరిం చారు. చట్ట విరుద్ధంగా ఎవరైనా మందులను నిల్వ ఉంచితే ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 1800 -599 - 6969కు కాల్ చేయాలని సూచించారు.

దాడులకు హరీశ్ రావు భయపడడు

- బీఆర్‌ఎస్ నాయకులు నగేష్ ముదిరాజ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దాడులకు మాజీ మంత్రి హరీశ్ రావు భయపడబోరని బీఆర్‌ఎస్ నాయకులు నగేష్ ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన హరీశ్ రావు, ఆయన అనుచరులపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు సంబంధించిన వ్యక్తులు గుండాల్లా ప్రవర్తించి రాళ్ల దాడి చేశారని ఖండించారు. పోలీసుల సమక్షంలో పక్కా ప్రణాళికతో జరిగిన దాడి తీరు చూస్తుంటే ఈ దాడికి ముఖ్యమంత్రే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఖమ్మం ప్రజలు కాంగ్రెస్ నాయకులను అసహ్యించుకుంటున్నారని తెలిపారు.

గెస్ట్ లెక్చరర్లు కొనసాగింపు

- ఇంటర్ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,654 మంది గెస్ట్ లెక్చరర్లను 2024-25 విద్యాసం వత్సరంలో కొనసాగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ శృతి ఓజా మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో మార్చి వరకు వారు కొనసాగుతారని తెలిపారు. ఈ ఉత్వర్వులను విడుదల చేయడం పట్ల గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్ హర్షం ప్రకటించారు.

సెప్టెంబర్ 5,6 తేదీల్లో "గ్లోబల్ ఏఐ సదస్సు"

- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సెప్టెంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించనున్న గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సదస్సును ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. సాంకేతిక ఆవిష్కరణల రంగంలో రాష్ట్రాన్ని మరింత ముందంజలో ఉంచేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని భావిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కృత్రిమ మేథా రంగ నిపుణులు, ఐటీ ఆవిష్కర్తలు పాల్గొననున్న ఈ సదస్సులో 'మేకింగ్ ఏఐ వర్క్ ఎవ్రీ వన్' అనే ఇతి వృత్తంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సమాజానికి ఎలా ప్రయోజనం చేకూరుస్తుందో, ఎలా సాధికారత కల్పిస్తుందో అన్వేషించటమే లక్ష్యంగా ఈ సదస్సులో మేథోమథనం జరుగనుంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీ రంగంలో తెలంగాణలో కొత్త ప్రాజెక్టులకు ఈ సదస్సు నాంది పలుకనుందని నిపుణులు అంటున్నారు. దాదాపు రెండు వేల మంది ప్రతినిధులు హాజరు కానున్న ఈ సదస్సులో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొననున్నారు.



నానాటికి తీసికట్టు...

- ప్రముఖ వర్సిటీల్లో తగ్గుతున్న రీసెర్చ్ స్కాలర్లు
- తలాతోకా లేని యూజీసీ విధానాలే కారణం
- నష్టపోతున్న విశ్వవిద్యాలయాలు

న్యూఢిల్లీ : దేశంలో పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాలలో రిసెర్చ్ స్కాలర్ల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. కేంద్రీకృత ప్రవేశ పరీక్షల ద్వారా ఉమ్మడి నిబంధనలు విధించడం, విద్యా క్యాలెండర్‌ను సరిగా నిర్వహించకపోవడమే దీనికి కారణమని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్)కు యూనివర్సిటీలు అందజేసిన సమాచారం ప్రకారం 2016-17, 2022-23 మధ్యకాలంలో జేఎన్‌యూ, హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీ, బనారస్ హిందూ యూనివర్సిటీ, జాదవ్‌పూర్ యూనివర్సిటీలలో ఫుల్-టైమ్ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థుల సంఖ్య పడిపోయింది. ఎన్‌ఐఆర్‌ఎఫ్ అనేది ప్రతి సంవత్సరం విడుదల చేసే ర్యాంకింగ్ పద్ధతి.

యూజీసీ నిబంధనలు

ఎంఫిల్, పీహెచ్‌డీ డిగ్రీలు ప్రదానం చేయడానికి 2016లో యూజీసీ కొన్ని నిబంధనలు నిర్దేశించింది. నూతన నిబంధనల ప్రకారం ఒక ప్రొఫెసర్ ముగ్గురు ఎంఫిల్ విద్యార్థులు, ఎనిమిది మంది పీహెచ్‌డీ విద్యార్థుల కంటే ఎక్కువ మందికి మార్గనిర్దేశకుడిగా వ్యవహరించకూడదు. అసోసియేటెడ్ ప్రొఫెసర్ ఇద్దరు ఎంఫిల్, ఆరుగురు పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గనిర్దేశం చేయవచ్చు. అసిస్టెంట్ ప్రొఫెసర్ అయితే ఒక ఎంఫిల్, నలుగురు పీహెచ్‌డీ స్కాలర్లకు గైడ్‌గా ఉండవచ్చు. పీహెచ్‌డీ డిగ్రీ లేని ఫ్యాకల్టీ సభ్యులు పీహెచ్‌డీ విద్యార్థులకు గైడెన్స్ ఇవ్వకూడదు. పీహెచ్‌డీ డిగ్రీ ఉన్న అభ్యర్థులనే యూనివర్సిటీలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించాలని 2018లోనే యూజీసీ ప్రకటించింది.

తగ్గిన రిసెర్చ్ స్కాలర్లు

అయితే ఈ విధానం అమలును 2021లో యూజీసీ రెండు సంవత్సరాల పాటు వాయిదా వేసింది. 2023 జూలైలో తిరిగి పాత విధానాన్ని అమలులోకి తెచ్చింది. అంటే ఎన్‌ఈటీ, ఎల్‌ఎల్‌ఈటీ పరీక్షలలో ఉత్తీర్ణులైన వారినే... వారు రిసెర్చ్ స్కాలర్లను గైడ్ చేయలేకపోయినప్పటికీ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించాల్సి ఉంటుంది. 2016-17లో మొత్తం విద్యార్థుల్లో రిసెర్చ్ స్కాలర్లు 62 శాతం మంది ఉన్నారని, అయితే 2022-23లో వారి సంఖ్య 43 శాతానికి తగ్గిందని జేఎన్‌యూ టీచర్స్ యూనియన్ విడుదల చేసిన నివేదిక తెలిపింది.

విద్యావేత్తలు ఏమన్నారు?

పీహెచ్‌డీ ప్రవేశాల కోసం కేంద్రీకృత ఎంట్రన్స్ పరీక్షను సకాలంలో నిర్వహించడం లేదని, దీనివల్ల అడ్మిషన్ షెడ్యూలు దెబ్బతింటోందని జేఎన్‌యూ రిటైర్డ్ ప్రొఫెసర్ రాజీవ్ కుమార్ చెప్పారు. పలువురు స్కాలర్లు పరిశోధన వైపు వెళ్లకుండా ప్రైవేటు రంగంలో ఉపాధిని వెతుక్కుంటున్నారని పాట్నాలోని ఏఎన్ సిన్హా ఇన్‌స్టిట్యూట్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ రే తెలిపారు.

కారణాలు ఇవే

యూజీసీ నిబంధనలను ఏ మాత్రం వివేకం లేకుండా అమలు చేయడమే ఈ పరిస్థితికి కారణమని విద్యావేత్తలు ఆరోపించారు. తొలుత ఓ అధ్యాపకుడు పర్యవేక్షించే ఎంఫిల్, పీహెచ్‌డీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి విధించారు. ఆ తర్వాత పీహెచ్‌డీ విద్యార్థుల సంఖ్యపై పరిమితిని సవరించకుండా ఎంఫిల్ ప్రోగ్రామ్‌ను రద్దు చేశారు. జేఎన్‌యూ వైస్ ఛాన్సలర్‌గా జగదీష్ కుమార్ ఉన్నంత వరకూ...అంటే 2022 ఫిబ్రవరి వరకూ ఆ యూనివర్సిటీ పీహెచ్‌డీ లేకుండానే పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించింది. 'ఇప్పుడు ప్రొఫెసర్ అచేతనుడయ్యారు. ఒక ప్రొఫెసర్‌కు ఎనిమిది మంది విద్యార్థులు ఉంటే, వారు తమ కోర్సును పూర్తి చేసే వరకూ ఆయన వేచి చూడాల్సి ఉంటుంది. ఆ తర్వాతే కొత్తగా విద్యార్థులను తీసుకోవాలి. అదీకాక చాలా మంది కొత్త ఫ్యాకల్టీ సభ్యులు గైడెన్స్ ఇవ్వలేరు. ప్రతి స్లాటుకు కనీసం పది మంది విద్యార్థులు దరఖాస్తు చేస్తారు. రిసెర్చ్ స్కాలర్ల సంఖ్య తగ్గడం అంటే యూనివర్సిటీకి నష్టమే' అని ఓ అధ్యాపకుడు తెలిపారు.

ఆ రెండు లక్షల కోట్లు ఎవరివి ?

- ప్రభుత్వం, రెగ్యులేటరీ సంస్థల వద్ద మూలుగుతున్న ప్రజల సొమ్ము
- క్లెయిమ్ చేయని కుటుంబ సభ్యులు, వారసులు
- ప్రతి ఏటా కొండలా పెరుగుతున్న డబ్బు



న్యూఢిల్లీ : బ్యాంకులు, పోస్టాఫీసులు, ఇతర ఆర్థిక రెగ్యులేటరీ సంస్థల వద్ద ప్రజలు దాచుకున్న సొమ్మును వారి తదనంతరం నామినీలకు అందజేస్తుంటారు. కుటుంబసభ్యులో లేదా వారసులో వాటిని క్లెయిమ్ చేస్తారు. అయితే ఆయా సంస్థల వద్ద ఎవరూ క్లెయిమ్ చేయని సొమ్ము రెండు లక్షల కోట్ల రూపాయలకు చేరిందని మనీలైఫ్ ఫౌండేషన్ అనే సంస్థ తెలియజేసింది. దీనికి సంబంధించిన నివేదికను ప్రముఖ బ్యాంకర్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ కేవీ కామత్ విడుదల చేశారు. 'నామినీలు, వారసులకు ఆస్తుల బదిలీలలో సవాళ్లు' పేరిట ఈ నివేదికను రూపొందించారు. నివేదిక విడుదల సందర్భంగా నిర్వహించిన చర్చా కార్యక్రమంలో కామత్ ప్రసంగించారు. రెగ్యులేటరీ సంస్థల వద్ద మూలుగుతున్న నిధులను ఎలా క్లెయిమ్ చేయాలో కొందరికి తెలియదని, అయితే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఇది చాలా సులభమైందని ఆయన చెప్పారు. అయినప్పటికీ ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా సరళీకరించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు.

క్లెయిమ్ చేయని ఆస్తులంటే...

ప్రభుత్వం వద్ద, ఆర్థిక రెగ్యులేటరీ సంస్థల వద్ద రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా క్లెయిమ్ చేయని నిధులు ఉన్నాయని, ఈ మొత్తం ఏటా 15-20% పెరుగుతోందని నివేదిక తెలిపింది. సాధారణంగా నిద్రాణంగా ఉన్న బ్యాంక్ ఖాతాలు, మెచ్యూరిటీ కాలం పూర్తయిన బీమా కంపెనీల పాలసీలు, బ్యాంక్ ఖాతాలలో అలాగే ఉండిపోయిన వ్యక్తుల సేవింగ్స్ మొత్తాలు, ఈక్విటీ-బాండ్ పెట్టుబడులు, ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్లు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు, పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతాలు, డివిడెండ్లు, సంవత్సరాల తరబడి సొమ్ము చేసుకోని వడ్డీ మొత్తాలు-ఇతర కార్పొరేట్ ప్రయోజనాలు....ఇవన్నీ క్లెయిమ్ చేయని ఆస్తులుగా ఉంటున్నాయి.

ఆ సొమ్మును ఏం చేస్తారు?

ఎవరూ క్లెయిమ్ చేయని సొమ్మును రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు చెందిన డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ (డీఈఏఎఫ్)లో చేరుస్తారు. ఈ సంవత్సరం మార్చి నాటికి ఈ మొత్తం రూ.78,213 కోట్లకు చేరింది. కార్పొరేట్ ప్రయోజనాల రూపంలో ఉన్న రూ.5,714 కోట్ల సొమ్ము గురించి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇటీవల లోక్‌సభకు తెలియజేసింది. ఈ మొత్తంలో వాటాల విలువను చేర్చలేదు. ఆగస్ట్ 1వ తేదీ నాటికి ఈ కంపెనీలలో ఐఈపీఈఎల వాటాలను రూ.82,199 కోట్లుగా లెక్కించారు. మాజీ బ్యాంకర్ హర్ష్ రూంగ్తా ఏర్పాటు చేసిన ఫీ ఓన్లీ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్ ఎల్‌ఎల్‌పీ' అనే సంస్థ ఈ విషయాన్ని తెలియజేసింది.

క్లెయిమ్ చేయని పోస్టాఫీస్ సేవింగ్స్, ప్రావిడెంట్ ఫండ్ సొమ్మును సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫండ్ (ఎస్‌సీడబ్ల్యూఎఫ్)కు బదిలీ చేస్తారు. పది సంవత్సరాల పాటు ఎవరూ క్లెయిమ్ చేయని సుమారు రూ.10,000 కోట్లను ఇలా బదిలీ చేయడం జరిగిందని ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్‌డీఏ) అంగీకరించింది. అయితే క్లెయిమ్ చేయని బీమా నిధులు రూ.22,000 కోట్ల నుండి రూ.27,000 కోట్ల వరకూ ఉండవచ్చునని వివిధ వర్గాలను ఉటంకిస్తూ నివేదిక తెలియజేసింది. అదే విధంగా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) వద్ద రూ.27,000 కోట్ల క్లెయిమ్ చేయని సొమ్ము ఉన్నదని బ్యాంక్‌బజార్.కామ్ అంచనా వేసింది. అయితే అసలు ప్రభుత్వం వద్ద, ఇతర రెగ్యులేటరీ సంస్థల వద్ద క్లెయిమ్ చేయని సొమ్ము కచ్చితంగా ఎంత ఉన్నదన్న విషయం మాత్రం తెలియదు.

ఏం చేయాలి?

ఆస్తులను క్లెయిమ్ చేసే వ్యక్తులు వాటికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందేందుకు వీలుగా సాంకేతికత సాయంతో ఏకీకృత వేదికను లేదా డాటాబేస్‌ను ఏర్పాటు చేయాలని మనీలైఫ్ ఫౌండేషన్ సిఫార్సు చేసింది. మరణాలకు సంబంధించిన సమాచారాన్ని కేంద్రీకృతం చేయాలన్న సెబీ సూచనను అంగీకరిస్తూ మరణాల నమోదు కోసం కేంద్రీకృత వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించింది. ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసి జనన మరణాల నమోదు, వాటి పరిశీలన జరిగేలా చూడాలని కోరింది. వివిధ సంస్థలకు మరణ ధృవీకరణ పత్రాలు అందజేయడం దీని ద్వారా సులభమవుతుంది.

కారణమేమిటి?

చనిపోయిన వారి ఆస్తులను నామినీలు, వారసులు క్లెయిమ్ చేసుకునేటప్పుడు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. నామినేషన్ ప్రక్రియలు స్పష్టంగా లేకపోవడం, ప్రామాణికమైన నిర్వహణ పద్ధతులు కొరవడడం, సమాచారం సరిగా సేకరించకపోవడం, పరిజ్ఞానం లేకపోవడం, అధికారుల వేధింపులు వంటి కారణాలతో క్లెయిముల పరిష్కారంలో అసాధారణ జాప్యం జరుగుతోంది.

అపరాజిత బిల్లుకు బెంగాల్ అసెంబ్లీ ఆమోదం



కొల్‌కతా : ది అపరాజిత వుమెన్ అండ్ చైల్డ్ (వెస్ట్ బెంగాల్ క్రిమినల్ లాస్ ఎమెండ్‌మెంట్) బిల్లు 2024ను పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ మంగళవారం వాయిస్ ఓటుతో ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ లైంగికదాడుల వ్యతిరేక బిల్లును రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి మోలోయ్ ఘటక్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 'చారిత్రాత్మకంగా' అభివర్ణించారు. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ 'బిల్లుపై సంతకం చేయాలని గవర్నర్‌ను కోరాలని' బీజేపీ ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేశారు. మానవాళికి లైంగికదాడి ఒక శాపమని, ఇలాంటి నేరాలను నిరోధించేందుకు సామాజిక సంస్కరణలు అవసరమని మమతా తెలిపారు. ఈ బిల్లు ఆమోదం పొందిన తరువాత గడువులోగా విచారణను పూర్తి చేసేందుకు స్పెషల్ అపరాజిత టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. 'ఇది చారిత్రాత్మకమైన, ఆదర్శమైన బిల్లు. మంచి ఉద్దేశ్యం ఉన్న ఎవరైనా ఈ బిల్లుకు మద్దతు ఇస్తారు' అని అన్నారు.

కాగా, ఈ బిల్లు ప్రకారం లైంగికదాడి తరువాత లేదా లైంగికదాడికి పాల్పడిన వారి చర్యల ద్వారా బాధిత మహిళ మరణించినా, మళ్లీ కొలుకోలేని స్థితిలో మహిళ ఉన్నా దోషులకు మరణశిక్ష విధిస్తారు.

కొల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన నేపథ్యంలో ఈ బిల్లును బెంగాల్ ప్రభుత్వం తీసుకొచ్చింది. కొల్‌కతా కేసును రాష్ట్ర పోలీసులు ఛేదించలేకపోతే సిబిఐకి అప్పగిస్తామని ఆ రోజునే మృతురాలి కుటుంబానికి చెప్పానని, ఇప్పుడు సిబిఐ నుంచి తమకు న్యాయం జరగాల్సి ఉందని ముఖ్యమంత్రి చెప్పారు.

ఈ బిల్లుకు ప్రతిపక్ష నాయకులు సువేందు అధికారి, ఎమ్మెల్యేలు కూడా పూర్తి మద్దతు ఇచ్చారు. అయితే సువేందు అధికారి ప్రతిపాదించిన సవరణలకు సభ ఆమోదం తెలపలేదు. సువేందు అధికారి ప్రసంగం తరువాత ప్రతిపక్ష ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనికి మమతా స్పందిస్తూ 'దేశంలో మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నందుకు ప్రధానమంత్రి మోడీ, హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి' అని డిమాండ్ చేశారు.

రైల్వే ఉద్యోగులపై అధిక ఫిర్యాదులు

- తరువాత స్థానంలో ఢిల్లీ స్థానిక సంస్థలు, పీఎస్‌యూ బ్యాంక్ సిబ్బంది
- సీవీసీ 2023 నివేదిక





న్యూఢిల్లీ : గత ఏడాది సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)కి అందిన ఫిర్యాదుల్లో ఎక్కువ ఫిర్యాదులు రైల్వే ఉద్యోగులపైనా ఉన్నాయి. తరువాత ఢిల్లీలోని స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. ఈ విషయాన్ని యాంటీ గ్రాఫ్ట్ వాచ్‌డాగ్ నివేదిక వెల్లడించింది. సీవీసీకి 2023లో మొత్తంగా అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులపై 74,203 ఫిర్యాదులు అందాయి. ఇందులో 66,373 ఫిర్యాదులను పరిష్కరించారు. మరో 7,830 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. విభాగాల వారీగా రైల్వే ఉద్యోగులపై అత్యధికంగా 10,447 ఫిర్యాదులు వచ్చాయి. తరువాత దేశరాజధానిలోని స్థానిక సంస్థల ఉద్యోగులుపై (గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (జీఎన్‌సీడీటీ) మినహాయించి) 7,665 ఫిర్యాదులు అందాయి. తరువాత అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన ఉద్యోగులపై 7,004 ఫిర్యాదులు వచ్చాయి. తరువాత ఢిల్లీలోని ప్రభుత్వ ఉద్యోగులపై 6,638 ఫిర్యాదులు వచ్చాయి.

ఢిల్లీ స్థానిక సంస్థల్లో ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ఢిల్లీ జల్ బోర్డ్, ఢిల్లీ టూరిజం అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, ఢిల్లీ ట్రాన్స్‌కో లిమిటెడ్, ఢిల్లీ అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్‌మెంట్ బోర్డ్, ఇంద్రప్రస్థ పవర్ జనరేషన్ కో. లిమిటెడ్, మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ, న్యూ ఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ సంస్థలకు చెందిన ఉద్యోగులపై ఫిర్యాదులు వచ్చాయి.

రైల్వే ఉద్యోగులపై వచ్చిన మొత్తం ఫిర్యాదుల్లో 9,881 పరిష్కరించగా, 566 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ఢిల్లీలోని స్థానిక సంస్థల ఉద్యోగులపై వచ్చిన ఫిర్యాదుల్లో 7,278 ఫిర్యాదులు పరిష్కరించారు. 387 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇక, 2023లో ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులపై 7,004 అవినీతి ఫిర్యాదులు అందగా వీటిలో 6,667 పరిష్కరించారు. 337 పెండింగ్‌లో ఉన్నాయి.

ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగులపై 6,638 ఫిర్యాదులు అందగా, 6,246 పరిష్కరించారు. వీటిల్లో ఢిల్లీ పోలీసు సిబ్బందిపై 5,313 ఫిర్యాదులు అందగా, వీటిలో 3,325 పరిష్కరించారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల ఉద్యోగులపై 4,476 ఫిర్యాదులు అందగా, 3,723 పరిష్కరించారు.

బొగ్గు మంత్రిత్వ శాఖలోని ఉద్యోగులపై మొత్తం 4,420 ఫిర్యాదులు, కార్మిక మంత్రిత్వ శాఖలోని ఉద్యోగులపై 3,217, పెట్రోలియం మంత్రిత్వ శాఖలోని ఉద్యోగులపై 2,749 ఫిర్యాదులు వచ్చాయి. హోం మంత్రిత్వ శాఖ సిబ్బందిపై 2,309 ఫిర్యాదులు అందాయి.

రక్షణ మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 1,861, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ ఉద్యోగులపై 1,828, టెలికమ్యూనికేషన్ ఉద్యోగులపై 1,457 గ్రాఫ్ట్ ఫిర్యాదులు అందాయి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఉద్యోగులపై 1,205 ఫిర్యాదులు అందాయి.ప్రభుత్వ రంగ బీమా కంపెనీల ఉద్యోగులపై 960 ఫిర్యాదులు, విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఉద్యోగులపై 930, వినియోగదారుల వ్యవహారాల ఉద్యోగులపై 929 ఫిర్యాదులు, ఆహారం- ప్రజాపంపిణీ సిబ్బందిపై 889 ఫిర్యాదులు అందాయి.

రెచ్చిపోయిన గో గూండాలు

- స్మగ్లర్లుగా భావించి విద్యార్థిని కాల్చి చంపిన గో గూండాలు



న్యూఢిల్లీ : గోవుల అక్రమ రవాణాదారులుగా భావించి 12వ తరగతి చదువుతున్న ఒక విద్యార్థిని గత నెల 23న కాల్చి చంపిన ఐదుగురు గో గూండాలను హర్యానా పోలీసులు అరెస్టు చేశారు. ఆ విద్యార్థి, అతడి స్నేహితులు ప్రయాణిస్తున్నకారును నిందితులు వెంటాడి మరీ అతడిపై కాల్పులు జరిపారని పోలీసులు తెలిపారు. నిందితులు ఐదుగురిని సౌరభ్, అనీల్ కౌశిక్, వరుణ్, కృష్ణ, ఆదేశ్‌లుగా గుర్తించినట్లు చెప్పారు. గోవుల స్మగ్లర్లు రెండు ఎస్‌యువిల్లో నగరంలో రెక్కి నిర్వహిస్తున్నారని తమకు 23వ తేది రాత్రి సమాచారం అందిందని నిందితులు ఇంటరాగేషన్‌లో తెలిపారు. బాధితుడు ఆర్యన్ మిశ్రా, అతడి స్నేహితులు షాంకీ, హర్షిత్‌లను స్మగ్లర్లుగా వారు భావించారు. దాంతో వారి కారును దాదాపు 30కిలోమీటర్లు ఢిల్లీ-ఆగ్రా జాతీయ రహదారిపై గద్‌పూరి టోల్ సమీపం వరకు ఛేజ్ చేశారని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. మిశ్రా కారును ఆపాల్సిందిగా నిందితులు అడిగారు కానీ వారు వినకుండా కారును ముందుకు పోనివ్వడంతో వెంటనే కాల్పులు జరిపారు. పల్వాల్ సమీపంలో మిశ్రాన కాల్చి చంపారు.

వృద్ధుడైన ముస్లింను రైల్లో నుండి తోసేసిన గో గూండాలు

రైల్లో వృద్ధుడైన ముస్లింపై నిర్దాక్షిణ్యంగా దాడి చేసిన గో గూండాలను అరెస్టు చేసి 24గంటలు కూడా గడవక మునుపే వారు బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే వారి బెయిల్‌ను రద్దు చేయాల్సిందిగా మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశించింది. థానే రైల్వే పోలీసులపై వచ్చిన ఒత్తిడి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. 72ఏళ్ళ వృద్ధుడిని అత్యంత పాశవికంగా కొట్టి రైల్లో నుండి తోసేసిన ఆ వ్యక్తులపై బెయిల్ మంజూరుకు అవకాశం వున్న సెక్షన్ల కింద పోలీసులు కేసు పెట్టారు. దీనిపై తీవ్రంగా దుమారం రేగింది. ఆగస్టు 30వ తేదీన అష్రఫ్ అలీ సయ్యద్ హుస్సేన్ జలగావ్ నుండి కల్యాణ్‌కు రైల్లో ప్రయాణిస్తున్నారు. 20ఏళ్ళ వయస్సులో వున్న కొంతమంది వ్యక్తులు హుస్సేన్‌పై దాడి చేశారు. రెండు ప్లాస్టిక్ డబ్బాల్లో గొడ్డు మాంసాన్ని తీసుకెళుతున్న విషయాన్ని గమనించిన వారు వెంటనే అతడిపై దాడి చేసి కదులుతున్న రైల్లో నుండి తోసివేశారు. మహారాష్ట్రలో ఆవు, దున్న మాసం నిషేధం, గొడ్డు మాంసం మాత్రం చట్టబద్ధం. అయితే ఇక్కడ చట్టానికి సంబంధించిన అంశాలేమైనా వుంటనే అవి చూసుకోవాల్సింది లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు. కానీ ఇక్కడ ఈ హిందూ కుర్రాళ్ళు ఒక్కసారిగా గో గూండాలుగా అవతారమెత్తారు. ఆ వృద్ధుడికి తగిలిన ముష్టిఘాతాలు ప్రాణాపాయాన్ని కలిగించేవి. కానీ పోలీసులు ఫిర్యాదులో మార్పులు చేసి చాలా స్వల్పమైన అభియోగాలతో కేసు నమోదు చేశారు.

నిందితులే మొదట ఇందుకు సంబంధించిన వీడియోలు విడుదల చేశారు. ఆ తర్వాత అవి వైరల్ అయ్యాయి. దాంతో ప్రతిపక్షాల నేతలు పలువురు వెంటనే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. మత సామరస్యతకు సంబంధించిన తీవ్రమైన ఆరోపణలు నమోదు చేయాలని పోలీసులపై ఒత్తిడి పెరిగింది.

వెస్ట్ బ్యాంక్‌లో కొనసాగుతున్న దాడులు

- ఇద్దరు టీనేజర్ల మృతి
- జాబాలియా శిబిరంపై దాడిలో 8మంది మృతి
- ఒప్పందం పట్ల చిత్తశుద్ధి లేని నెతన్యాహు : బైడెన్



గాజా : వెస్ట్ బ్యాంక్‌లోని తుల్కరెమ్, జెనిన్ నగరాలపై ఇజ్రాయిల్ ఆర్మీ దాడులు కొనసాగిస్తోంది. తాజా దాడుల్లో రెండు నగరాల్లో ఇద్దరు టీనేజర్లు చనిపోయారు. మాజీ ఖైదీలతో సహా 22మందిని అరెస్టు చేసినట్లు పాలస్తీనా ఖైదీల క్లబ్ తెలిపింది. గాజాలోని జాబాలియా శరణార్థ శిబిరంలో యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ స్కూలుపై జరిగిన దాడిలో 8మంది మరణించారు. వీరందరూ ఆహారం కోసం బ్రెడ్‌లు విక్రయించే దుకాణం వద్ద నిల్చుని వుండగా ఈ దాడి జరిగింది. జెయిటోన్ ప్రాంతంలో ఇజ్రాయిల్ కురిపించిన శతఘ్ని గుళ్ళ వర్షంలో ఒకరు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఉత్తర గాజాలో హమాస్ సొరంగం నెట్‌వర్క్‌ను ధ్వంసం చేసినట్లు మిలటరీ ప్రకటించింది. పోలియో వ్యాక్సిన్ కార్యక్రమం ముగిసిన వెంటనే సెంట్రల్ గాజాలోని డేర్ ఎల్ బాలాహ్ నగరంలో ఆస్పత్రి సమీపంలో సైన్యం దాడికి పాల్పడింది. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరిపి, బందీలను విడిపించాలని డిమాండ్ చేస్తూ వేలాదిమంది ఇజ్రాయిలీలు ప్రదర్శనలు జరిపినా తాను ఒత్తిళ్ళకు తలొగ్గేది లేదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహ తేల్చి చెప్పారు. దీనిపై హమాస్ సాయుధ విభాగం తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకునే కన్నా మరింత మంది బందీలను శవపేటికల్లో పెట్టి వారి కుటుంబాలకు అప్పగించడం పైనే నెతన్యాహు దృష్టి కేంద్రీకరిస్తున్నారని విమర్శించింది. ఇదాదాపు గత 11మాసాలుగా కొనసాగుతున్న దాడుల్లో 40,819మంది మరణించగా, 94,291మంది గాయపడ్డారు.

బైడెన్ వ్యాఖ్యలు

గాజా కాల్పుల విరమణ ఒప్పందం కోసం చేయాల్సినంత కృషి, తీసుకోవాల్సిన చర్యలు నెతన్యాహు తీసుకోవడం లేదని అమెరికా అధ్యక్షుడు బైడెన్ వ్యాఖ్యానించారు. సోమవారం వైట్‌హౌస్ వెలుపల విలేకర్లతో మాట్లాడుతూ ఆయన, గాజాలో ఇజ్రాయిల్ బందీలను విడిపించేందుకు దారి తీయగల తుది ప్రతిపాదనను అమెరికా త్వరలో సమర్పించనున్నట్లు తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదరడానికి గతంలో చేసిన ప్రతిపాదనలు విఫలమైనపుడు ఈ ప్రతిపాదన అమలవుతుందని ఎందుకు భావిస్తున్నారని విలేకర్లు ప్రశ్నించగా, ఆశలు చిగురించడమనేది సర్వ సాధారణమైన విషయమని వ్యాఖ్యానించారు. గాజాలో ఇజ్రాయిల్ అడ్డూఅదుపు లేకుండా కొనసాగిస్తున్న దాడులపై ముఖ్యంగా డెమోక్రాట్లలో తీవ్రమైన నిరసనలు వ్యక్తమవుతున్న వేళ ఆ ప్రభావాన్ని తగ్గించుకునేందుకు గత కొద్ది మాసాలుగా నెతన్యాహుతో దూరం పాటించేందుకు బైడెన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్‌ను ఇలా బహిరంగంగా విమర్శించడం కూడా ఆ కోవలోకే వస్తుంది.

పొమ్మన్నారా.. పొగబెట్టారా..!

(మొదటిపేజీ తరువాయి)

? అనే చర్చ కూడా చోటుచేసుకుంది.

బీఆర్‌ఎస్ హయాంలో..

రోడ్లు, భవనాల శాఖలో గణపతిరెడ్డి పెద్ద హోదా గల అధికారి. 2017లో ఈఎన్సీగా పదవీ విరమణ చేసినా నాటి బీఆర్‌ఎస్ సర్కారు అండతో తిరిగి అదే హోదాలో కొనసాగారు. ఆర్ అండ్ బీ శాఖలోని అత్యంత ముఖ్యమైన నిర్మాణాలన్ని ఆయన హయాంలోనే సాగాయి. సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, 25 జిల్లాల కలెక్టరేట్లు, 110కిపైగా ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు నిర్మించిన ఈఎన్సీ ప్రస్తుతం భారీ ప్రాజెక్టులు ముందుకు తీసుకెళ్లాల్సిన తరుణంలో రాజీనామాపై తీవ్ర చర్చలే జరుగున్నాయి. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హైదరాబాద్‌లోని టిమ్స్ నిర్మాణాలన్ని గణపతిరెడ్డి ఆధ్వర్యంలోనే సాగాయి. ఈ శాఖలోని భవనాల డివిజన్‌పై ఉన్న ప్రధాన ఆరోపణ పనుల్లో అడ్డగోలుగా అంచనాలు పెంచేయడమే కారణమని తెలిసింది. రాష్ట్రంలోని జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) పనులు ఈయనే పర్యవేక్షిస్తున్నారు. అలాగే రీజినల్ రింగ్ రోడ్డు వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. టిమ్స్‌పై ఆగస్టు 27న సమీక్ష చేసిన సీఎం ఫైళ్లు సక్రమంగా లేకపోవడం, ఎస్టిమేట్లను అధికంగా పెంచేయడం సరికాదని సీఎం భావించినట్టు తెలిసింది. వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్‌పై అంచనాల పెంపుపై అసంతృప్తిగా ఉన్న ముఖ్యమంత్రి వెంటనే విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఆ రోజు నుంచి ఆగస్టు 31 వరకు ఈఎన్సీ గణపతిరెడ్డి సెలవుపై ఐదు రోజుల వియత్నాం పర్యటనకు వెళ్లారు. ఆయన తిరిగి వచ్చేలోపే ఆర్‌అండ్‌బీ(పరిపాలన)లో సీఈ పనిచేస్తున్న పి.మధుసూదన్‌రెడ్డిని తాత్కాలిక ఈఎన్సీగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ చర్య గణపతిరెడ్డి నొచ్చు కోవడానికి కారణమైందని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో చర్చలు జరిగాయి. నిజానికి గత ఏడాది డిసెంబరులో కొత్త ప్రభుత్వం రాగానే గణపతిరెడ్డి రాజీనామా చేశారు. ఎక్కువగా కాలం ఈఎన్సీగా పనిచేసినందున ఆరు నెలల క్రితమే తాను రాజీనామా చేశాననీ, ప్రభుత్వం ఇప్పుడు ఆమోదిం చిందని గణపతిరెడ్డి 'నవతెలంగాణ'కు వివరణ ఇచ్చారు.

అంచనాల తారుమారుపై సర్కారు గుర్రు

ఆగస్టు 27న వైద్యారోగ్య శాఖ అధికారులతో దవాఖానాలపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా వరంగల్ హెల్త్ సిటీ, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌ల అంచనాలను ఊహించని విధంగా పెంచిన తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. వరంగల్‌లోని 24 అంతస్తుల్లో రూ. 1100 కోట్లతో పనులు చేపట్టి ఏకంగా రూ. 1,726 కోట్లకు అంచనాలు పెంచ డాన్ని సీఎం తప్పుబట్టారు. వీటిని రూ.2,679 కోట్లతో ప్రారంభించగా, రూ.3,562 కోట్లకు అంచనాలు పెంచారు. వరంగల్ హెల్త్ సిటీ రూ.526 కోట్లు, టిమ్స్ రూ.883 కోట్లు కలిపి రూ.1509 కోట్లుగా ఫైళ్లలో అంచనాలు అధికం చేసినట్టు సర్కారు గుర్తించింది.

కొత్త ఎంబీబీఎస్ సిలబస్ తప్పుల తడక

- ట్రాన్స్‌జెండర్ల, వికలాంగ హక్కుల గ్రూపులు



న్యూఢిల్లీ : కొత్త ఎంబీబీఎస్ సిలబస్ పూర్తిగా తప్పుల తడకలతో నిండివుందని ట్రాన్స్‌జెండర్, వికలాంగ హక్కుల గ్రూపులు విమర్శిస్తున్నాయి. ఈ తప్పులను వెంటనే సరిదిద్దాలని రాబోయే వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని వారు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసి)ను కోరుతున్నారు. దిద్దుబాటు చర్యలు తీసుకోని పక్షంలో ఎన్‌ఎంసిని తాత్కాలికంగా సస్పెండ్ చేయాలని కోరుతూ ప్రపంచ సమాఖ్యకు లేఖ రాస్తామని పేర్కొన్నారు. ఇటీవల ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం జాతీయ మెడికల్ కమిషన్ జారీ చేసిన సిలబస్ మార్గదర్శకాల ప్రకారం సోడొమిని, అలాగే లెస్బియన్‌గా వుండడాన్ని లైంగిక నేరంగా పరిగణిస్తారు. క్రాస్ డ్రెస్సింగ్ అనేది లైంగిక వికృత చేష్టల కిందకు వస్తుంది. ఇలాంటివన్నీ ఆ మార్గదర్శకాల్లో వున్నాయి. వికలాంగులైన డాక్టర్ల సంక్షేమం కోసం పనిచేసే ఏజెంట్స్ ఆఫ్ ఛేంజ్ గ్రూప్‌కు నాయకత్వం వహిస్తున్న సత్యేంద్ర సింగ్ మీడియాతో మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్ల రక్షణ చట్టం, 2019ని ఎన్‌ఎంసి ఉల్లంఘిస్తోందని అన్నారు. కేరళ, మద్రాసు హైకోర్టులు సూచించిన తర్వాత కమిషన్ 2021 అక్టోబరు 13న అన్ని మెడికల్ వర్సిటీలకు ఒక లేఖ రాసింది. అశాస్త్రీయమైన, అప్రతిష్టకరమైన, ఎల్‌జిబిటిక్యు కమ్యూనిటీ పట్ల వివక్ష గల సమాచారాన్ని ఆమోదించరాదని ఆ వర్సిటీలను కోరింది. ఇప్పుడు ఆ చట్టమే ఉల్లంఘించబడుతోందని వికలాంగుల హక్కుల గ్రూపులు పేర్కొన్నాయి.

సంపాదకీయం

కన్నీటి వరద

'ఇది కల్పాంతమో యిమ్మహోగ్ర సలిలం బేకార్ణవాకారమై... జగముల్ పోజేసెనో ధాతయెయ్యిది దిక్కెక్కడ ఎవ్విధంబునం బ్రాణంబు రక్షించుకోలొదవున్...' అంటూ ఎర్రన హరివంశంలో పాడిన పద్యం గుర్తుకొస్తోంది. మన్నూ, మిన్నును ఏకం చేస్తూ వరద సృష్టించిన బీభత్సంతో రాష్ట్రం తల్లడిల్లిపోయింది. వాగులూ వంకలూ పొంగి పొర్లాయి. రోడ్లూ, వంతెనలు, ఇండ్లు కొట్టుకుపోయాయి. లక్షలమంది సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. వేల ఎకరాల పంట నీట మునిగి రైతులు గుండెలు పగిలేలా ఏడుస్తున్నారు.

శని, ఆదివారాల్లో కురిసిన భారీ వర్షాలతో రాష్ట్రం చిగురుటాకులా వణికిపోయింది. ఉమ్మడి నల్గొండ, మానుకోట, ఖమ్మం జిల్లాల్లో నేటికి వాన ఉధృతి కాస్త తగ్గింది. కానీ ప్రజల కంట కన్నీరు మిగిల్చింది. వేలాదిగా ఇండ్లు కూలిపోయాయి. అయినవారిని కోల్పోయిన వారు కొందరైతే, కట్టుబట్టలతో మిగిలినవారు ఇంకొందరు. ఖమ్మం చరిత్రలో ఎప్పుడూ లేనంతగా పోటెత్తిన మున్నేరు వరద ప్రజల కష్టాలకు కారణమైంది. కోలుకోలేని దెబ్బ తీసింది. ఇండ్లన్నీ బురదమయ మయ్యాయి. దాచుకున్న బియ్యం, పప్పులు పనికిరాకుండా పోయాయి. రూపురేఖలు మారిపోయిన ఇండ్లను చూసుకొని కన్నీరుమున్నీర య్యారు. గంగారంలో సైంటిస్ట్ అశ్వినీ, ఆమె తండ్రిని పొట్టన పెట్టుకొని విషాదాన్ని మిగిల్చింది. ఒక్క ఖమ్మం జిల్లాలోనే వరద మిగిల్చిన నష్టం రూ.వెయ్యి కోట్లుగా ప్రభుత్వం అంచనా వేసిందంటే వరద బీభత్సం ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



ఇక మహబూబాబాద్ వరద ప్రమాదం నుండి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. చెరువులకు గండ్లు పడటంతో గ్రామాలు చెరువులను తలపిస్తున్నాయి. కొట్టుకుపోయిన రోడ్లు జలవిలయానికి అద్దం పడుతు న్నాయి. రాకపోకలు నిలిచి జనజీవనం స్తంభించింది. రైల్వే ట్రాక్ ధ్వంసమై పట్టాలు గాల్లో వేలాడాయి. ఇలా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రజలకు వరద కన్నీటిని మిగిల్చింది. అటు ఆంధ్రాలో బుడమేరు పొంగిపొర్లడంతో రెండులక్షల మంది వరదల్లో చిక్కుకున్నారు. పందొమ్మిది మంది మరణించారు. విజయవాడ మూడు రోజుల నుండి నీటిలో నానుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 481 రైళ్ల రద్దు చేశారు.దీంతో ప్రయాణికులు రైల్వే స్టేషన్లలో ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు.

హుసేన్‌సాగర్ పొంగిపొర్లడంతో హైదరా బాద్ నగర ప్రజలు కూడా నిన్నటి వరకు బిక్కుబిక్కుమంటూ బతికారు. వరుణుడు కాస్త శాంతించడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలు రకరకాల జ్వరాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇక ఈ వరద దెబ్బకు మరిన్ని అంటురోగాలు ప్రబలే ప్రమాదమూ లేకపోలేదు. వరద బాధితులను ఆదుకునేందుకు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలను లెక్క చేయకుండా సహాయ చర్యలను పరిశీలించారు. రేవంత్‌రెడ్డి ఈ పాటికే తక్షణసాయంగా రూ.పదివేలు ప్రకటించారు. చనిపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు రూ.ఐదు లక్షలు అందజేస్తున్నా రు. తక్షణం జరగాల్సి చర్యలు సరే! మరి ముందస్తు జాగ్రత్తల సంగతేంటి?

ఈ ప్రకృతి ప్రకోపానికి కారణమెవరు? ప్రకృతితో మమేకమై సాగాల్సిన మనిషి ప్రయాణం రియల్ ఎస్టేట్‌కు దాసోహమంటోంది. ఇసుక రవాణా కోసం చెరువులను అక్రమంగా తవ్వేస్తున్నారు. ఊళ్లో ఉండాల్సిన ఇళ్లు చెరువులోకి వస్తే, చెరువులో ఉండాల్సిన నీరు ఇండ్లను ముంచేస్తోంది. ఇదంతా కూర్చున్న కొమ్మను నరుక్కుంటున్న మనిషి అవివేకం కాదా! ప్రకృతి ఎప్పుడు విజృంభిస్తుందో తెలియక ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బతకాల్సిందేనా? వాస్తవానికి రాష్ట్రంలో ఇలాంటి విపత్తులు ఎదురయితే ఎదుర్కొనే కమిటీ నిర్వహణ సక్రమంగా లేదు. అది సమావేశమై పదేండ్లు గడిచిపోయింది. ప్రజల ప్రాణాల పట్ల ప్రభుత్వాల చిన్నచూపుకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?

'నువ్వెంత నేనెంత రవ్వంత... ఎన్నో ఏళ్లదీ సృష్టి చరిత... ప్రేమించే పెద్దమ్మే ఈ విశ్వం... ఇష్టంగా గుండెకు హత్తుకుందాం... కన్నెరైతే నీరై ఓ కొంచం... తల్లడిల్లిందో ఈ తల్లి ఏ ఒక్కరు మిగలం... ' అన్నట్టు ప్రకృతి ముందు మనిషి పిసరంత. దాంతో పెట్టుకుంటే నాశనమయ్యేది మనిషే. కనుక ప్రకృతిని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది. ముఖ్యంగా ప్రభుత్వాలు రియల్ ఎస్టేట్, భూ కబ్జాలు, అక్రమ ఇసుక తవ్వకాలపై దృష్టి పెట్టాలి. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ముంపు ప్రాంతాలను ముందే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికైనా సంబం ధించిన కమిటీతో పని ప్రారంభించాలి. రాబోయే తరాలైనా ప్రకృతి కోపానికి బలవ్వకుండా చూడాలి. పంట నష్టపోయిన రైతులకు, కౌలురైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలి. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్టు కేంద్రం వెంటనే ఈ వరదలను జాతీయ విపత్తుగా గుర్తించి తగు సహాయసహకారాలు అందించి ప్రజలను ఆదుకోవాలి.

> ఈ ప్రకృతి ప్రకోపానికి కారణమెవరు? ప్రకృతితో మమేకమై సాగాల్సిన మనిషి ప్రయాణం రియల్ ఎస్టేట్‌కు దాసోహమంటోంది. ఇసుక రవాణా కోసం చెరువులను అక్రమంగా తవ్వేస్తున్నారు. ఊళ్లో ఉండాల్సిన ఇళ్లు చెరువులోకి వస్తే, చెరువులో ఉండాల్సిన నీరు ఇండ్లను ముంచేస్తోంది. ఇదంతా కూర్చున్న కొమ్మను నరుక్కుంటున్న మనిషి అవివేకం కాదా! ప్రకృతి ఎప్పుడు విజృంభిస్తుందో తెలియక ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బతకాల్సిందేనా?

రెచ్చిపోతున్న ఇజ్రాయిల్ :వెస్ట్‌బాంక్‌కు విస్తరించిన దాడులు!



ఎం కోటేశ్వరరావు
8331013288

గతేడాది అక్టోబరు ఏడు నుంచి పాలస్తీనాలోని గాజా ప్రాంతంపై మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్ ఏడు రోజులుగా ఉగ్రవాదులను ఏరివేసే పేరుతో వెస్ట్ బాంక్ ప్రాంతమంతటా దాడులకు తెగబడింది. అనేక మంది ప్రాణాలు తీసింది. విచక్షణా రహితంగా అరెస్టులు చేస్తోంది. అక్కడేమీ హమాస్ పార్టీ లేదా దాని మద్దతుదారులెవరూ లేరు.ఒక వైపు గాజాలో పసిపిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెబుతూనే మరోవైపు మిలిటరీదాడులు చేస్తోంది.గాజాలోని ఒక సొరంగంలో శనివారం నాడు ఆరుగురు బందీల మృతదేహాలు దొరకటంతో ఇజ్రయిల్ పౌరులు దేశమంతటా లక్షలాది మంది నిరసన ప్రదర్శనలు జరపటంతో పాటు సాధారణ సమ్మె పాటించారు. ప్రధాని నెతన్యాహు దీనికి బాధ్యత వహించాలని రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.తాము బందీల వద్దకు వెళ్లటానికి కొద్దిసేపటి ముందే హమాస్ వారిని చంపిందని ఇజ్రాయిల్ ఆరోపించింది.ఇజ్రాయిల్ దాడుల్లోనే వారు మరణించారని హమాస్ చెబుతోంది. సోమవారం నాటికి ఇజ్రాయిల్ దాడులలో గాజాలో 40,786 మంది మరణించగా 94,224 మంది గాయపడ్డారు. మరణాలతో పాటు గాజాలో ఇప్పటివరకు 60శాతం నివాస గృహాలు, 80శాతం వాణిజ్య సముదాయాలు,65శాతం సాగు భూమి, 65శాతం రోడ్లు పనికి రాకుండా చేశారు.ఆసుపత్రులు 36 ఉండగా వాటిలో 17మాత్రమే పాక్షికంగా పని చేస్తున్నాయి. అదే మాదిరి 85శాతం పాఠశాల భవనాలను నేలమట్టం చేశారు. హమాస్ సాయుధులు వీటిని కేంద్రాలుగా చేసుకొని దాడులు చేస్తున్నట్లు ఇజ్రాయిల్ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. గాజాలోని ఒక పాఠశాలలో నిర్వహిస్తున్న హమాస్ కమాండ్ కేంద్రాన్ని తమ వైమానిక దళం నాశనం చేసిందని ఇజ్రాయిల్ చెప్పుకుంది. పాలస్తీనాలో జోర్డాన్ నది పశ్చిమంగా ఉన్న ప్రాంతాన్నే వెస్ట్‌బాంక్ లేదా పశ్చిమ గట్టు అంటున్నారు. అది 5,650చదరపు కిలోమీటర్లలో ఉంది.జనాభా 30లక్షలు.దానికి ఒకవైపు జోర్డాన్, మరోవైపు ఇజ్రాయిల్, మూడోవైపు మృత సముద్రం(డెడ్ సీ) ఉంది.గాజాకు వెళ్లాలంటే ఇజ్రాయిల్ ప్రాంతాల నుంచే దారి ఉంది.అది పూర్తిగా పాలస్తీనాకు చెందినప్పటికీ అనేక ప్రాంతాలను ఇజ్రాయిల్ ఆక్రమించింది.దాంతో 8లక్షల 71వేల మంది పాలస్తీనియన్లు తమ స్వంత గడ్డమీదే శరణార్థులుగా శిబిరాలలో ఉన్నారు. ఇప్పుడు ఇజ్రాయిల్ వాటి మీద కూడా దాడులు చేస్తున్నది.తక్షణమే హమాస్‌తో రాజీకి వచ్చి వారి వద్ద ఉన్న వందకు పైగా ఉన్న బందీలను విడిపించాలని కోరుతున్నట్లు అనేక సర్వేలు వెల్లడించినప్పటికీ నెతన్యాహు ఖాతరు చేయటం లేదు.మరోవైపు ఇటీవల ఇరాన్ జరిపిన క్షిపణుల దాడి తరువాత సామాన్య జనంలో భయాందోళనలు పెరుగుతున్నాయి.ఆపరేషన్ ట్రూ ప్రామిస్ పేరుతో సెకనుకు ఒకటి చొప్పున 100 క్షిపణులను ప్రయోగించి ఉక్కిరిబిక్కిరి చేసింది.దీన్ని అమెరికా,ఇజ్రాయిల్ ఊహించలేదు.మా



తడాఖా ఇది అని ఇరాన్ ప్రదర్శించిన తరువాత దాడి నిలిపివేసింది. అందువలన ఎప్పుడేం జరుగుతుందో తెలియటం లేదు.

గాజాతో పాటు వెస్ట్‌బాంక్ ప్రాంతం మీద కూడా జరుపుతున్న దాడులను చూస్తే పశ్చిమాసియాలో మరో ప్రాంతీయ యుద్ధానికి రెచ్చగొడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇదంతా అమెరికా కనుసన్నల్లోనే అని వేరే చెప్పనవసరం లేదు. అయితే ఈ దాడులతో ఇజ్రాయిల్ మరింతగా సంక్షోభంలో కూరుకుపోతున్నదని చెప్పవచ్చు. పాలస్తీనియన్ల రెండవ తిరుగుబాటు 2000 నుంచి 2005 వరకు జరిగింది. ఆ సందర్భంగా ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో మూడువేల మందికిపైగా మరణించారు. తరువాత మరోసారి ఇప్పుడు తెగబడుతోంది. ఇరాన్ మద్దతు ఉన్న ఉగ్రవాదులను అణచే సాకుతో ఇప్పుడు దాడులకు దిగుతోంది.ఈ పరిణామాన్ని గాజా 2.0గా వర్ణిస్తున్నారు. గాజా మారణ కాండ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు వెస్ట్‌బాంక్‌లో అడపాదడపా జరుపుతున్న దాడుల్లో 150 మంది పిల్లలతో సహా 650 మంది మరణించారు. ఇప్పటి వరకు 10,300 దాడులు జరిగాయి, ఆ ప్రాంతంలోని యూదు ఆక్రమణదార్లకు వేలాది ఆయుధాలను అందించి అరబ్బులపై దాడులకు రెచ్చగొడుతున్నది. గతవారం రోజులుగా అనేక పట్టణాల్లో ఉన్న నిర్వాసితుల శిబిరాలపై మిలిటరీ దాడులు చేస్తున్నది. ఓస్లో ఒప్పందాల ప్రకారం వెస్ట్‌బాంక్‌లో పాలస్తీనా ఫతా ప్రభుత్వం ఉన్నప్పటికీ అక్కడ అది చేసేదేమీ లేదు. అడుగడుగునా ఇజ్రాయిల్ మిలిటరీ, సాయుధ దళాలు ఉన్నాయి. పాలస్తీనియన్ ప్రాంతాల ఆక్రమణ, వాటిలో యూదుల నివాసాల ఏర్పాటు, జనాభా నిష్పత్తిని మార్చివేసే కుట్ర కొనసాగుతూనే ఉంది.వాటిని ప్రతిఘటించేవారిని అణచివేసేందుకు యూదుల రక్షణ పేరుతో ఇజ్రాయిల్ మిలిటరీ తిష్టవేసింది. విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్ కాట్జ్ మాట్లాడుతూ " గాజాలో ఉగ్రవాదుల వ్యవస్థను దెబ్బతీస్తున్నట్లుగానే ఇక్కడ కూడా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, విజయం సాధించాలని " ప్రకటించాడు. వెస్ట్‌బాంక్‌పై దాడికి ఇజ్రాయిల్ చెబుతున్న సాకులన్నీ అబద్దాలేనని జోర్డాన్ విదేశాంగ మంత్రి అయమాన్ సఫాదీ వర్ణించాడు.పాలస్తీనియన్లను తమ ప్రాంతాల నుంచి తరిమివేసే ఏ చర్యనైనా తాము వ్యతిరేకిస్తామన్నాడు.

తాజా పరిణామాలలో వెస్ట్‌బాంక్‌లో కూడా ప్రతిఘటించటం మినహా పాలస్తీనియన్లకు మరోదారి లేదు.ఇజ్రాయిల్ కోరుకుంటున్నది కూడా అదే కావటంతో కావాలని రెచ్చగొడుతున్నది. ఇటీవల చైనా మధ్యవర్తిత్వంలో పాలస్తీనా విముక్తి సంస్థలన్నీ ఒక అవగాహనకు వచ్చిన సంగతి తెలిసిందే.ఇప్పటి వరకు హమాస్‌ను వ్యతిరేకిస్తున్న పరిమిత అధికారాలున్న పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్ కూడా పిఎల్‌ఓలో హమాస్ భాగస్వామ్యాన్ని అంగీకరించాడు. గత కొద్ది సంవత్సరాలుగా ఇజ్రాయిల్ దిగ్బంధనంతో వెస్ట్‌బాంక్‌లో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్నది. సహజంగానే అబ్బాస్ మీద వ్యతిరేకతను పెంచుతుంది. నేడు గాజాలో జరుగుతున్నది రేపు తమ మీద కూడా జరగవచ్చనే ఆందోళన వెస్ట్‌బాంక్‌లో తలెత్తింది.దీన్ని గమనించే అబ్బాస్ కూడా గత వైఖరిని మార్చుకోవాల్సి వచ్చింది.హమాస్ కూడా ఒక అడుగు వెనక్కు తగ్గింది. ఈ కారణంగానే వెస్ట్‌బాంక్‌లో రాజకీయ విభేదాలతో నిమిత్తం లేకుండా పాలస్తీనియన్లు ప్రతిఘటిస్తున్నారు.ఇది అమెరికా, ఇజ్రాయిల్ మీద ఒత్తిడిని పెంచుతుంది, మరో మాటలో చెప్పాలంటే ఊహించని పరిణామం. తాజా దాడులకు ఇది ఒక కారణం. దీన్ని చూపి దిగజారుతున్న తన ప్రతిష్ఠను నిలుపుకొనేందుకు నెతన్యాహు చూస్తున్నాడు. రెండుదశాబ్దాల నాటి పరిస్థితికీ ఇప్పటికీ వచ్చిన తేడాను యూదు దురహంకారులు గుర్తించటం లేదు.గాజా పరిణామాలు పక్కనే ఉన్న జోర్డాన్ రాజు అబ్దుల్లాకు ఎసరుతెచ్చేవిగా ఉన్నాయి.వెస్ట్‌బాంక్‌లో దాడుల కారణంగా పాలస్తీనియన్లు నిర్వాసితులైతే జోర్డాన్ వారికి ఆశ్రయం కల్పించే స్థితిలో లేదు. తిరస్కరించే పరిస్థితి కూడా రాజుకు లేదు. పాలస్తీనియన్ల మీద దాడులు పెరిగితే జోర్డానియన్లు సహించరు. ఈజిప్టు, యుఏయి, మొరాకో, బహరెయిన్ దేశాల పాలకులు ఇజ్రాయిల్‌తో మిత్ర సంబంధాలు కలిగి ఉన్నారు.వారి మీద కూడా జనం నుంచి ఒత్తిడి పెరుగుతుంది.ఒక్క గాజా, వెస్ట్‌బాంక్ ప్రాంతాల నుంచే కాదు, గోలన్ గుట్టలు,లెబనాన్‌లోని ఆక్రమిత ప్రాంతాల నుంచి కూడా ఇజ్రాయిల్ వైదొలగాలనే డిమాండ్ పెరుగుతుంది. వెస్ట్ బాంక్ ప్రాంతంలో రెండవ తిరుగుబాటు జరిగినపుడు 2002లో 70వేల యూదుల నివాసాలుంటే వాటిని ఇజ్రాయిల్2024నాటికి ఎనిమిది లక్షలకు పెంచింది. వాటన్నింటినీ ఖాళీ చేసి అక్రమంగా ప్రవేశపెట్టిన యూదులందరినీ అక్కడి నుంచి తరలించాల్సి ఉంది.తూర్పు జెరూసలెం రాజధానిగా గణతంత్ర పాలస్తీనా ఏర్పడాలన్న ఐరాస తీర్మానం అమలు తప్ప మరొక పరిష్కారం లేదు.

ఇజ్రాయిల్ జరుపుతున్న మారణకాండకు అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు నిస్సిగ్గుగా మద్దతు ఇస్తున్నాయి.గాజా మారణహోమానికి నిరసనగా ఇరాన్ ఒకవేళ దాడులకు దిగితే అడ్డుకొనేందుకు అమెరికా తన నౌక,వైమానిక దళాలను పెద్ద ఎత్తున ఎర్రసముద్ర ప్రాంతానికి తరలించింది.ఒకేసారి పలు రంగాలలో దాడులకు నెతన్యాహు ఎందుకు పాల్పడుతున్నాడనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. లెబనాన్,ఇరాన్‌లలో హమాస్ నేతలను హత్య చేయటం, హిజబుల్లాను రెచ్చగొట్టటం,గాజాతో పాటు ఇప్పుడు వెస్ట్‌బాంక్‌పై దాడులకు దిగటం చూస్తున్నాము.నెతన్యాహు అమెరికా పర్యటన జరిపి చర్చలు జరిపి వచ్చిన తరువాత వెస్ట్‌బాంక్ మీద దాడులకు దిగింది.ఎవరెన్ని వివరణలు, భాష్యాలు చెప్పినప్పటికీ పొసగటం లేదు. అమెరికా ఎన్నికలు ముగిసేవరకు వర్తమాన పరిణామాలు ఇలాగే కొనసాగవచ్చు. ఉద్రిక్తతలను మరింత పెంచటం ద్వారా బైడెన్ మీద ఒత్తిడి పెరుగుతుందని అది తన విజయానికి బాట వేస్తుందనే అంచనాతో ట్రంప్ ఉన్నట్లు, అతగాడి నుంచి వచ్చిన సూచన మేరకు నెతన్యాహు రెచ్చిపోతున్నట్లు ఒక భాష్యం. బైడెన్ అమెరికాలో పలుకుబడి కలిగిన యూదుల మద్దతు పొందటానికి వారిని సంతుష్టీకరించేందుకు దాడులకు మద్దతిస్తున్నాడని, దానికి అనుగుణంగానే ఇజ్రాయిల్ వ్యవహరిస్తున్నదనే కథనాలు కూడా ఉన్నాయి. ప్రాంతీయ యుద్ధం తలెత్తితే అది ఎన్నికల్లో తమకు లాభిస్తుందని డెమోక్రాట్లు భావిస్తున్నారని కూడా చెబుతున్నారు. అయితే ఇప్పటికే ఉక్రెయిన్‌లో తగులుతున్న ఎదురుదెబ్బలు, భారీ ఖర్చును చూసిన తరువాత అమెరికా మరో రంగంలో చేతులు కాల్చుకుంటుందా, పరువు పోగొట్టుకొని పలుచన అవుతుందా? కారణాలేమైనప్పటికీ అమెరికా పన్నిన వలలో చిక్కుకొనేందుకు ఇరాన్ తదితర దేశాలు సిద్ధంగా లేవు.అయితే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అది సిద్ధమౌతోంది. సౌదీతో ఉన్న విభేదాలను పరిష్కరించుకోవటంలో అదే కనిపిస్తున్నది. హమాస్‌తో రాజీకి వచ్చినా తనదే పైచేయి అని చెప్పుకొ నేట్లుగా నెతన్యాహు చూస్తున్నాడు, లేనట్లయితే ప్రతిపక్షం వెంటనే దాడి ప్రారంభిస్తుంది. అందుకే అసాధ్యమైన షరతులను విధిస్తున్నట్లు చెబుతున్నారు. గాజా-ఈజిప్టు సరిహద్దులో ఫిలడెల్ఫీ,నెట్‌జారిమ్ కారిడార్లలో తమ మిలిటరీని అనుమతించాలన్నది వాటిలో ఒకటి. దానికి హమాస్ ససేమిరా అంటున్నది.అక్కడ తీవ్రమైన ప్రతిఘటన ఉన్నప్పటికీ మిలిటరీ కొనసాగాల్సిందేనని ఇజ్రాయిల్ యుద్ధ కాబినెట్ తీర్మానించింది. అమెరికాలో నవంబరులో ఎన్నికలు జరిగి కొత్తగా అధికారంలోకి వచ్చేవారు ఒక నిర్ణయం తీసుకునే వరకూ పాలస్తీనాలో మారణకాండ సాగేలా కనిపిస్తున్నది.

> పాలస్తీనాలో జోర్డాన్ నది పశ్చిమంగా ఉన్న ప్రాంతాన్నే వెస్ట్‌బాంక్ లేదా పశ్చిమ గట్టు అంటున్నారు. అది 5,650చదరపు కిలోమీటర్లలో ఉంది.జనాభా 30లక్షలు.దానికి ఒకవైపు జోర్డాన్, మరోవైపు ఇజ్రాయిల్, మూడోవైపు మృత సముద్రం(డెడ్ సీ) ఉంది.గాజాకు వెళ్లాలంటే ఇజ్రాయిల్ ప్రాంతాల నుంచే దారి ఉంది.అది పూర్తిగా పాలస్తీనాకు చెందినప్పటికీ అనేక ప్రాంతాలను ఇజ్రాయిల్ ఆక్రమించింది.దాంతో 8లక్షల 71వేల మంది పాలస్తీనియన్లు తమ స్వంత గడ్డమీదే శరణార్థులుగా శిబిరాలలో ఉన్నారు. ఇప్పుడు ఇజ్రాయిల్ వాటి మీద కూడా దాడులు చేస్తున్నది.తక్షణమే హమాస్‌తో రాజీకి వచ్చి వారి వద్ద ఉన్న వందకు పైగా ఉన్న బందీలను విడిపించాలని కోరుతున్నట్లు అనేక సర్వేలు వెల్లడించినప్పటికీ నెతన్యాహు ఖాతరు చేయటం లేదు.

> గాజా మారణకాండ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు వెస్ట్‌బాంక్‌లో అడపాదడపా జరుపుతున్న దాడుల్లో 150 మంది పిల్లలతో సహా 650 మంది మరణించారు. ఇప్పటి వరకు 10,300 దాడులు జరిగాయి, ఆ ప్రాంతంలోని యూదు ఆక్రమణదార్లకు వేలాది ఆయుధాలను అందించి అరబ్బులపై దాడులకు రెచ్చగొడుతున్నది. గతవారం రోజులుగా అనేక పట్టణాల్లో ఉన్న నిర్వాసితుల శిబిరాలపై మిలిటరీ దాడులు చేస్తున్నది. ఓస్లో ఒప్పందాల ప్రకారం వెస్ట్‌బాంక్‌లో పాలస్తీనా ఫతా ప్రభుత్వం ఉన్నప్పటికీ అక్కడ అది చేసేదేమీ లేదు. అడుగడుగునా ఇజ్రాయిల్ మిలిటరీ, సాయుధ దళాలు ఉన్నాయి. పాలస్తీనియన్ ప్రాంతాల ఆక్రమణ, వాటిలో యూదుల నివాసాల ఏర్పాటు, జనాభా నిష్పత్తిని మార్చివేసే కుట్ర కొనసాగుతూనే ఉంది.

పోషకాహారం లోపం... పాలకుల వైఫల్యం!

పౌష్టికాహార లోపం ప్రబలమైన భారంతో మనదేశం గణనీయ మైన సవాలును ఎదుర్కొంటోంది. ఈ సమస్య దేశంలోని సామాజిక, ఆర్థిక సాంస్కృతిక వ్యత్యాసాల సంక్లిష్ట మిశ్రమంతో ముడిపడి ఉంది. ఒక వ్యక్తి వయసుకు తగ్గ పోషకాలను తీసుకోకపోవడం దేశంలోని దారిద్ర్యాన్ని సూచిస్తోంది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం పోషకాహారం అందించే విషయంలో 2023లో మనదేశం 111వ స్థానంలో నిలిచింది."ఒక వ్యక్తి ఏడాది వ్యవధిలో రోజువారీ కనీస ఆహారశక్తి అవసరాలను తీర్చడానికి తగినంత ఆహారాన్ని పొందలేకపోవడాన్ని పౌష్టికాహార లోపం" అని అంతర్జాతీయ సంస్థలు నిర్వచించాయి. అధిక పోషణను కూడా పౌష్టికాహారలోపంగానే పరిగణించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలపడం గమనార్హం. పోషకాహారలోపమనేది ఐదేండ్లకంటే తక్కువైన పిల్లలోను, గర్భిణీల్లోనూ, యుక్తవయస్సు వారిలో ఎక్కువగా ఉంటుంది. పోషకాహార లోపాన్ని వేస్టింగ్ (ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం), స్టంటింగ్ (వయసుకు తగ్గ ఎత్తు లేకపోవడం), తక్కువ బరువు కలిగి ఉండడం, విటమిన్లు మినరల్స్ లోపాలు అనే నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. దీనికితోడు అధిక బరువు, ఊబకాయం కూడా పోషకాహార లోపం కిందకే వస్తాయి. ప్రపంచంలో పోషకాహార లోపంతో బాధ పడుతున్నవారిలో 19.46 కోట్ల మంది మన దేశంలోనే ఉన్నారు. ఇది మొత్తం దేశ జనాభాలో 13 శాతానికి సమానమని ఐక్యరాజ్య సమితి, ప్రపంచ ఆహార భద్రత పోషకాహార స్థితి (ఎస్‌ఓఎఫ్‌ఐ) తాజా నివేదిక 2024 తెలిపింది. ఈ సంఖ్య 2004-06లో 24 కోట్లు ఉండగా తర్వాత కాలంలో 55.6శాతం (79 కోట్లు) ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో లేదని పేర్కొంది. దేశ జనాభాలో సరైన ఆహారం లభ్యంకాక 16.6శాతం పోషకాహార లోపంతో ఉన్నారని, కనీసం 38శాతం అనారోగ్యకరమైన ఆహారాన్ని తింటున్నారని ఈ ఏడాది మే 29న విడుదల చేసిన గ్లోబల్ ఫుడ్ పాలసీ రిపోర్ట్ 2024 తెలిపింది.

పేదరికమే ప్రధాన కారణం

పోషకాహార లోపం ఉన్న పిల్లలు తరుచుగా వ్యాధులకు గురవ్వడమేకాక మరణించే అవకాశాలు ఎక్కువ. ముఖ్యంగా పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధి జరగక అభ్యాస సామర్థ్యాలు, విద్యా పనితీరు సరిగా జరగదు. సూక్ష్మపోషకాలు, ఐరన్, విటమిన్-ఎ, జింక్ లేని ఆహారాన్ని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి దెబ్బతిని వేగంగా అంటువ్యాధులు ప్రబలుతాయి. కుటుంబ ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరుగుతాయి. యుక్తవయస్సులో పోషకాహార లోపంవల్ల ఉత్పాదకత తగ్గి



దేశ జీడీపీ తగ్గుతుంది. రక్తహీనత తల్లులు అనారోగ్య శిశువులకు జన్మనిచ్చి పోష కాహార లోపాల చక్రాన్ని శాశ్వతం చేస్తారు. పోషకాహార లోపం తరచుగా ఆర్థికంగా అట్టడుగు, వెనుకబడిన వర్గాలను ప్రభావితం చేస్తున్నది. ఇది సామాజిక అసమానతలను పెంచుతున్నది. దీనికి గలకారణాలలో అత్యంత ప్రధానమైనది పేదరికం. వీరిలో కొనుగోలు శక్తి తక్కువగా ఉండడం వలన సంతులిత ఆహారాన్ని తీసుకోలపోవడంతో ఈ సమస్య రోజురోజుకూ మరింత ఉత్పన్నమవుతున్నది. ఒకరి సంపాదనపైనే ఎక్కువ మంది ఆధారపడి జీవిస్తారు. మలేరియా, అతిసారం వంటి అంటువ్యాధులు పోషకాహార లోపానికి కారణమవుతున్నాయి. గర్భంతో ఉన్నవారికి ఎక్కువ మోతాదులో పోషకాలు అవసరం. కాని వారికి సరైన అవగాహన లేక పోషకాహార లోపానికి గురవుతున్నారు. కొన్ని కుటుంబాలలో బాలురతో పోల్చితే బాలికలకు తక్కువ ఆహారాన్ని అందజేయడం ఈ లోపానికి ఒక కారణం. అనాథ పిల్లలు, వృద్ధులు ఎక్కువ శాతంలో పోషకాహార లోపానికి గురవుతారు. గిరిజనులు, సామాజికంగా వెనుకబడినవారు, మురికివాడ నివాసితులు, సంచార జాతులు తదితర వారికి తగినంత ఆర్థిక పరిపుష్టి లేక సమతుల్య ఆహారాన్ని పొందలేకపోతున్నారు. పేలవమైన పారిశు ధ్యం, పరిశుభ్రత పద్ధతులు వ్యాధులకు కారణమయ్యే పరాన్నజీవులకు గురికావడాన్ని పెంచుతుంది. ఇవి శరీరంలోని పోషకాల శోషణ వినియోగాన్ని ప్రభావితం చేసి పోషకాహార లోపాన్ని పెంచు తున్నాయి. ఎగువ మధ్య తరగతి, ఎగువ తరగతి ప్రజలలో కూడా పోషకాహార లోపం ఉంటుంది. తగినంత సంపాదన ఉన్నా కూడా పాలిష్ చేసిన బియ్యం వాడ టం, పిజ్జాలు బర్గర్లు తినడం లాంటి అలవాట్లు, పని ఒత్తిడిలో వేళకు భోజనం చేయకపోవడం వలన వీరు పోషకాహార లోపానికి గురవుతున్నారు. మన దేశంలో ఆహార వైవిధ్యం లేకపోవడం, తక్కువ నాణ్యత గల ఆహారాన్ని తీసుకోవడం కూడా ఒక కారణం. మన ఆహారంలో ఐరన్, విటమిన్లు, జింక్ వంటి ముఖ్యమైన పోషకాలు తక్కువగా ఉంటున్నాయి.

పథకాలున్నా ఫలితం శూన్యం!

అంగన్వాడీ వ్యవస్థ, పోషన్ అభియాన్, ఆయుష్మాన్ భారత్, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ , ప్రధాన మంత్రి మాతృవందన యోజన, పాఠశాలలో మధ్యాహ్న భోజనం, కౌమార బాలికల పథకం, గర్భిణిలకు ప్రత్యేక ఆహారం అందించుట లాంటి కార్యక్రమాలను ప్రభు త్వాలు ప్రవేశపెట్టినప్పటికీ వాటి అమలులో చిత్తశుద్ధి లోపించింది. అంగన్‌వాడీ లాంటి వ్యవస్థను నిర్వీర్యం చేసే పద్ధతికి కేంద్రం పూనుకుంది. తగిన నిధుల్ని కేటాయించి ఆరోగ్యవ్యవస్థల్ని పటిష్టం చేయాల్సిన పాలకులు వాటికి బడ్జెట్‌లో కేటాయిం పులు అంతంత మాత్రంగానే కేటాయించడం శోచనీయం. జాతీయ ఆరోగ్య విధానం 2025 నాటికి ప్రభుత్వ ఆరోగ్య వ్యయాన్ని జీడీపీలో ప్రస్తుతమున్న 1.2శాతం నుండి 2.5శాతానికి పెంచాలని చేసిన సిఫార్సును అమలు చేయాలి. పోషకాహారం, ఆహార భద్రత, పేదరికం ఒకదానితో మరొకటి విడదీయరాని సంబంధం కలిగి ఉంటాయి. పేదరికాన్ని రూపుమాప డానికి కృషి చేయాలి. అందరకీ ఆహార భద్రతను కలిగించాలి. గిరిజను లకు, ఆర్థికంగా అట్టడుగు వర్గాలకు, పోషకాలు కలిగిన ధాన్యాలను, పదార్థాలతో పాటు పండ్లను పౌర సరఫరాల దుకాణాల ద్వారా సబ్సిడీతో అందివ్వాలి. వ్యాధి నిరోధక టీకాలను ప్రతిఒక్కరూ వేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సౌకర్యాలు పెంచాలి. స్థానిక సంఘాలను భాగస్వామ్యం చేయాలి. గ్రామీణ ప్రాంతాలలో ప్రసవానంతర సామాజిక మూఢనమ్మకాలు, కట్టుబాట్లను తెంచి, ప్రజలలో చైతన్యం పెంచాలి. అప్పుడే దేశాన్ని పోషకాహారలోపం నుంచి కొంతైనా బయటపడేయగలం.

(సెప్టెంబర్ 1 నుంచి 7వరకు జాతీయ పోషకాహార వారోత్సవాలు)

- డిజె మోహనరావు, 9440485824

అమెరికాను ప్రసన్నం చేసుకోవడానికే

ఉక్రెయిన్‌కు నరేంద్రమోడీ జరిపిన స్వల్ప కాలిక పర్యటనను పెద్ద విజయంగా అమెరికా అనుకూల వర్గాల, కార్పొరేట్ మీడియా ప్రశం సలు కురిపించింది. ఢిల్లీలో జి20 సమా వేశం నిర్వహించడం ద్వారా అంతర్జాతీయ స్థాయి పెంచుకున్న భారతీయ నేతగా ఈ ప్రశంసకులు ఆయన్ను కొనియాడారు. వర్ధమాన దేశాల నాయకుడుగా ఆయన గుర్తింపు పొందు తున్నట్టు చెప్పారు. కీవ్‌కు చారిత్రాత్మక పర్యటన జరపడం ద్వారా రష్యా, ఉక్రెయిన్‌ల నడుమ ఒక మధ్యవర్తిత్వ పాత్ర పోషించేందుకు భారత దేశానికి బాట వేస్తున్నట్టు కూడా ఇవన్నీ చెప్పాయి.

అయితే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మోడీ పర్యటన తర్వాత జరిపిన మీడియా గోష్టిలో కొన్ని కటువైన వ్యాఖ్యలు చేయడం ఈ వందిమాగధ మీడియా, అమెరికా అనుకూల వ్యాఖ్యాతల దురదృష్టం. రష్యా దగ్గర ఇండియా చమురు కొనడం ద్వారా దాని ఆయుధ పరిశ్రమకు నిధులు సమకూర్చడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. శిఖరాగ్ర శాంతి సమావేశం జరపడంలో ఇండియాకు ఎలాంటి పాత్ర కల్పించడానికి జెలెన్‌స్కీ నిరాకరించారు. శాంతి సదస్సు ప్రకటనలో పాలుపంచుకోని ఒక దేశంలో తాను ఒక శిఖరాగ్ర శాంతి సదస్సు జరపలేనని స్పష్టం చేశారు. స్విడ్జర్లాండ్‌లో జరిగిన శాంతి సదస్సు సంయుక్త ప్రకటనలో భారత దేశం పాలు పంచుకోకపోవడాన్ని ఆయన ఆ విధంగా ప్రస్తావించారు. విదేశాంగ శాఖ సహాయ కార్యదర్శి ఆ సదస్సుకు హాజరయ్యారుగానీ తుది ప్రకటనపై ఇండియా సంతకం చేయలేదు. తాను ఇండియా సందర్శించే సమయానికి అది తనవైపున వుండాలి గానీ అమెరికా, రష్యాల మధ్య సమతూక స్థితిలో వుండకూడదని కూడా జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ మాటలతీరు చూస్తే ఆయన మోడీ కూడా తనలాగే అమెరికా జూనియర్ మిత్రుడని భావించినట్టు కనిపిస్తుంది. కాబట్టి తాను ఇలా మాట్లాడినా చెల్లుబాటవుతుందని కూడా ఆయన తలపోసినట్టున్నారు.

కోపం తగ్గించడానికి తంటాలు

భారత దేశం ఏదో విశ్వగురు అనుకునే వారికి తప్ప మిగిలిన వారందరికీ మోడీ కీవ్ పర్యటన ఉద్దేశమేమిటో స్పష్టమైంది. మాస్కోకు మోడీ పర్యటన వాషింగ్టన్‌లో నాటో 75వ వార్షికోత్సవంతో పాటే జరిగింది. మోడీ పుతిన్‌ను ఆలింగనం చేసుకోవడం, ఆయన నుంచి అత్యున్నత రష్యన్ పౌర పురస్కారం స్వీకరిం చడం అమెరికాకు ఆగ్రహం తెప్పించింది. పుతిన్ నాయకత్వంలోని రష్యాకు వ్యతిరేకంగా అన్ని శక్తులనూ మొహరించేందుకే నాటో సమావేశం ఉద్దేశించబడింది. అమెరికాకు ఇండో పసిఫిక్ నేస్తంగా వున్న మిత్ర దేశం సరిగ్గా ఆ సమయంలోనే బాహాటంగా శత్రువుతో కలసి కనిపిస్తున్నది.బైడెన్ ప్రభుత్వ ప్రతినిధులు అనేకమంది జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవాన్ నుంచి విదేశాంగ శాఖ ప్రతినిధి వరకూ దీనిపై తమ అనంగీకారం ప్రకటించారు. చివరి హెచ్చరిక జారీ చేసే పని మాత్రం భారత్‌లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టికి అప్పగించారు. భారత అమెరికా రక్షణ భాగస్వామ్యం ప్రపంచంలో ఎంతో ప్రభావశీల మైందనీ అయితే దాన్ని ఎలాగైనా చెల్లిపోతుం దన్నట్టు తీసుకోవడం తగదనీ ఆయన హెచ్చరించారు. "ఇండియా వ్యూహాత్మక స్వయం నిర్ణయాధికారం ఇష్టపడుతుందని నాకు తెలుసు. అయితే ఘర్షణ సమయాల్లో వ్యూహాత్మక స్వయం నిర్ణయాధికారం వంటిదేదీ వుండబోదు" అన్నా రాయన.



మోడీ రష్యా పర్యటన తర్వాత రెండు రోజులకే భద్రతా విషయాల సలహాదారు అజిత్ దోవల్ అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవాన్‌ను కలుసు కున్నారు. అమెరికన్లను బుజ్జగించడమే ఈ సమావేశం ఉద్దేశం. వ్యూహాత్మక కలయికకు ఇండియా తీవ్రంగానే కట్టుబడి వుంటుందని చెప్పడం, టోక్యోలో జరగబోయే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరవు తుందనీ నిర్ధారించడం కోసం ఆయన కలిశారు. దీని వెనువెంటనే విదేశాంగ శాఖ వర్గాలు ఆగష్టు మూడవ వారంలో మోడీ ఉక్రెయిన్ పర్యటించే అవకాశం గురించి మాట్లాడ్డం మొదలెట్టారు. కనుక ఇక్కడ విదితమయ్యే విషయం ఒక్కటే. అమెరికాను శాంతింప చేయడానికి, అమెరికా కూటమి పట్ల ఇండియా స్వామిభక్తిని చాటుకోవడానికి మాత్రమే మోడీ ఉక్రెయిన్ సందర్శన తతంగం నిర్వహించారు.

రష్యాతో తగ్గించుకుని..అమెరికా వైపు..

తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికాకు వెళ్లడం కూడా వారి పట్ల కట్టుబాటును మరింతగా విశదపర్చే ప్రక్రియలో భాగమే. మోడీ కీవ్‌కు వెళ్లిన రోజునే ఈ పర్యటన కూడా మొదలైంది. నాలుగు రోజుల ఈ పర్యటనలో భద్రతా సరఫరాల ఒప్పందం (ఎస్.ఓ.ఎస్.ఎ)తో పాటు అమెరికా కీలక కమాండ్ కేంద్రాలలో భారతీయ సైనికాధికారులను నియమించడం పైనా అవగాహనపై సంతకాలు చేశారు. అమెరికా నుంచి ఆయుధాల కొనుగోళ్లు జోరుగా సాగుతున్న నేపథ్యంలో 5.86 కోట్ల డాలర్ల విలువైన జలాంతర్గామి విధ్వంసక సోనోబారు పరికరాల అమ్మకానికి అమెరికా అంగీకరిం చింది. ప్రత్యేకించి ఆయుధరంగంలో రష్యాతో వున్న దీర్ఘకాలిక అవగాహనను, మరీ ముఖ్యంగా స్వల్ప కాలంలో సైనిక సరఫరాలను ఇండియా వదులుకోలేదు. కానీ అదే సమయంలో మోడీ కీవ్ పర్యటన, రాజ్‌నాథ్ సింగ్ అమెరికా యాత్ర ప్రభుత్వం చేపట్టిన నూతన మార్గం ఏమిటో చెబుతున్నాయి. అమెరికాతో వ్యూహాత్మక సంఘటనను బలోపేతం చేసుకోవాలనీ, దీర్ఘకాల కోణంలో రష్యాపై ఆధారపడే పరిస్థితిని తగ్గించుకో వడానికి మోడీ ప్రభుత్వం సుముఖంగానే వుందని సంకేతమిస్తున్నాయి. అమెరికా మిత్రపక్షంగా వున్నాక వ్యూహాత్మక స్వయం నిర్ణయాధికారం పెద్దగా ఏమీ వుండబోదనే పాఠం మోడీ సర్కారు నేర్చుకున్నట్టే కనిపిస్తుంది.

(ఆగష్టు28 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

> మోడీ రష్యా పర్యటన తర్వాత రెండు రోజులకే భద్రతా విషయాల సలహాదారు అజిత్ దోవల్ అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవాన్‌ను కలుసుకున్నారు. అమెరికన్లను బుజ్జగిం చడమే ఈ సమావేశం ఉద్దేశం. వ్యూహాత్మక కలయికకు ఇండియా తీవ్రంగానే కట్టుబడి వుంటుందని చెప్పడం, టోక్యోలో జరగబోయే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరవుతుందనీ నిర్ధారించడం కోసం ఆయన కలిశారు. దీని వెనువెంటనే విదేశాంగ శాఖ వర్గాలు ఆగష్టు మూడవ వారంలో మోడీ ఉక్రెయిన్ పర్యటించే అవకాశం గురించి మాట్లాడ్డం మొదలెట్టారు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

బాధ్యత కలిగిన ప్రతిపక్ష నేత ఎక్కడ?

- వరద బాధితుల గోస పట్టదా? :

కేసీఆర్‌కు మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్న

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

భారీ వర్షాలతో తెలంగాణ అతలాకుతలమైతే బాధ్యత కలిగిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడ ఉన్నారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. వరద బాధితుల గోస పట్టదా? అని నిలదీశారు. ఇంత జరుగుతుంటే ఫామ్‌హౌస్‌లో ఏం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలకు భరోసా ఇస్తూ సర్కార్‌కు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించకుంటే ఎలా? అంటూ నిలదీశారు. రాజకీయాలను పక్కన పెట్టి సాయం చెయ్యాల్సిన సోయి లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మొన్నటి వరకు కవిత బెయిల్ కోసం కష్టపడ్డారు. తండ్రి ఫామ్‌హౌస్‌లో ఉంటే, కేటీఆర్ ఇంగ్లాండ్‌లో రిలాక్స్ అవుతున్నడు. ఇంగ్లాండ్‌లో విహార యాత్రలో ఉండి సోషల్ మీడియాలో ట్వీట్



చేస్తున్నారు. కేటీఆర్ సోషల్ రెస్పాన్సిబులిటీ మరిచి సోషల్ ట్వీట్‌లు పెడుతున్నారు' అని ఎద్దేవా చేశారు. నాలుగు రోజులుగా సీఎం, మంత్రులు వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని చెప్పారు. కేటీఆర్‌కు హెలికాప్టర్ సోకులు తప్ప మరేం లేదని విమర్శించారు.

వరద బాధితులకు ఒక రోజు వేతనం రూ.100 కోట్ల విరాళం

- ప్రకటించిన తెలంగాణ ఉద్యోగుల జాక్ చైర్మెన్ లచ్చిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరద బాదితుల సహాయార్థం రాష్ట్రంలోని ఉద్యోగులు తమ ఒక రోజు వేతనం రూ.100 కోట్లను విరాళంగా ఇస్తున్నట్టు తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం పలు ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి సీఎస్ శాంతికుమారిని కలిసి ఒక రోజు వేతనానికి సంబధించిన పత్రాన్ని అందచేశారు. సెప్టెంబరు నెలలోనే ఒక రోజు వేతనాన్ని తీసుకోవాల్సిందిగా కోరారు. తెలంగాణలోని అన్ని ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగుల తరుపున సమిష్టి నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకులు డా.నిర్మల, కె.రాములు, శశిధర్‌రెడ్డి, దర్శన్‌గౌడ్, గోపాల్, అశ్వత్థామరెడ్డి, రమాదేవి, రాబర్ట్ బ్రూష్, మహిపాల్‌రెడ్డి, కె.రామకష్ణ, ఎస్.రాములు, మహేష్, తిరుపతి, సంపత్, పాల్గొన్నారు.

రాహుల్ గాంధీది ద్వంద్వ వైఖరి : కేటీఆర్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వాలు చేస్తున్న "బుల్డోజర్ పాలిటిక్స్" ప్రజల జీవితాలపై దాడి అంటూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఇదే సందర్భంలో సుప్రీం వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ తీరు ఆశ్చర్యమేస్తుందని తెలిపారు. ఓ వైపు బుల్డోజర్ న్యాయం రాజ్యాంగ విరుద్ధమంటున్న రాహుల్ గాంధీ తెలంగాణలో ఆయన పార్టీ పాలనలో బుల్డోజర్‌తో జరుగుతున్న విధ్వంసంపై మాత్రం మౌనంగా ఉంటూ ద్వంద్వవైఖరిని ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి బుల్డోజర్‌తో అన్యాయాలను కొనసాగిస్తుంటే ఆయనను ఆపలేని శక్తి హీనులుగా మారారా? లేదంటే ప్రజలను మోసం చేసే మీకు అలవాటైనా డబుల్ స్టాండర్డ్స్ విధానాలను ఇలా కొనసాగిస్తున్నారా? అంటూ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

ఆ విద్యార్థికి విద్యానిధి సాయం అందించండి

- ప్రభుత్వ అప్పీల్‌ను తిరస్కరించిన చీఫ్ జస్టిస్ బెంచ్

నవతెలంగాణ–హైదరాబాద్



అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి డబ్బు కరీంనగర్‌కు చెందిన ఒక విద్యార్థికి చెల్లించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును 5 నెలలకుపైగా ఆలస్యంతో ప్రభుత్వం అప్పీల్ చేయడాన్ని డివిజన్ బెంచ్ తప్పుపట్టింది. సింగిల్ జడ్జి తీర్పు ప్రకారం విద్యార్థికి విద్యా నిధి సాయం అందించాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే బెంచ్ తీర్పు చెప్పింది. సాంఘిక సంక్షేమ శాఖ అప్పీల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

హుస్సేన్ సాగర్ బఫర్ జోన్ వివరాలివ్వండి

హైదరాబాద్ నగరంలోని హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల వివరాలు అందజేయాలని ప్రభుత్వానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్ కుమార్ ఆదేశించారు. హుస్సేన్‌సాగర్ వద్ద తమ ఇండ్ల స్థలాల రక్షణకు ఫెన్సింగ్ వేస్తుంటే అధికారులు అడ్డుకుంటున్నారని శరణప్పస్వామి ఇతరులు వేసిన పిటిషన్లను విచారించిన హైకోర్టు పైవిధంగా ప్రభుత్వాన్ని వివరాలు ఇవ్వాలని ఆదేశించింది.

బాధితుల వివరణ తీసుకోండి

శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేట వద్ద ఉన్న దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ ఏరియాలోని కట్టడాల కూల్చివేతలకు అధికారులు ఇచ్చిన కూల్చివేత నోటీసులను సవాల్ చేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే బెంచ్ విచారించింది. కూల్చివేత నోటీసులను షోకాజ్ నోటీసులుగా మార్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. షోకాజ్ నోటీసులపై బాధితులు ఇచ్చే వివరణ, వాళ్ల దగ్గరున్న ఆధారాలు పరిశీలించాకే తదుపరి చర్యలుండాలని ఆదేశించి పిటిషన్లపై విచారణ ముగిసివేసింది. ఇదే విధమైన ఉత్తర్వులు వరంగల్ భద్రకాళి చెరువు వద్దనున్న ఇండ్ల కూల్చివేతల కేసులో కూడా షోకాజ్ నోటీసులుగా మార్చాలని జారీ చేసింది.

కొండలు కొట్టేందుకు పేలుళ్లపై పిల్

జూబ్లీహిల్స్‌లోని నివాస ప్రాంతంలోని కొండలను తొలగించేందుకు పేలుళ్లు చేస్తున్నారంటూ పత్రికల్లో వచ్చిన వార్తలను హైకోర్టు పిల్‌గా మలిచింది. ఈ పిల్‌ను బుధవారం హైకోర్టు సీజే బెంచ్ విచారించనుంది.

దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై పిటిషన్ల విచారణ షురూ

దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌కు పాల్పడిన పోలీసులపై లైంగికదాడి కింద కేసు నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు మంగళవారం విచారణ ప్రారంభించింది. 2019 డిసెంబర్ 6న షాద్‌నగర్ మండలం చటాన్‌పల్లిలో ఎన్‌కౌంటర్ పేరుతో నిందితులను హతమార్చారనే పిల్, ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న వారిపై 302 కింద కేసు నమోదు చేయాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలనే పిటిషన్లపై విచారణ బుధవారం కొనసాగనున్నది.

ఫార్మా సిటీ ఏర్పాటు ప్రక్రియ తెరపడిందా? లేదా?

రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో ఫార్మాసిటీ ఏర్పాటు ప్రక్రియకు తెరపడిందో లేదో చెప్పాలని రాష్ట్రాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణను 6వ తేదీకి వాయిదా వేస్తూ జస్టిస్ లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. భూసేకరణకు 2017లో జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఏవిధమైన అభ్యంతరాలు స్వీకరణ చేయకుండానే అవార్డు నోటిఫికేషన్ ఇవ్వడం చెల్లదని సింగిల్ జడ్జి తీర్పు చెప్పారనీ, అప్పటి నుంచి కదలిక లేదని, ఆ భూములపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి రైతులకు ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని రైతుల లాయర్ కోరారు. ప్రభుత్వ వివరణ నిమిత్తం విచారణను ఈనెల 6వ తేదీకి వాయిదా పడింది.

రైస్ మిలర్ల ఆస్తుల జప్తు రద్దు

ప్రభుత్వం అప్పగించిన ధాన్యానికి కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పౌరసరఫరాల శాఖకు అప్పగించని రైస్ మిల్లర్ల ఆస్తులను ప్రభుత్వం జప్తు చేయడాన్ని హైకోర్టు రద్దు చేసింది. రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన వడ్లను మిల్లింగ్ నిమిత్తం మిల్లర్లకు అప్పగిస్తారు. వాటిని మిల్లింగ్ తర్వాత పౌరసరఫరాల శాఖకు నిర్దిష్ట గడువులోగా అప్పగించని రైస్ మిల్లర్ల ఆస్తులను జప్తునకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. చట్ట వ్యతిరేకంగా రెవెన్యూ రికవరీ చట్టం కింద ఆస్తుల జప్తు చేయడం చెల్లదన్న రైస్ మిల్లర్ల వాదనను ఆమోదిస్తూ జస్టిస్ లక్ష్మణ్ తీర్పు చెప్పారు. చట్ట ప్రకారం మిల్లర్ల నుంచి నష్టాన్ని ప్రభుత్వం రాబట్టుకునేందుకు వీలుందనీ, రెవెన్యూ రికవరీ చట్టం కింద తీసుకున్న చర్యలు చట్టబద్ధంగా లేవని తీర్పులో పేర్కొంది.

సాయన్ని చూసి ఓర్వలేకే కాంగ్రెస్ దాడి

- కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఖమ్మంలో కాంగ్రెస్ గుండాల దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు హరీష్ రావు, పువ్వాడ, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై దాడి చేయటం కాంగ్రెస్ అసహనానికి నిదర్శనమంటూ దాడిని ఖండించారు. ప్రజలకు సాయం చేయటం చేతగాక...సాయం చేస్తున్న వారిని చూసి ఓర్వలేకే ఈ దాడికి తెగబడ్డారని విమర్శించారు. మీరు ప్రజలను నిర్లక్ష్యం చేస్తే వారికి అండగా ఉండటమే తప్పా? అని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయటం చేతకాదు...సేవ చేసే వారిపై మాత్రం దాడి చేస్తారా? అంటూ నిలదీశారు. ఈ దాడికి ముఖ్యమంత్రి సహా కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఇలాంటి ఎన్ని దాడులు చేసిన సరే...ప్రజల వద్ద బీఆర్ఎస్ శ్రేణులను వెళ్లకుండా ఆపలేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ చేతగాని, దద్దమ్మ పాలనను ప్రజలు గమనిస్తున్నారనీ, కాంగ్రెస్‌కు సరైన సమయంలో బుద్ధి చెప్పటం ఖాయమని హెచ్చరించారు.



హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-గార్ల

మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో నాలుగు రోజులుగా భారీ వర్షాలకు పాకాల చెక్ డ్యాం పొంగిపొర్లుతున్నదని, రాంపురం, మద్దివంచ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని చెక్ డ్యాంపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. మంగళవారం చెక్‌డ్యాం వరదలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ మాట్లాడారు. చెక్ డ్యాం తక్కువ ఎత్తు ఉండటంతో.. పై నుంచి వరద ప్రవహిస్తోంది, దాంతో సుమారుగా 10కి పైగా గ్రామాల ప్రజలు రహదారి లేక డోర్నకల్, బయ్యారం ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది వరదనీటిలో పడి చనిపోయిన ఘటనలు ఉన్నాయని అన్నారు. వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించేందుకు మానుకోట జిల్లాకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి యుద్ధ ప్రాతిపాదికన చెక్ డ్యాంపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, అధికార పార్టీ నాయకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు వీపి.వెంకటేశ్వర్లు, ఎ.వీరాస్వామి, ఎ.రామకృష్ణ, కె.రామకృష్ణ, కె.మహేశ్వరావు, జి.వీరభద్రం, ఎం.అశోక్, టి.నాగేశ్వరరావు, బిక్షం, కోటయ్య, రాంబాబు తదితరులు ఉన్నారు.

కేన్స్ సంస్థ తరలిపోవడం బాధాకరం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సెమీ కండక్టర్ల రంగంలో రూ.3,500 కోట్ల పెట్టుబడిని రాష్ట్రంలో పెట్టేందుకు ఒప్పుకున్న కేన్స్ సంస్థ ఇక్కడి నుంచి తరలి పోతుందనే ప్రచారం బాధాకలిగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికంగా ఆందోళన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో పెడుతామన్న తన యూనిట్‌ను కేన్స్ గుజరాత్‌కు తరలిచేందుకు సిద్ధమైందని వార్తలు వస్తున్నాయి. ఈ సంస్థను కర్నాటక నుంచి తెలంగాణకు రప్పించేందుకు ఎంతో కష్టపడ్డాం. హైదరాబాద్‌లో తమ యూనిట్ పెట్టాలంటే కొంగర కలాన్‌లోని ఫాక్స్‌కాన్ ప్లాంట్ పక్కన భూమి కేటాయించాలని కోరింది. పది రోజుల్లోనే వారికి భూమి కేటాయించి యూనిట్ పెట్టేందుకు ఒప్పించాం. కాని ఇప్పుడు వేరే రాష్ట్రానికి తరలి పోవడ దురదృష్టకరం" అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ యూనిట్‌ను తరలి పోకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

పోలీసుల సేవలు అభినందనీయం

అచ్చంపేటలోని డిండి కెనాల్‌లో చిక్కుకుపోయిన 10 మంది గిరిజనులను కాపాడినందుకు పోలీసులకు కేటీఆర్ ఎక్స్ వేదికంగా అభినందనలు తెలిపారు. మూడు రోజులుగా వరదల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించే విషయంలో కాంగ్రెస్ సర్కార్ అలసత్వం ప్రదర్శించిందని విమర్శించారు. "వరద బాధితులను రక్షించేందుకు హెలికాప్టర్ల అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలు ప్రయాణించేందుకు హెలికాప్టర్లు ఉంటాయి. కాని పేద గిరిజనులను రక్షించేందుకు మాత్రం హెలికాప్టర్లు ఎందుకు ఏర్పాటు చేయలేదు. ప్రజల ప్రాణాలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి లెక్క లేకుండా పోయింది" అని విమర్శించారు.

వరద ముంపు నివారణకు చర్యలు

- ముంపు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ కమిషనర్
- హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

వరద ముంపు నివారణకు నాలా పూడికలు, వ్యర్థాల తొలగింపుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి జోనల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కూకట్‌పల్లి జోన్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మైసమ్మ చెరువు, ఐడీఎల్ చెరువు, సఫ్దర్ నగర్‌లో వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. సఫ్దర్ నగర్‌లో వరద ముంపునకు గురైన ప్రాంతాన్ని పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. వెంటనే నాలా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ముంపునకు గురైన కాలనీ వాసులకు సురక్షిత తాగు నీరు సరఫరా చేయాలని, దోమల నివారణకు ఏఎల్‌ఓ, ఫాగింగ్ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చోట హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఐ.డీ.ఎల్, మైసమ్మ చెరువుల వద్ద గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు చెప్పారు. కమిషనర్ వెంట కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, ఎస్ఈ చిన్నారెడ్డి, డీసీలు, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

మత్స్యకారుల కోసం హెల్ప్‌లైన్

- ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ మత్స్యకారులకు సహాయం కోసం హెల్ప్‌లైన్ 8090199299లో సంప్రదించాలని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ డాక్టర్ ప్రియాంక అలా, తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని మత్స్యభవన్‌లో హెల్ప్‌లైన్ నెంబం ్ను విడుదల చేశారు. మత్స్యకారులకు నిరంతరం 24 గంటలు ఫోన్ ద్వారా సేవలు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు భారీగా నిండిపోయాయన్నారు. చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల సహాయం కోసం ఈ హెల్ప్‌లైన్ నెంబర్ కాల్ చేయవచ్చునని వారు కోరారు.

ఎస్ఆర్ జూనియర్ కాలేజీలోకి వరద

- విద్యార్థులను తరలించిన అధికారులు
- కాలేజీ భవనం సీజ్



నవతెలంగాణ-దుండిగల్

భారీ వర్షాల నేపథ్యంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని నిజాంపేటలో హిల్ కౌంటి వద్ద ఎస్ఆర్ జూనియర్ రెసిడెన్సీ కాలేజీలోకి వరద నీరు వచ్చి చేరింది. హిల్ కౌంటి ఎదురుగా ఉన్న పత్తికుంట చెరువులోకి భారీగా వరద వచ్చింది. అయితే, దాదాపు పదెకరాల్లో విస్తరించి ఉన్న పత్తికుంట చెరువు చాలా భాగం కబ్జాలకు గురైనట్టు అధికారులు గుర్తించారు. అక్కడే ఉన్న ఎస్ఆర్ కాలేజ్ భవనం సెల్లార్‌లోకి నీరు వస్తుందన్న సమాచారంతో నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు.

కళాశాలలో ఇంటర్ చదువుతున్న దాదాపు 300 మంది విద్యార్థులను పక్కన ఉన్న సప్తపది ఫంక్షన్ హాల్‌లోకి అధికారులు తరలించారు. అదే విధంగా ఎస్ఆర్ జూనియర్ కాలేజి భవనాన్ని అధికారులు సీజ్ చేశారు. చెరువులో నిర్మించిన భవనం కావడంతో కాలేజీలోకి వరద నీరు వచ్చి చేరిందని స్థానికులు చెబుతున్నారు.

పాలమూరు- రంగారెడ్డి సొరంగంలోకి వరద నీరు

ఏడో ప్యాకేజీ పనులు ఆలస్యం అయ్యే అవకాశం

నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి



పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన ఏడో ప్యాకేజీ పనుల్లోని సొరంగంలోకి వరద నీరు చేరింది. భారీ వర్షాల నేపథ్యంలో పైనుంచి చెరువు నిండితే వరద వస్తుందని తెలిసి కూడా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో ఏడో ప్యాకేజీ పనులు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. నాగర్ కర్నూల్ మండలం శ్రీపురం నుంచి సొరంగాన్ని వెంకటాద్రి రాయ రిజర్వాయర్ దాకా తీసుకెళ్లాల్సి ఉంది. ఏడో ప్యాకేజీ పనులు రూ.2001 కోట్లతో మొదలుపెట్టారు. సొరంగం పనులు పూర్తయ్యాయి. లైనింగ్ పనులు చేయాల్సి ఉంది. గత నెల 31న కురిసిన భారీ వర్షాలకు పక్కనే ఉన్న నాగనూలు చెరువు నిండటంతో వరద నీరు సొరంగంలోకి వెళ్లాయని అధికారులు తెలిపారు.

ఇంత వరద వస్తుందని పసిగట్టలేకపోయాం పార్థసారథి రెడ్డి, సీఈ, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు

2009లో వచ్చిన వరదలకు మించి ఈసారి వచ్చాయి. 15 సెంటీమీటర్ల వర్షం రావడంతో చెరువు నీళ్ల సొరంగంలోకి వెళ్లాయి. నెలలోపు నీటిని తొలగించి పనులను వేగవంతం చేస్తాం. ఇప్పటికే వరద రాకుండా మట్టిని వేస్తున్నాం. వరద కట్టడి తర్వాత సొరంగం నీళ్లను మోటార్ల ద్వారా బయటకు పంపిస్తాం. కాంట్రాక్టర్లే పూర్తి బాధ్యత వహించాలి. ఈ ఖర్చంతా వారే భరిస్తారు. మాకు ప్రాజెక్టును కాంట్రాక్టర్లు అప్పగించలేదు. దీంతో ప్రభుత్వానికి పెద్దగా ఖర్చు అయ్యేది ఏమీ లేదు. డీజిల్ ఖర్చు మాత్రమే అవుతుంది.

అమీన్‌పూర్‌లో 'హైడ్రా' కూల్చివేతలు

- 38 గుంటల ప్రభుత్వ భూమి స్వాధీనం
- ఫ్యూజియన్ స్కూల్ ప్రహరీ నేలమట్టం



నవతెలంగాణ-అమీన్‌పూర్

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ రాధ నేతృత్వంలో రెవెన్యూ అధికారులు కూల్చేశారు. ఐలాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 119లో 400 ఎకరాల భూమి కోర్టు వివాదంలో ఉంది. అయితే, కొంతమంది 20 ఎకరాల భూమిలో రియల్ వెంచర్ వేసేందుకు ప్లాట్లకు సరిహద్దు రాళ్లను వేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని సరిహద్దు రాళ్లను తీసేసి అక్కడున్న నిర్మాణాలను కూల్చే శారు. అలాగే, అమీన్‌పూర్ మున్సి పల్ పరిధిలోని 462 సర్వే నంబర్‌లో 2.16 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో 38 గుంటలు కబ్జాకు గురైంది. దాంతో అక్కడి నిర్మాణాలను కూడా కూల్చేశారు. ఫ్యూజియన్ స్కూల్ 17 గుంటల ప్రభుత్వ భూమిలో ప్రహరీని నిర్మించగా.. అధికారులు కూల్చేశారు. అమీన్‌పూర్ రోడ్డు పక్కన మరో 11 గుంటల్లో మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండు రంగారెడ్డి నిర్మించిన కమర్షియల్ షటర్లను కూల్చేశారు. అయితే, ఈ ఆక్రమణలపై హైడ్రాకు.. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దాంతో పోలీసు అధికారుల సాయంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూమిలో కబ్జాలకు పాల్పడిన వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు.

నిర్బంధాన్ని ఉద్యమంగా మలిచిన వ్యక్తి కోదండరామ్

- ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.లింబాద్రి
- కాంట్రాక్ట్ వ్యవస్థ శ్రమ దోపిడీతో కూడినది : ప్రొఫెసర్ హరగోపాల్
- ఓయూలో ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌కు ఘన సత్కారం



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ ఉద్యమంలో నిర్బంధాన్ని కూడా ఉద్యమంగా మలిచిన వ్యక్తి ప్రొ.కోదండరామ్ అని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఈ.ఉపేందర్ అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో లింబాద్రి మాట్లాడుతూ.. తెలంగాణ రావడానికి కారకులైన నిజమైన ఉద్యమకారుడు కోదండరామ్ అని అన్నారు. గతంలో కొద్ది మంది అధ్యాపకులతో ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో హెూలీ ఆడితేనే నిర్బంధించారని, ఆ నిర్బంధాన్ని కూడా ఆయన ఉద్యమంగా మలిచిన తీరు.. కొట్లాడిన తీరును గుర్తు చేశారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీలో కాంట్రాక్ట్ అధ్యాపకుల గురించి పలుమార్లు గట్టిగా ప్రభుత్వాన్ని నిలదీశానని గుర్తు చేశారు. అంతేకాకుండా ఎమ్మెల్సీల కోటాలో కోదండరామ్‌కు విద్యాశాఖ మంత్రిగా నియమించాలని కోరారు. తద్వారా విద్యా వ్యవస్థ గాడిలో పడుతుందని తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో రెండు రకాల టీచర్లు ఉండటం సరికాదన్నారు. కాంట్రాక్టు వ్యవస్థ అనేది శ్రమదోపిడీతో కూడుకొని ఉన్నదని, వెంటనే కాంట్రాక్ట్ వ్యవస్థను తీసేసి అందరినీ రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రొఫెసర్ కోదండరామ్‌కు సన్మానం చేయటమంటే విలువలకు సన్మానం చేసినట్టే అని, తెలంగాణ సమాజానికి మొత్తం సన్మానం చేసినట్టే అవుతుందని అన్నారు. విశ్వవిద్యాలయాలు నిరంతరం కొత్త ఆవిష్కరణలకు నిలయాలుగా రూపుదిద్దుకోవాలంటే చాలీచాలని వేతనాలతో అధ్యాపకులు ఇబ్బంది పడొద్దని అన్నారు. వెంటనే ఉద్యోగ భద్రతతో కూడిన యూజీసీ పే స్కేల్‌ను కాంట్రాక్ట్ అధ్యాపకులకు అమలు చేయాలని, తద్వారా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను పటిష్టం చేయాలని కోరారు.

మాజీ ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.తుమ్మల పాపిరెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుల్తానా, ఓయూ కంట్రోలర్ ప్రొ. రాములు, డాక్టర్ రామయ్య భీమనేని, డాక్టర్ ధర్మ తేజ, డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ తాళ్లపల్లి వెంకటేష్, సాదు రాజేష్, దత్త హరి, సురేష్ నాయక్ ప్రసంగించారు.

విపత్కర పరిస్థితుల్లోనూ విమర్శలా..?



- ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయాలి
- వరద బాధితులను ఆదుకుంటాం : రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్
- హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌నగర్‌ను పరిశీలించిన మంత్రి

నవతెలంగాణ-గండిపేట్

విపత్కర పరిస్థితుల్లోనూ ఒకరు ఫామ్‌హౌజ్‌లో.. మరొకరు విదేశాల్లో ఉండి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు కాదని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. రంగారెడ్డి జిల్లాలోని జంట జలాశయాలు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ చెరువులను జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి మంత్రి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మరో 5 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తే జలశయాలు నిండుతాయని తెలిపారు. ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశామన్నారు. దిగువ ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో వర్షాలు, వరదల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరిగిన బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చనిపోయిన వారంతా ప్రమాదవశాత్తు వరదల కారణంగా చనిపోయిన వారే తప్పా ప్రభుత్వ నిర్లక్ష్యం ఎక్కడా లేదన్నారు. ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వరదలతో భారీ నష్టం జరిగిందని.. కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.2 వేల కోట్ల ఆర్థిక సాయం చేయాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఇప్పటి వరకు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని విమర్శించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్, రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు, జలమండలి అధికారులు తదితరులు ఉన్నారు.

వర్షాల నేపథ్యంలో సభ్యత్వ సేకరణ వాయిదా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



వర్షాలు, వరదల కారణంగా 11 జిల్లాల ప్రజలు ఇబ్బందులెదుర్కొంటున్నారనీ, ఈ నేపథ్యంలోనే తమ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం వాయిదా వేశామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఎప్పుడనే దానిపై త్వరలోనే తేదీలు ప్రకటిస్తామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐఎండీ ముందస్తు హెచ్చరికలు చేసినా ప్రాణనష్టం జరగడం బాధాకరమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద ప్రభావంపై కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆరాతీస్తున్నదనీ, దెబ్బ తిన్న జాతీయ రహదారులు, రైల్వే లైన్లు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. తమ పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా పిలుపు మేరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో కార్యకర్తలు సేవాల కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. రాజకీయ విమర్శలకు తావు లేకుండా సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. చనిపోయిన వ్యక్తులకు సంబంధించిన కుటుంబాలకు కేంద్రం నుంచి రూ.3 లక్షల చొప్పున అందజేస్తామన్నారు. సీఎం ప్రకటించిన ఐదు లక్షల రూపాయల్లో కేంద్రం విడుదల చేసే మూడు లక్షల రూపాయలు కలుపుకొని ఇస్తారా? లేదా? స్టేట్ గవర్నమెంట్ ప్రత్యేకంగా ఐదు లక్షల రూపాయలు ఇస్తదా? అనే దానిపై క్లారిటీ లేదని చెప్పారు. ఆస్పత్రిలో వారం రోజుల కన్న ఎక్కువ రోజులుంటే రూ. 16 వేలు, వారం లోపలుంటే రూ.4 వేలను ఖర్చుల నిమిత్తం కేంద్రం ఇస్తున్నదని తెలిపారు. ఎస్డీఆర్ఎఫ్‌లో కేంద్రం ఇచ్చిన నిధులున్నాయనీ, వాటితో బాధితులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

దాని కింద రూ.1300 కోట్లకుపైగా, యూసీ కింద రూ.200 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్నాయని తెలిపారు. వరద నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదిక అందిస్తే సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తొందర్లోనే వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తానని చెప్పారు. సెప్టెంబర్ 17 ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేయడం దుర్మార్గమన్నారు. 1948లో నిజాం లొంగిపోయిన రోజు కూడా గణేష్ నిమజ్జనం జరిగిందనీ, 75ఏండ్ల తర్వాత అలా వస్తుండటం సంతోషకరమని చెప్పారు.

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

- రాష్ట్ర వ్యాప్తంగా 133 పునరావాస కేంద్రాలు
- వరద ప్రాంతాలల్లో ఆహారం, తాగు నీరు ఏర్పాటు : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరద సహాయక చర్యలపై మంగళవారం ఆయా జిల్లాల కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, పోలీస్, విద్యుత్ తదితర అన్ని విభాగాలు 24 గంటలు అందుబాటులో ఉండి సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. విపత్తుల నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు వస్తున్న ఫిర్యాదులు, వాటిపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంటనష్టం, ఆస్తినష్టం వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో 117 గ్రామాలలో 67 వేల మంది వరదల వల్ల ప్రభావితమయ్యారని తెలిపారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 49 వేల మంది బాధితులున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 133 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి 10,538 మందిని తరలించడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే 44 ఇండ్లు పూర్తిగా, 600 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఇండ్లు పూర్తిగా కోల్పోయిన వారికి కొత్తగా మంజూరుచేయాలనీ, పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లకు మరమ్మతులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 51 బ్రిడ్జీలు, 249 కల్వర్టులు,166 ట్యాంక్‌లు దెబ్బతిన్నాయని చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం త్రాగునీరుకు ఏలోటు లేకుండా అందించాలని ఆదేశించారు.

బీసీజీ సర్వే ఒక కుటుంబానికి రూ.10 చెల్లించాలి

- పెండింగ్ పల్స్ పోలియో, లెప్రసీ సర్వే డబ్బులివ్వాలి : వైద్యారోగ్యశాఖ కమిషనర్‌కు ఆశా యూనియన్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉమ్మడి కరీంనగర్‌తో పాటు మరికొన్ని జిల్లాల్లో తలపెట్టిన అడల్ట్ బీసీజీ సర్వేకు ఒక్కో కుటుంబానికి రూ.10 చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. అదే విధంగా గతంలో పెండింగ్ లో ఉన్న పల్స్ పోలియో, రెండేండ్ల నాటి లెప్రసీ సర్వే డబ్బులను తక్షణమే చెల్లించాలని కోరింది. ఈ మేరకు మంగళవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, రాష్ట్ర కోశాధికారి పి.గంగమణి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.యాదమ్మ రాష్ట్ర నాయకురాలు ఎస్.శారద వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ కు వినతిపత్రం సమర్పించారు.

బీసీజీ సర్వే ఉచితంగా చేయాలన్న అధికారుల ప్రతిపాదనను ఆశాలు తిరస్కరించడంతో ముందుగా రూ.300లు, ఆ తర్వాత రూ.600 చెల్లించేందుకు ముందుకొచ్చారని తెలిపారు. ఈ సర్వేలో ఉన్న పని రీత్యా రూ.600 చాలా తక్కువని వారు తెలిపారు. అడల్ట్ బీసీ వ్యాక్సిన్ కోసం చేసే సర్వే చాలా సమయం తీసుకుంటుందనీ, ఈ వ్యాక్సిన్ కోసం అర్హత ప్రమాణాలను గుర్తించేందుకు వయస్సు, వివిధ రకాల ఆరోగ్య చరిత్ర, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి తదితర వాటిని సేకరించాల్సి ఉంటుందని చెప్పారు. వీటితో పాటు డయాబెటిస్ నిర్ధారణ, చికిత్సకు సంబంధించిన డాక్యుమెంటరీ సాక్ష్యాలను సేకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వీటన్నింటి కోసం ఒక్కో ఇంటి వద్ద చాలా సమయం పడుతుందని తెలిపారు. ఒక్కో కుటుంబం దగ్గరికి అనేకసార్లు తిరగాల్సిన అవసరముంటుందని వివరించారు. వీటిని పరిగణనలోకి తీసుకుని ఒక్కో కుటుంబానికి రూ.10 చొప్పున చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఏడాది మార్చి 3 నుంచి 5 వరకు మూడు రోజుల పల్స్ పోలియో డబ్బులు, మార్చి 11 నుంచి 24 వరకు 14 రోజుల లెప్రసీ సర్వే డబ్బులతో పాటు గతంలో రాష్ట్రంలోని సగం జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న 2023 ఏడాది లెప్రసీ సర్వే డబ్బులు నేటికి చెల్లించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆశాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గతంలో చేసిన పనికి డబ్బులు చెల్లించకపోవడంతో కొత్తగా చేసే సర్వేలకు కూడా ప్రభుత్వం డబ్బులు ఎగ్గొడుతుందనే అభద్రతా భావంలో ఆశాలు పని చేస్తున్నారని తెలిపారు. ఆశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పాటు

(మొదటిపేజీ తరువాయి)

తేవాలని పేర్కొన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ సమగ్ర విద్యావిధానాన్ని రూపొందించాలని సూచించారు. ప్రీప్రైమరీ నుంచి విశ్వవిద్యాలయాలు, సాంకేతిక విద్య వరకు అన్ని అంశాలూ అందులో ఉండాలని వివరించారు. క్రియాశీలకమైన విధానాన్ని తయారు చేయాలని కోరారు. అధ్యయనం, వినూత్న ఆలోచనలు, సంప్రదింపులతో మార్గదర్శకాలు, విధానాలు రూపొందించాలని సూచించారు. ప్రీప్రైమరీ స్కూళ్లలో సార్వజనీన విద్యను అందించాలని తెలిపారు. పాఠశాలలపై కేంద్రీకరించాలనీ, నాణ్యమైన విద్యను అందించాలని పేర్కొన్నారు. ఉన్నత విద్యలో అప్రెంటిస్‌షిప్, ఉపాధి అవకాశాలు పెంపొందించేలా విధానాలుండాలని తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థుల్లో నైపుణ్యం కొరత ఉందనీ, దాన్ని అధిగమించాలనీ, గ్లోబల్ సిటిజెన్లుగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా సంబంధమైన ఇతర అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, నిపుణులతో కమిషన్ సంప్రదించి సిఫారసులను రూపొందించాలని కోరారు. విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను డిప్యూటేషన్/ఓడీపై తీసుకుని వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

చైర్మెన్‌గా ఆకునూరి మురళి?

తెలంగాణ విద్యాకమిషన్ చైర్మెన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని నియమించే అవకాశమున్నట్టు తెలిసింది. విద్యారంగంపై ఆయనకు మక్కువ ఎక్కువున్నది. దాంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వంలో సలహాదారుగా నాడు-నేడు కార్యక్రమాన్ని నిర్వహించారు. దాని స్ఫూర్తితోనే బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరుతో మౌలిక వసతులను కల్పిస్తున్నది. ముగ్గురు సభ్యుల నియామకంపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. త్వరలోనే అందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేయనుంది.

5, 6 తేదీల్లో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐలో స్పాట్ అడ్మిషన్లు

- డిగ్రీ, ఇంటర్ కోర్సుల్లో అవకాశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ)ల్లో స్పాట్ అడ్మిషన్ల కౌన్సిలింగ్‌ను ఆరు, ఏడు తేదీల్లో నిర్వహిస్తున్నట్టు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ కార్యదర్శి వి.ఎస్.అలుగు వర్షిణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీకి సంబంధించి 27 కాలేజీల్లో ఏడు (బీఎస్సీ(ఎంపీసీ), బీఎస్సీ(ఎమ్ఎస్‌సీఎస్), బీఎస్సీ(బీజెడ్‌సీ), బీఎస్సీ(జెడ్ఎమ్‌సీ), బీకామ్(జనరల్), బీకామ్(కంప్యూటర్), బీఏ(హెచ్ఈపీ))కోర్సుల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంటర్‌మీడియట్‌కు సంబంధించిన నాన్ కో ఎడ్యుకేషన్ కాలేజీల్లో ఎమ్‌పీసీ, బైపీసీ కోర్సులకు కూడా స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని తెలిపారు. గురుకులాల్లో వసతి సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు.

32 జిల్లాల్లో దెబ్బతిన్న రోడ్లు

- రూ.1200 కోట్ల మేర నష్టం : మంత్రి కోమటిరెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో 32 జిల్లాల్లో 587 రోడ్లు తెగిపోయినట్టు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నిరంతరం వానలు కురుస్తున్న కారణంగా అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. తక్షణం ఈ రహదారుల తాత్కాలిక మరమ్మతులకు రూ.256 కోట్లు అవసరమని వివరించారు. శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేసేందుకు రూ.1200 కోట్లు కావాల్సి ఉంటుందని తెలిపారు. వరదలతో దెబ్బతిన్న రహదారుల సమాచారం ఇంకా పూర్తిస్థాయిలో రావాల్సి ఉందన్నారు. ఈమేరకు మంత్రి మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు.

సచివాలయ ఉద్యోగుల విరాళం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు ఒకరోజు మూలవేతనాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి లేఖ అందచేసినట్టు తెలంగాణ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ నాయకులు రాజేశ్వరరెడ్డి, రమేష్, నవీన్, వెంకట్రామిరెడ్డి, సరేష్‌కుమార్, నాగరాజు, రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఉమా నాగలక్ష్మి, నేతి మంగమ్మ, ఎస్ శ్రీదేవి తెలిపారు. మంగళవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం మీడియాపాయింట్‌లో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల్లో సర్వం కోల్పోయిన ప్రజల కోసం సామాజిక బాధ్యతగా ఈ విరాళాన్ని అందిస్తున్నామన్నారు. అడిషనల్ సెక్రటరీ నుంచి ఆఫీస్ సబార్డినేట్ వరకు తమ ఒక్క రోజు మూల వేతనాన్ని విరాళంగా ఇచ్చేందుకు అంగీకరించారని తెలిపారు. సెప్టెంబర్ జీతంనుంచి ఈ విరాళాన్ని మినహాయించుకోవాలని సీఎస్‌ను కోరామన్నారు. తన తరఫున దాదాపు రూ. కోటి విరాళంగా ఇస్తున్నామనీ, ఇతర సంఘాలు, ఉద్యోగులు, కార్పొరేట్ సంస్థలు కూడా భారీగా విరాళాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి నెల ఐదు లోపు జీతాలు చెల్లించాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సెక్రటేరియట్ జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న (డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లు) ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెల ఐదు లోగా జీతాలు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె వెంకటేశ్, ఉపాధ్యక్షులు పద్మశ్రీ, ప్రధాన కార్యదర్శి జె కృష్ణారెడ్డి, ప్రకార్యదర్శి జె కుమార స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎస్ శాంతికుమారిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర సెక్రటేరియట్ సాధారణ పరిపాలనా శాఖలో 100 మందికి పైగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిన గత 20 ఏండ్లుగా విధి నిర్వహణలో ఉన్నారని తెలిపారు. ఆ సిబ్బందికి 2024 ఏప్రిల్ నుంచి ప్రతినెలా జీతాలు ఆలస్యంగా చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు జాప్యం చేయటం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సచివాలయంతో సహా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించే విధంగా సంబంధిత హెచ్‌ఓడీలను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

వారం రోజుల్లో 'గాంధీ'లో ఐవీఎఫ్ ప్రారంభం

- దొరల్లా మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకులు : వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్‌లో వారం రోజుల్లో ఐవీఎఫ్ కేంద్రాన్ని ప్రారంభిస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మంగళవారం మంత్రి గాంధీ ఆస్పత్రి, కింగ్ కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాంధీలో బెడ్లు, రోజువారీ ఓపీ వివరాలను సూపరింటెండెంట్ రాజకుమారిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి తనిఖీ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి హుటాహుటిన ఆస్పత్రికి చేరకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఐపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లో ప్రస్తుతం ఎంత మంది డాక్టర్లు డ్యూటీలో ఉన్నారనే వివరాలు అడిగారు. అలాగే, నర్సింగ్ సిబ్బంది, డయాగ్నస్టిక్, క్లినికల్ విభాగాల్లో పని చేస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓపీ వివరాలను పరిశీలించి మంకీ పాక్స్ వార్డుల ప్రిపరేషన్‌పై ఆరా తీశారు. డెంగ్యూ కేసుల పురోగతిని పరిశీలించారు. రోగుల అటెండెంట్లకు సరిపడా కుర్చీలను సమకూర్చాలని అధికారులకు సూచించారు. అన్ని వార్డులనూ మంత్రి తనిఖీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులు దొరల్లా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎక్కువ కాలం ఒకేచోట తిష్ట వేసిన వారిని బదిలీ చేశామని తెలిపారు. ఆస్పత్రుల్లో మందుల కొరత ఉందనటం సరికాదన్నారు. కాంట్రాక్టు పద్ధతుల్లో వైద్యులను తీసుకుంటామని తెలిపారు.

మూడు తండాలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం: సీఎం

నవతెలంగాణ - మరిపెడ



వరద పరివాహక ప్రాంతంలో సర్వం కోల్పోయిన మూడు తండాల ప్రజలకు సురక్షిత ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెం, ఆకెరువాగు ముంపు ప్రాంతమైన సీతారాం తండాను మంత్రులతో కలిసి వెళ్లి సీఎం సందర్శించారు. తండావాసులతో మాట్లాడారు. బ్రిడ్జి పక్కన దెబ్బతిన్న జాతీయ రహదారిని పరిశీలించారు. అనంతరం తండాలో మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. నాలుగు రోజుల నుంచి కురిసిన వర్షాలతో వరదలు బీభత్సం సృష్టించాయన్నారు. జల ప్రలయంలో మృతిచెందిన వ్యక్తికి సంబంధించి కుటుంబానికి రూ.5లక్షల చొప్పున అందజేస్తామని హామీ ఇచ్చారు. వరదల్లో మృతిచెందిన పశువులకు రూ.50వేలు అందిస్తామన్నారు. వరద ప్రవాహంలో 30వేల ఎకరాల్లో పంటల నష్టం జరిగిందని, ప్రతి ఎకరాకూ రూ.10వేలు పరిహారం అందిస్తామని చెప్పారు. నీటిలో తడిసి ముద్దయిన ప్రాంతాల్లో ప్రభుత్వానికి సంబంధించిన సర్టిఫికెట్లు.. బ్యాంక్ అకౌంట్స్ వివరాలు ఏమైనా ఉంటే కలెక్టర్ వారందరికీ అందించాలని ఆదేశించారు. సీఎం వెంట మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నూకల నరేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌ను దేశ క్రీడా రాజధానిగా మారుస్తాం

- ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభంలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌ను దేశ క్రీడా రాజధానిగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. ఇండియా, సిరియా, మారిషస్ దేశాల మధ్య జరిగే ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించాలని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య నిర్ణయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో మూడు దేశాల మధ్య జరిగే ఇంటర్ కాంటినెంటల్ కప్-2024 ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఇండియా, మారిషస్‌ల మధ్య తొలి మ్యాచ్ ఓపెనింగ్ మ్యాచ్ ప్రారంభ వేడుకలో సీఎం పాల్గొన్నారు. ఆటగాళ్లకు స్వాగతం పలికారు. మూడు జట్ల మధ్య మూడు మ్యాచ్‌లు (రౌండ్ రాబిన్ పద్ధతిలో) జరగనుండగా, సెప్టెంబర్ 6న మారిషస్ వర్సెస్ సిరియా, 9న ఇండియా వర్సెస్ సిరియా జట్లు తలపడనున్నాయి. ఈ ప్రారంభోత్సవంలో సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడి, ఆలిండియా ఫుట్ బాల్ ఫెడరేషన్ అధ్యక్షులు కల్యాణ్ చౌబే, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



వరదనష్టం వివరాలు వారాంతానికి ఇవ్వండి

ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు ఏర్పాట్లు చేయండి : అధికారులకు సీఎస్ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరబాద్‌బ్యూరో

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం వివరాలను ఈ వారాంతంలోగా సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారుల్ని ఆదేశించారు. వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టం అంచనా వేయడం కోసం మంగళవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆమె వివిధ శాఖల కార్యదర్శులు, ఆయా విభాగాధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ డాక్టర్ జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ రావు, రవిగుప్తా, వికాస్‌రాజ్, అర్వింద్‌కుమార్, ముఖ్య కార్యదర్శులు దానకిషోర్, నవీన్‌మిట్టల్, కార్యదర్శులు రాహుల్ బొజ్జా, రఘునందన్‌రావు, లోకేష్‌కుమార్, రోనాల్డ్‌రోస్, ప్రశాంత్‌జీవన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఇప్పటికీ అనేక జిల్లాల్లో వరదలు, వానలు తగ్గుముఖం పట్టలేదని చెప్పారు. నష్టం అంచనా కోసం సంబంధిత శాఖల బృందాలను క్షేత్ర స్థాయికి పంపి, జీపీఎస్ కోఆర్డినెట్‌లతో సహా సమర్పించాలని సూచించారు. సీఎం ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ఫోర్స్ (ఎస్‌డీఆర్‌ఎఫ్)లు ఏర్పాటు చేయడానికి కావాల్సిన నిధులు, సిబ్బంది, పరికరాల వివరాలను వెంటనే సమర్పించాలని కోరారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హన్మంతరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి కూడా పాల్గొన్నారు

ప్రజావాణిలో 611 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 611 దరఖాస్తులు అందాయి. ఎస్సీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 149, బీసీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 123, మైనారిటీ వెల్ఫేర్‌కు సంబంధించి 94, విద్యుత్ శాఖకు సంబంధించి 57, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 54, ఇతర శాఖలకు సంబంధించి 134 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చినవారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నేడు పలు జిల్లాలకు భారీ వర్షసూచన

- ఎల్లో హెచ్చరిక జారీ చేసిన వాతావరణ శాఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బుధవారం పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. రాష్ట్రం మీదుగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు కొమరంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కూడా పలుచోట్ల పడే అవకాశముంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురువొచ్చు. మంగళవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో మొత్తం 383 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో అత్యధికంగా 8.8 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది.

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు

జైనూర్(కొమ్రంభీమ్ అసిఫాబాద్)	8.8 సెంటీమీటర్లు
నమూర్(ఆదిలాబాద్)	8.7 సెంటీమీటర్లు
గట్టు (జోగులాంబ గద్వాల)	6.8 సెంటీమీటర్లు
ఉట్నూర్(ఆదిలాబాద్)	6.0 సెంటీమీటర్లు
మల్దకల్(జోగులాంబ గద్వాల)	5.6 సెంటీమీటర్లు

విద్యుత్ అధికారులపై క్రమశిక్షణ కొరడా

- నలుగురిపై చర్యలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న విద్యుత్ అధికారులపై తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ క్రమశిక్షణా కొరడా ఝళిపించారు. నలుగురు అధికారులపై వినియోగదారుల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో చర్యలు తీసుకోక తప్పలేదని స్పష్టం చేశారు. వీరిలో కొందరు యాజమాన్యానికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరు అయ్యారనీ, అందువల్ల వారిపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకున్నామన్నారు. ఇబ్రహీంబాగ్ ఆపరేషన్స్ విభాగంలో అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఈ అంబేద్కర్‌ను కార్పొరేట్ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడే డివిజినల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న శివశంకర్, అడిషనల్ అసిస్టెంట్ ఇంజినీర్ ఏ జ్ఞానేశ్వరరావులకు చార్జిషీట్లు జారీ చేశారు. నార్సింగి ఆపరేషన్స్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సందీప్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అవినీతికి పాల్పడటం, వినియోగదారుల్ని ఇబ్బంది పెట్టడం వంటి అనైతిక కార్యకలాపాలకు పాల్పడితే ఎవర్నీ ఉపేక్షించేదిలేదని సీఎమ్‌డీ హెచ్చరించారు.

నేటినుంచి దోస్త్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్

- రిజిస్ట్రేషన్ గడువు 9
- షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు దోస్త్ కన్వీనర్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. బుధవారం నుంచి ఈనెల తొమ్మిదో తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువుందని తెలిపారు. బుధవారం నుంచి ఈనెల తొమ్మిదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని వివరించారు. అదేనెల తొమ్మిదిన ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 11వ తేదీన ప్రత్యేక విడత సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. అదేనెల 11 నుంచి 13 వరకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలనీ, ఫీజు చెల్లించాలని కోరారు. ఈనెల 12, 13 తేదీల్లో కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలకు https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మారుమూల మెడికల్ కాలేజీ సిబ్బందికి ప్రత్యేక అలవెన్స్

- తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘానికి మంత్రి హామీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజధానికి దూరంగా మారుమూల ప్రాంతాల మెడికల్ కాలేజీల్లో విధులు నిర్వహిస్తున్న వారికి త్వరలో ప్రత్యేక అలవెన్స్ వస్తుందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. మంగళవారం మంత్రి హైదరాబాద్ లో ప్రభుత్వాస్పత్రుల పర్యటన సందర్భంగా గాంధీ ఆస్పత్రిలో బోధనా వైద్యుల సంఘం సెక్రెటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదాల తదితరులు మంత్రిని కలిసి ప్రత్యేక అలవెన్సు విషయాన్ని గుర్తుచేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. ఇదే విషయాన్ని వారు డీఎంఈ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత ఫైలును క్లియర్ చేసేందుకు మంత్రి, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి గట్టిగా ప్రయత్నిస్తున్నట్టు తెలిపారని డాక్టర్ కిరణ్ మాదాల తెలిపారు.

బానిస బతుకులే

రోజంతా పనిచేసినా గిగ్ వర్కర్లకు వచ్చే ఆదాయం స్వల్పమే



- ఎండైనా, వానైనా, చలైనా విధులు నిర్వర్తించాల్సిందే
- సేవల రంగంలో కానరాని సామాజిక భద్రత
- నిత్యకృత్యమైన వేధింపులు, నిరాదరణ, నిర్లక్ష్యం
- మహిళావర్కర్లపై లైంగిక దాడులు

న్యూఢిల్లీ : మండుటెండలో అయినా, వర్ష బీభత్స సమయంలో అయినా, వణికించే చలిలో అయినా గిగ్ వర్కర్లుగా సేవల రంగంలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులు రాత్రింబవళ్లు విధులు నిర్వర్తి స్తూనే ఉంటారు. అలుపెరుగకుండా పనిచేస్తూ వినియోగదారులకు సేవలు అందిస్తూనే ఉంటారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగినా పట్టించుకునే నాథుడే ఉండడు. పైగా యజమాని నుంచి చీత్కారాలు తప్పవు. ఉద్యోగ భద్రత, ఇతర ప్రయోజనాలు అనేవి వారి డిక్షనరీలోనే లేని పదాలు.

'భారీ వర్షంలో ఓ ఆర్డర్‌ను డెలివరీ చేయడానికి వెళుతుంటే బండి పడిపోయింది. దెబ్బలు తగిలాయి. ఊరడింపుల మాట ఏమో కానీ సకాలంలో డెలివరీ చేయనందుకు జరిమానా కట్టాల్సి వచ్చింది' అని సర్వేష్ కుమార్ అనే డెలివరీ బాయ్ ఆవేదనతో చెప్పారు. ఎంత ప్రమాదం జరిగినా ఏమీ జరగనట్లే దులిపేసుకొని ముందుకు సాగాలని, అప్పగించిన పనిని సకాలంలో పూర్తి చేయాల్సిందేనని తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుండి వారికి రక్షణ అనేదే ఉండదు. రోజుకు కనీసం 12 గంటలు పనిచేయాలి. సెలవలు, పండుగలు అనేవే ఉండవు. మరుగుదొడ్డి సౌకర్యం ఉండదు. కుక్క కాట్లు, కస్టమర్ల ఈసడింపులు సరేసరి.

సేవల కంపెనీలు ఇవే

ఉబర్, ఓలా కాబ్స్, ర్యాపిడో బైక్ ట్యాక్సీ, స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, డంజో, బిగ్ బాస్కెట్, అర్బన్ కంపెనీ మొదలైన ఆన్‌లైన్ యాప్ ఆధారిత వేదికలు ఇంటి వద్దే కస్టమర్లకు అత్యవసర సేవలు అందిస్తుంటాయి. అందుకోసం అవి ట్యాక్సీ డ్రైవర్లు, డెలివరీ సిబ్బంది, ఇతర నిపుణులను నియమించుకుంటాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ దిగ్గజ సంస్థలు సైతం తమ డెలివరీల కోసం సిబ్బందిని నియమిస్తున్నాయి.

లిఫ్టు సైతం ఎక్కనీయరు

సామాజిక భద్రతా ప్రయోజనాలు లభించాలంటే గిగ్ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలని పలువురు సూచిస్తున్నారు. కంపెనీలకు సిబ్బంది, వారి ఆరోగ్యం పట్టదని, ధనార్జనే వారి ధ్యేయమని సేవల రంగానికి చెందిన ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని భవనాలలో లిఫ్టును ఉపయోగించేందుకు సైతం కార్మికులను అనుమతించడం లేదు. దీంతో వారు బహుళ అంతస్తుల భవనంలో మెట్లు ఎక్కి వస్తువులు, పదార్థాలను అందజేయాల్సి వస్తోంది.

హీనంగా చూస్తారు

కొందరు కస్టమర్లు సిబ్బందిని హీనంగా చూస్తుంటారు. వారితో కలిసి లిఫ్టులో ప్రయాణించేందుకు ఇష్టపడరు. వాస్తవానికి సిబ్బందిలో చాలా మంది పట్టభద్రులే. కుటుంబాన్ని పోషించడం కోసం ఈ రంగంలో పనిచేయాల్సి వస్తోంది. కోవిడ్ సమయంలో వారి కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ముంబయిలో అర్బన్ కంపెనీలో బ్యుటీషియన్‌గా పనిచేస్తున్న నిషా నాటి చేదు జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ 'క్లయింట్లు మా శరీరంపై ఆపాదమస్తకం శానిటైజర్‌ను స్ప్రే చేసే వారు. ఈ వ్యాధి మా నుండి మాత్రమే వారికి అంటుతుందా? మాకు కుటుంబాలు లేవా?' అని ఆవేదనతో ప్రశ్నించారు. అంజలీ సింగ్‌ది మరో రకమైన వ్యథ. ఇవ్వాల్సిన వస్తువులు అందజేసినా సొమ్ము ఇచ్చేందుకు క్లయింట్ నిరాకరించింది. 'డబ్బులు ఇవ్వమని అడగగానే దూషించడం మొదలు పెట్టింది. భర్తను పిలిచింది. నన్ను బెదిరించింది. భయంతో డబ్బులు తీసుకోకుండానే అక్కడ నుండి బయటకు వచ్చేశాను. కంపెనీకి సమాచారం ఇచ్చాను. ఘటనను వీడియో తీసి వారికి చూపించాను కూడా. అయితే వారు ఆ క్లయింటుపై చర్య తీసుకోవడానికి బదులు నా ఐడీని బ్లాక్ చేశారు. నా వివరణ తీసుకోకుండానే ఉద్యోగం నుండి వెంటనే తొలగించారు' అంటూ ఆమె కన్నీటిపర్యంతమైంది. తనకు కనీసం ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ కూడా ఇవ్వలేదని చెప్పింది. చిన్న పొరబాటు జరిగినా అర్బన్ కంపెనీలో కఠినంగా వ్యవహరిస్తారని, ఐడీని బ్లాక్ చేసి ఉద్యోగం తీసేస్తారని అదే సంస్థలో పనిచేసిన నిషా తెలిపారు.



ఏం కోరుతున్నారు?

గిగ్ వర్కర్లంతా కట్టుబానిసలే. వారాంతపు సెలవలు, పండుగ సెలవలు ఉండవు. ఈ నేపథ్యంలోనే వారు తమ డిమాండ్లపై గళం విప్పుతున్నారు. కనీస వేతనాలు ఇవ్వాలని, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, సామాజిక భద్రత అందించాలని కోరుతున్నారు. కార్మిక నిబంధనలను కంపెనీలు తుంగలో తొక్కుతున్నాయని, రాష్ట్రాలు అవసరమైన నియంత్రణలు విధించి తమకు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్ని సంవత్సరాలు సేవలు అందించినా ఏం లాభమని, పెన్షన్, రిటైర్‌మెంట్ ప్రయోజనాలే ఉండవని సంతోష్ వాపోయారు. నెలకు కనీసం పాతిక వేల రూపాయల వేతనం అందించాలని, సెలవలు, ఈఎస్ఐ పథకం కింద ప్రయోజనాలు, పెన్షన్ లేదా పీఫ్ వంటి రిటైర్‌మెంట్ నిధి అందజేయాలని కార్మికులు పట్టుబడుతున్నారు. సేవల రంగంలో పనిచేసే వారికి, ప్లాట్‌ఫారం కార్మికులకు చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారం వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రసూతి ప్రయోజనాలు, మెరుగైన వేతనాలు వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కూడా తాము డిమాండ్ చేస్తున్నామని చెప్పారు.

మంది పెరిగితే మజ్జిగ పలచబడుతుంది

రాబోయే 8-10 సంవత్సరాలలో ఈ రంగం తొమ్మిది కోట్ల ఉద్యోగాలు కల్పిస్తుందని, దాని లావాదేవీలు దేశ జీడీపీలో 1.25 శాతానికి చేరతాయని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, మైకెల్ అండ్ సుసాన్ డెల్ ఫౌండేషన్ అంచనా వేశాయి. అనధికారిక రంగంలో కార్మికులు పెద్ద ఎత్తున చేరడం ఆందోళన కలిగిస్తోందని, అధికారిక రంగంలో ఉపాధి అవకాశాలు లేకపోవడమే దీనికి కారణమని నిపుణులు అభిప్రాయపడ్డారు. డిమాండ్ పెరిగినప్పుడు కంపెనీలు ఎక్కువ మంది పనివారిని తీసుకుంటాయి. అప్పుడు ఉన్న పనినే ఎక్కువ మంది పంచుకోవాల్సి వస్తుంది. ఫలితంగా ఉద్యోగుల ఆదాయం పడిపోతుంది. ఎందుకంటే ఆర్డర్లు, బుకింగ్స్‌ను బట్టే ఆదాయాలు ఉంటాయి. ఈ రంగంలో పనిచేసే మహిళల సంఖ్య తక్కువగానే ఉంటుంది. తగిన భద్రత లేకపోవడమే దీనికి కారణం. మహిళలకు వేధింపులు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఈ రంగంలో పనిచేసే మహిళలకు పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, సమాన ప్రతిఫలం చట్టం వర్తింపచేయాలని నిపుణులు సూచించారు.

కనికరమే ఉండదు

నిటి ఆయోగ్ రూపొందించిన నివేదిక ప్రకారం 2021-22 ఆర్థిక సంవత్సరంలో దేశంలో సేవల రంగంలో పని చేసిన వారి సంఖ్య 77 లక్షలు. 2029-30 నాటికి ఈ సంఖ్య 2.35 కోట్లకు చేరుతుందని అంచనా. ఎలాంటి నిబంధనలు, నియంత్రణలు లేకపోవడంతో ఈ రంగంలో పనిచేసే వారు దోపిడీకి గురవుతున్నారని యాప్ కార్మికుల యూనియన్ కమిటీ సభ్యుడు హరీష్ గౌతమ్ తెలిపారు. 'మేలో మిట్ట మధ్యాహ్నం వాతావరణం బాగా వేడిగా ఉన్న సమయంలో కుప్పకూలిపోయాను. రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. అప్పుడు నేను డ్రైవింగ్ చేయలేదు. ఫలితం...జీతం నుండి రెండు రోజుల వేత నాన్ని కోసేశారు' అని హైదరాబాదుకు చెందిన ఊబర్ డ్రైవర్ సంతోష్ కుమార్ (40) వాపోయారు. 'ఎంత ఎక్కువ పనిచేస్తే అంత ఎక్కువ డబ్బు వస్తుంది'...సేవల రంగంలో పనిచేసే వారికి తెలిసిన సూత్రం ఇదొక్కటే. ఆరోగ్య సమస్యల కారణంగా ఏ ఒక్క రోజు పని మానేసినా వేతనం ఉండదు. ముఖ్యంగా వేసవిలో కారు నడపడం దుర్భరంగా ఉంటుందని, అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని, అయినా కుటుంబ పోషణ కోసం రోజుకు 12-16 గంటలు పనిచేయక తప్పదని సంతోష్ ఆవేదనతో చెప్పారు. సేవల రంగంలో పనిచేస్తున్న వారి కోసం కేరళ ప్రభుత్వం ఇటీవలే తిరువనంతపురంలో విశ్రాంతి గదులను ఏర్పాటు చేసింది. రాజస్థాన్, కర్నాటక తర్వాత సేవల రంగానికి నిబంధనలు ప్రతిపాదిస్తూ ముసాయిదా బిల్లును రూపొందించిన రాష్ట్రం కేరళే.

వర్షంలో బైక్ నడుపుతూ కిందపడినప్పుడు కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్‌కు ఫోన్ చేస్తే ఆస్పత్రికి వెళ్లాలని ఉచిత సలహా ఇచ్చారని, ఆర్డర్‌ను డెలివరీ చేయనందుకు ఐదు వందల రూపాయల జరిమానా కట్టాల్సి వచ్చిందని సర్వేష్ అనే కార్మికుడు చెప్పారు. రోజుకు రూ.800-1000 సంపాదించడానికి 12-14 గంటలు పనిచేయాల్సి వస్తోందని తెలిపారు. తమకు ఆరోగ్య బీమా అనేదే లేదని సంతోష్, సర్వేష్ తెలియజేశారు. ఈ నేపథ్యంలో తమకు ఈఎస్ఐ సౌకర్యమైనా కల్పించాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

పంటల నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేసి వెంటనే పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఐదు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. దాదాపు 4.5లక్షల ఎకరాల వరకు పంటలు దెబ్బతిన్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వాస్తవంగా రెట్టింపు స్థాయిలో పంటలకు నష్టం జరిగిందని తెలిపారు. వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, పండ్లతోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. వరద బాధిత ప్రాంతాల పర్యటనల్లో సీఎం రైతాంగానికి భరోసా కల్పించాలని కోరారు. పరిహారం విషయంలో ఆహార ధాన్యాలకు ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50వేలు, చనిపోయిన పశువులకు ఒక్కొక్క దానికి రూ.50వేలు, గొర్రెలు, మేకలకు రూ.10వేల చొప్పున, మరణించిన కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని పంటల పరిశీలన చేసి ఆదుకోవాలని కోరారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని శుభం గార్డెన్‌లో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 2 వరకు తెలంగాణ రైతు సంఘం రాష్ట్రస్థాయి రైతు శిక్షణా తరగతులు విజయవంతంగా జరిగాయని చెప్పారు. ఇందులో షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ చివరి వరకు ఆందోళనలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. అడవి జంతువుల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలంటూ 25న ఢిల్లీలో ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. కౌలు రైతుల సమస్యలపై ఈనెల 10 వరకు సర్వేలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

గురుకులాల్లోకి బ్రహ్మకుమారీస్ సంస్థను తేవొద్దు

- ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లోని విద్యార్థులకు మానసిక ఉల్లాస తరగతుల పేరుతో బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక సంస్థను తేవొద్దనీ, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం జీవో నెంబర్ 16 పేరుతో గురుకులాల్లోని విద్యార్థులకు తీవ్ర ఒత్తిడి ఉండేలాగా సమయపాలనను మార్చిందని తెలిపారు. దీని వల్ల విద్యార్థులకు సమయం లేకుండా ఉందనీ, ఇంత ఒత్తిడిని తట్టుకోవాలంటే సైకాలజిస్టులకు ఈ బాధ్యత ఇవ్వాల్సింది పోయి, ఆధ్యాత్మిక సంస్థలకు ఇవ్వడం అనేది అనాలోచిత నిర్ణయమని విమర్శించారు. సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి తీసుకున్న ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు నష్టం చేసే ఈ గురుకులా సమయపాలనను శాస్త్రీయంగా మార్చాలనీ, ఒత్తిడి లేకుండా చూడాలని కోరారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కాళోజి అవార్డుకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రతిష్టాత్మక 'కాళోజీ నారాయణరావు అవార్డు'కు అర్హులైన సాహితీవేత్తను ఎంపిక చేసేందుకు ప్రముఖ కవి అందెశ్రీ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ మొదటి సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. కమిటీ సభ్యులు ఏనుగు నర్సింహారెడ్డి, సంగనభట్ల నర్సయ్య, పొట్లపల్లి శ్రీనివాస్, కన్వీనర్ మామిడి హరికృష్ణ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజాకవి 'పద్మభూషణ్ 'కాళోజీ నారాయణరావు పేరుమీద ప్రతీఏటా సాహితీ అవార్డు కింద గ్రహీతను సన్మానించి, జ్ఞాపికతో పాటు రూ.1,01,116 నగదును అందజేస్తారు. ఈ అవార్డుకు దాదాపు 40 మంది సాహితీవేత్తలు దరఖాస్తు చేసుకున్నట్టు కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

పోలీసులు, భద్రతా సిబ్బందికి డీజీపీ అభినందనలు

- దుందుభి నదిలో చిక్కుకున్న చెంచులను రక్షించిన అధికారులు



నవతెలంగాణ-అచ్చంపేట

మూడ్రోజులు కురిసిన భారీ వర్షాలకు నల్లమలలో వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లాయి. డిండి ప్రాజెక్ట్ అలుగు ప్రమాద స్థాయిలో కిందకు దూకుతోంది. దేవరకొండ.. గోన బోయినపల్లికి చెందిన 10 మంది చెంచులు చేపల వేట కోసం అచ్చంపేట మండల పరిధిలోని సిద్ధపూర్ సమీపంలో దుందుభి వాగుకు వచ్చారు. వరద నీరు ఉధృతం కావడంతో వారు దుందుభి నదిలో చిక్కుకున్నారు. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు ప్రత్యేకంగా సోమశిల నుంచి గజ ఈతగాళ్లను రప్పించి నాటు పడవలు, తాళ్ల సహాయంతో వరదలో చిక్కుకున్న చెంచులను బయటికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో అచ్చంపేట, దేవరకొండ పోలీసులను డీజీపీ జితేందర్ అభినందించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వెంటనే రిస్క్యూ టీం, పోలీసులు, భద్రత సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం 5గంటలకే దుందిబి వాగు పరిసర ప్రాంతానికి చేరుకున్నారు. చెంచు కుటుంబాలకు నిత్యావసర సరుకులు, తాగునీరు, మందులు పంపిణీ చేశారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వారిని అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. అర్ధరాత్రి సైతం సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్ఐ రాములను, అగ్నిమాపక, రెవెన్యూ శాఖ అధికారులను ఎమ్మెల్యే అభినందించారు.

వరద బాధితులకు ఉద్యోగ జేఏసీ ఆపన్నహస్తం

- ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.130 కోట్ల విరాళం
- ఒకరోజు మూలవేతనం ఇవ్వాలని తీర్మానం
- సీఎం రేవంత్‌రెడ్డికి హామీపత్రం అందజేత




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్/మహబూబాబాద్

రాష్ట్రంలో భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వరద బాధితులకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆపన్నహస్తం అందించింది. వారికి ఆదుకోవడానికి ముందుకొచ్చింది. ఒక రోజు మూలవేతనం సుమారు రూ.130 కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల జేఏసీ తీర్మానం చేసింది. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావుల నేతృత్వంలో కలిసి విరాళానికి సంబంధించిన హామీపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చావ రవి, కె జంగయ్య, ఎస్ మల్లారెడ్డి, వంగ రవీందర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, ముజీబ్ హుస్సేని, ఎ సత్యనారాయణ, మధుసూదన్‌రెడ్డి, జి సదానందంగౌడ్, స్థితప్రజ్ఞ, కటకం రమేష్, మణిపాల్‌రెడ్డి, గౌతమ్ కుమార్, చంద్రశేఖర్ గౌడ్, లక్ష్మయ్య, అశోక్, జ్ఞానేశ్వర్, మహబూబాబాద్ నాయకులు వడ్డెబోయిన శ్రీనివాస్, రామారావు, సాయి భార్గవ్, చైతన్య భగవాన్, వెంకట పుల్లయ్య, విజయ్‌కుమార్, రోహిత్, రంజిత్, ఉష, సురేష్, రాజ్యలక్ష్మి, సభద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ విపత్కర పరిస్థితుల నుంచి బయటపడగానే ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. కొంతమంది ప్రభుత్వంతో అంటకాగి జేఏసీ ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని అన్నారు. ఈ జేఏసీ ప్రభుత్వంలో పనిచేస్తున్న పది లక్షల మంది ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఇందులోని నాయకులు స్వార్థం కోసం పనిచేసే వారు ఎవరూ లేరనీ, ప్రజల కోసం సేవ చేసే వారని గుర్తు చేశారు.

అంతకుముందు తెలంగాణ ఉద్యోగ జేఏసీ స్టీరింగ్ కమిటీ అత్యవసర సమావేశాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో కార్యాలయంలో నిర్వహించారు. ప్రధానంగా రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం, పంట నష్టాల గురించి చర్చించారు. అస్తవ్యస్థమైన జన జీవనాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలకు మద్దతుగా మానవతా దృక్పథంతో స్పందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంట ఉండాలని నిర్ణయించింది. రాష్ట్ర ఉద్యోగుల తరపున (205 ప్రధాన సంఘాల) జేఏసీ పక్షాన ఒక రోజు మూల వేతనాన్ని రూ.130 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధికి జమ చేయాలని తీర్మానించింది. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్, లింగారెడ్డి, పర్వతి సత్యనారాయణ, రాధాకృష్ణ, కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, దామోదర్ రెడ్డి, గాజుల నర్సయ్య, నవనీతరావు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

- ముగ్గురు మృతి
- నలుగురికి గాయాలు



నవతెలంగాణ-పాలకుర్తి

ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో ముగ్గురు ప్రయాణికులు మృతిచెందారు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామ శివారు సబ్ స్టేషన్, రైస్ మిల్లు సమీపంలో మంగళవారం జరిగింది. పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు డిపోకు చెందిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు సుమారు 20మంది ప్రయాణికులతో తొర్రూరుకు బయలుదేరింది. విశాఖపట్నం నుంచి సిద్దిపేటకు లోడుతో వెళుతున్న లారీ వావిలాల గ్రామ శివారులోని రైస్ మిల్లు సమీపంలో బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న పాలకుర్తి గ్రామానికి చెందిన ఎండీ నసీమా(50), మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెలికట్ట గ్రామ శివారు టిక్యతండాకు చెందిన జాటోతు హేమాని(55) బస్సులోనే మృతిచెందారు. జాటోతు బుజ్జి(50)ని అంబులెన్స్‌లో తొర్రూరుకు తరలిస్తుండగా మృతిచెందింది. భద్రాచలం ఇల్లందుకు చెందిన ఎర్ర సత్యవతి, వర్ధన్నపేట మండలం ఇల్లందుకు చెందిన పోలేపల్లి భూలక్ష్మి, పాలకుర్తి మండలం నారా బోయినగూడెం గ్రామానికి చెందిన తెరిపల్లి నాగమ్మ, తొర్రూరు మండలం టిక్య తండాకు చెందిన జాటోతు బాలాజీకి తీవ్ర గాయాలయ్యాయి.

నసీమా తొర్రూరు మండలం నాంచారి మడూరు వద్ద ఉన్న జ్యోతిరావుపూలే డిగ్రీ గురుకుల కళాశాలలో వంట మనిషిగా పనిచేసేది. జాటోతు హేమాని, జాటో బుజ్జి, జాటోతు బాలాజీ, జాటో భారతి హైదరాబాదులో కుమార్తె ఇంటికి వెళ్లి వస్తున్నారు. ఎస్ఐలు మోడం సాయి ప్రసన్న కుమార్, ఎం.లింగారెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.

ఘటనా స్థలిని పరిశీలించిన జనగామ డీసీపీ

ప్రమాద స్థలాన్ని జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి పరిశీలించారు. పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అది రాజ్యాంగ ఉల్లంఘనే

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్ఎస్ఎస్‌లో చేరేందుకు ప్రభుత్వ ఉద్యోగులను అనుమతించే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని మాజీ సివిల్ సర్వెంట్ల గ్రూప్, కాన్‌స్టిట్యూషనల్ కండక్ట్ గ్రూప్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశాయి. ఉత్తర్వును అమలు చేయడం వల్ల రాజ్యాంగ ఆత్మకు 'అపాయకరమైన హాని' కలుగుతుందని పేర్కొన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లో సభ్యులుగా ఉండకూడదని 58 ఏండ్లుగా విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తూ ఇటీవల ఇచ్చిన ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరాయి.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) హిందుత్వ గ్రూప్ అని, బీజేపీకిమాత సంస్థ అని పేర్కొన్నాయి. ఆర్ఎస్ఎస్ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మూడు సార్లు నిషేధించబడిందని, ఇది హిందూ ఆధిపత్యాన్ని, మైనారిటీల పట్ల అసహనాన్ని ప్రోత్సహిస్తుందని తెలిపాయి. 1966 నవంబర్‌లో ప్రభుత్వ అధికారులతో సంబంధం లేని సంస్థల జాబితాలో సంఘ్ పేర్కొబడిందని గుర్తు చేశాయి. "లౌకిక ప్రజాస్వామ్యం, మైనారిటీ హక్కులను పరిరక్షించే పనిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, వాటిని సైద్ధాంతికంగా వ్యతిరేకించే సంస్థకు తమ విధేయతను బహిరంగంగా ప్రకటించడానికి అనుమతించే ఈ ఉత్తర్వుల పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నాం" అని పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించడం అధికారులు, పోలీసుల విధి

రాజ్యాంగాన్ని రక్షించడం, సమర్థించడం సివిల్ అడ్మినిస్ట్రేటర్లు, పోలీసుల ప్రధాన విధి అని పేర్కొన్నాయి. "ఇందులో మతపరమైన, కుల మైనారిటీల జీవితం, స్వేచ్ఛ, ఆరాధనతో సహా రాజ్యాంగ హక్కుల పరిరక్షణ ఉంటుంది" అని స్పష్టం చేశాయి. సివిల్ సర్వెంట్లు తమ మానవతావాదాన్ని, నిష్పాక్షికతను, రాజ్యాంగం నిర్దేశించిన విలువలకు కట్టుబడి ఉండాలని అన్నివేళలా ప్రదర్శించాలని లేఖలో పేర్కొన్నాయి. నిషేధాన్ని ఎత్తివేయడం అంటే "జిల్లా మేజిస్ట్రేట్, ఒక పోలీసు అధికారి, ప్రభుత్వ కార్యదర్శి, ప్రొఫెసర్, ఉపాధ్యాయుడు, ప్రభుత్వ వైద్యుడు" బహిరంగంగా" భిన్నవాదాన్ని తిరస్కరించే సంస్థలో సభ్యుడు కావచ్చు. ఇది రాజ్యాంగంలోని లౌకిక మూలానికి విరుద్ధమైనదని పేర్కొన్నాయి.

ఆర్ఎస్ఎస్ సాంస్కృతిక సంస్థ కాదు...రాజకీయ సంస్థ

"ఆర్ఎస్ఎస్ ఒక సాంస్కృతిక సంస్థ అని, రాజకీయ సంస్థ కాదనే సాకుతో నిషేధాన్ని ఎత్తి వేశారని, ఇది పూర్తిగా నిజం కాదు. ఆర్ఎస్ఎస్ రాజకీయ సంస్థే" అని లేఖ పేర్కొన్నాయి. "99 ఏండ్ల కిందట ఏర్పడినప్పటి నుంచి దాని వ్యవస్థాపకులు, నాయకులచే వ్యక్తీకరించబడిన హిందూ రాష్ట్ర (హిందూ దేశం) లక్ష్యం ఆర్ఎస్ఎస్ భావజాలం ప్రధాన భాగంలో ఉంది" అని తెలిపాయి. ప్రతి విశ్వాసం, గుర్తింపు కలిగిన వ్యక్తులకు సమాన పౌరసత్వ హక్కులు, స్వేచ్ఛలకు హామీ ఇచ్చే రాజ్యాంగం మూల సూత్రాలు, ప్రతిజ్ఞలకు విరుద్ధంగా ఉందని పేర్కొన్నాయి. "ప్రభుత్వ అధికారులను ఆర్ఎస్ఎస్ సభ్యులుగా లేదా దానితో అనుబంధం కలిగి ఉండటానికి అనుమతించే ప్రభుత్వ ఉత్తర్వు రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లే" అని తెలిపాయి.

ఎన్నికల్లో కోట్ల మంది ఆర్ఎస్ఎస్ సభ్యులు బీజేపీకి పని చేస్తున్నారు

"అక్షరాలా కోట్ల మంది ఆర్ఎస్ఎస్ సభ్యులు ప్రతి రాష్ట్ర, జాతీయ ఎన్నికలలో బీజేపీకి బహిరంగంగా ప్రచారం చేస్తారు" అని స్పష్టం చేశాయి. "ప్రధాన ఎన్నికల కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులు, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించే పనిలో ఉన్న ఇతరులందరూ ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీతో బలంగా జతకట్టిన సంస్థలో సభ్యులుగా ఉన్నప్పుడు ఎన్నికల ప్రక్రియ సమగ్రతకు ఎలా హామీ ఇవ్వబడుతుంది?" అని ప్రశ్నించాయి. ఆర్ఎస్ఎస్‌తో సైద్ధాంతిక అనుబంధాలు ఉన్న సంస్థల సభ్యులు కూడా ఇటీవలి కాలంలో "ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. కొన్నిసార్లు మారణహోమం, జాతి ప్రక్షాళనకు పిలుపునిచ్చారు" అని తెలిపాయి. మత హింస ఎపిసోడ్‌లపై కనీసం ఆరు న్యాయ విచారణ కమిషన్‌లు ఆర్ఎస్ఎస్ భావజాలంతో అనుబంధం కలిగి ఉన్న సంస్థలను మత హింస మంటల్లో పాత్ర ఉన్నట్టు అభియోగాలు మోపాయి. దీని ఫలితంగా ముస్లింలు, ఇతర పౌరుల విస్తృతమైన ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని గుర్తు చేశాయి. "సివిల్ సర్వెంట్లు రాజ్యాంగంలో మొదట సేవకులు. దీని తరువాత మాత్రమే వారు పనిచేసే ఎన్నుకోబడిన ప్రభుత్వానికి కట్టుబడి ఉండేవారు" అని లేఖలో పేర్కొన్నారు. "రాజ్యాంగ ప్రతిజ్ఞలు, అత్యంత వెనుకబడిన పౌరుల హక్కులు ప్రభుత్వ ఆదేశాలతో దెబ్బతింటుంటే, అటువంటి రాజ్యాంగ విరుద్ధమైన ఆదేశాలను నిరోధించడం వారి విధి అని స్పష్టం చేశాయి.

నిషేధం ఎత్తివేస్తూ రాష్ట్రాల్లో కూడా ఉత్తర్వులు

కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నెల తరువాత రాజస్థాన్‌లోని బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలలో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులపై నిషేధాన్ని ఎత్తివేసింది. ప్రభుత్వోద్యోగులకు సంబంధంలేని 17 సంస్థల జాబితా నుంచి ఆర్ఎస్ఎస్‌ను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 1972 నుంచి రాష్ట్రంలో నిషేధం అమలులో ఉంది. అంతకుముందు, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌తో సహా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రభుత్వ ఉద్యోగులపై ఆర్ఎస్ఎస్‌లో సభ్యులుగా ఉండకూడదని నిషేధాన్ని ఎత్తివేసాయి. మహాత్మా గాంధీ హత్యానంతరం ఆర్ఎస్ఎస్‌పై మొదట నిషేధం విధించారు. ఆ తరువాత 1975 నుంచి 1977 వరకు ఎమర్జెన్సీ సమయంలోనూ, 1992లో అయోధ్యలోని బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత మూడోసారి నిషేధించారు.

జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ను కలసిన కార్పొరేటర్



నవతెలంగాణ - వనస్థలిపురం

కొత్తగా వచ్చిన జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్ సేవను స్థానిక వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని కాలనీలో అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ కాలనీ నవీన్, యాదవ రెడ్డి, అనిల్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-పెద్ద అంబర్‌పేట్

నూతనంగా మెట్టు మండలానికి విచ్చేసిన తహసీల్దార్ సుదర్శన్ రెడ్డికి మంగళవారం పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ సీపీఐ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్ నాయక్, మండల పార్టీ కార్యవర్గం సభ్యులు యేశాల నర్సింహ, కేతరాజు నర్సింహ, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంటలపాటు

నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించండి

- నాలా కల్వర్టుల వద్ద పేరుకుపోయిన ఫ్లోటింగ్ మెటీరియల్‌ను తొలగించాలి
- కమిషనర్ ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్‌లో వర్ష ప్రభావం లేనప్పుడు నాలాలు, స్ట్రామ్ వాటర్ డ్రైన్ కల్వర్టుల వద్ద ఫ్లోటింగ్ మెటీరియల్ తొలగించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ అడిషనల్, జోనల్ కమిషనర్‌లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి క్షేత్ర స్థాయి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షం కురిసిన సందర్భంలో ఫ్లోటింగ్ మెట్రియల్ కల్వర్టుల వద్ద నీరు నిలిచి లోతట్టు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జోనల్ కమిషనర్లు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. నాలా క్లీనింగ్ చర్యలు ఫోటో గ్రాఫితో పంపించాలన్నారు. వరద ముంపునకు గురై కనీసం రెండు గంటల పాటు నీరు నిలిచిన కాలనీలను గుర్తించి అక్కడ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చర్యలు తీసుకోవాలని హెల్త్ అడిషనల్ కమిషనర్‌ను ఆదేశించారు.

రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల జిల్లా వైద్య అధికారులను సంప్రదించి వారి పరిధిలోని కాలనీలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. వర్షాల వలన దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఎక్కువ దెబ్బతిన్న రోడ్లు, పాట్ హెూల్స్ ప్రమాదకరమైనవిగా భావించినపుడు ప్రమాదం సంభవించకుండా హెచ్చరిక బోర్డులు గాని, అటు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు.

'గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి'



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని తోట జంగారెడ్డి ఫంక్షన్ హాల్లో ఆదిబాట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల ఉత్సవ కమిటీ సభ్యులతో వినాయక నవరాత్రి ఉత్సవాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపల్ చైర్మెన్ మర్రి నిరంజన్ రెడ్డి, సీఐ రాఘవేందర్ రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డీఈఈ జ్యోతి రెడ్డి, కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, నిమ్మల సునీత శ్రీకాంత్, ఎస్సై రాజు, నాదర్ గుల్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- కమిషనర్ జ్ఞానేశ్వర్



నవతెలంగాణ - మీర్‌పేట్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు బాగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ..తగు జాగ్రత్తలు తెలియజేయాలని ఆశా వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేసినట్టు తెలిపారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ ఇతర వ్యాధులు ఈ సీజన్ లో ఎక్కువగా వస్తాయన్నారు. అందుకే ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటర్ లిస్ట్ జాబితాను చట్టప్రకారం సరి చేయాలని బూత్ స్థాయి అధికారులను, సూపర్వైజర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చంద్రప్రకాష్ రెడ్డి, ఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరా దేవి తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్

నవతెలంగాణ- చంపాపేట్

గణేష్, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని దక్షిణ, తూర్పు మండలం డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ అన్నారు. హైదరాబాద్ జిల్లా యాకూత్‌పురా నియోజకవర్గం సైదాబాద్ మండలం ఐఎస్‌సదన్ డివిజన్ చంపాపేట్ పరిధిలోని ఎంఎస్ఆర్ గార్డెన్‌లో సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సౌత్ ఈస్ట్ జోన్ ఆల్ జోన్స్ జనరల్ సెక్రెటరీ శ్రీ కిషన్ శర్మ అడ్వకేట్, సౌత్ ఈస్ట్ జోన్ అధ్యక్షులు ఖాజా గజవుద్దీన్, ఈస్ట్ జోన్ నారాయణరెడ్డి, పీస్ కమిటీ అధికారుల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీసీపీ హాజరై మాట్లాడారు. గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కల్గించకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. గణేష్ మండపాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. సమాజ సేవలో యువత ముందుకు రావాలని పీస్ కమిటీ సభ్యులను కోరారు. ఈ సమావేశంలో ఏసీపీలు వెంకన్న నాయక్, శ్యాంసుందర్, మహమ్మద్ గౌస్, మనోజ్ కుమార్, సీఐలు, ఎస్ఐలు, డీఐలు, పోలీస్ సిబ్బంది, పీస్ కమిటీ సభ్యులు, డాక్టర్ ఆఫీస్ ముజాఫర్ హుస్సేన్, సంతోష్ నగర్, ఐఎస్ సదన్ సౌత్ ఈస్ట్ జోన్ పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ గోవింద్ సాగర్, సంతోష్ నగర్ అధ్యక్షులు పీస్ కమిటీ సభ్యులు చింతల శ్రీనివాస్, ఎండి సలీం తదితరులు పాల్గొన్నారు.



గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని వినతి

నవతెలంగాణ- మీర్‌పేట్

గణేష్ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో చాలా రోడ్లు గుంతలతో ఉన్నాయని వాటికి మరమ్మతులు చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. గణేష్ నిమజ్జనం ఈ నెల 10 నుండి 20వ తేదీ వరకు జరుగుతుంది కాబట్టి.. మంత్రాల చెరువు కట్టపై భారీ క్రేన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని, పర్యావరణ పరిరక్షణ సందర్భంగా చెరువులో ఎటువంటి పూలు పత్రి వేయకుండా మున్సిపల్ సిబ్బందిని నియమించాలని కోరినట్టు తెలిపారు. వినతి అందజేసిన వారిలో మహేశ్వరం నియోజకవర్గం కో కన్వీనర్ కోడూరు సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏ బీమ్ రాజ్, ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు కీసర హరినాథ్ రెడ్డి(కార్పొరేటర్), పల్లె జంగయ్య గౌడ్(కో ఆప్షన్ సభ్యులు) తీగల సాయినాథ్ రెడ్డి, బచనమోని నరసింహాయాదవ్, వలబోజు గోపీనాథ్ చారి, కార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మల్లికార్జున్, శ్రీశైలం యాదవ్, రామ్ గోపాల్, కార్తీక్ సాగర్, శంకర్ పాల్గొన్నారు.



24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూమ్



గణేష్ నిమజ్జనానికి చెరువులను సిద్ధం చేయాలి

సఫిల్‌గూడ చెరువును పరిశీలించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-సిటీబ్యూరో/నేరేడ్‌మెట్

గణేష్ నిమజ్జనానికి అవసరమైన అన్ని వసతులతో సఫిల్‌గూడ చెరువును సిద్ధం చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సికింద్రాబాద్ జోన్ సఫిల్‌గూడ బేబీ పాండ్‌ను పరిశీలించారు. శానిటేషన్ పరిస్థితి, రోడ్ల స్థితిగతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా అధికారులకు గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సెప్టెంబర్ 7 నుండి 17 వరకు గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని, గణేష్ నిమజ్జనానికి సఫీల్‌గూడ చెరువు వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా జరగాలని, ఎలాంటి ఫిర్యాదులు రావద్దన్నారు. క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. డార్క్ స్పాట్స్ వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లైటింగ్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ర్యాలీ కొనసాగే రహదారులు బాగుండేలా చర్యలు చేపట్టాలని, రోడ్లపై పాట్ హెూల్స్ లేకుండా వెంటనే పూడ్చాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా చెట్టు కొమ్మలను కత్తిరించాలని, చెరువు వద్ద బోట్‌ను అందుబాటులో ఉంచాలని, స్ట్రీట్ లైట్స్ వెలిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. భక్తులకు త్రాగు నీరు, తదితర కనీస సౌకర్యాలు, కల్పించాలని అధికారులకు సూచించారు. ఎక్కువ మొత్తంలో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, నిమజ్జన సమయంలో సంబంధిత సర్కిళ్లలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ఇప్పటివరకు పూర్తి చేసిన పనులను మేయర్‌కు వివరించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఉత్సవ కమిటీ మేయర్ దృష్టికి తీసుకువచ్చిన ఆయా సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపినందుకు ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ మేయర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ తనిఖీలో మేయర్ గద్వాల్ విజయ లక్ష్మితో పాటు జోనల్ కమిషనర్ రవి కిరణ్, డిప్యూటీ కమిషనర్ రాజు, పోలీస్, శానిటేషన్, లేక్స్, ఎంటమాలజీ, వైద్య ఆరోగ్యశాఖ, ఇంజనీరింగ్, తదితర విభాగాల అధికారులు, కార్పొరేటర్ శ్రావణ్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయండి

హైడ్రా కమిషనర్‌కు మధుయాష్కీ గౌడ్ ఫిర్యాదు



నవతెలంగాణ - వనస్థలిపురం

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఆక్రమణలు, కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మెన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కీ గౌడ్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. తర్వాత కమిషనర్‌కు చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలోని పలు చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో క్రమంగా కొత్త నిర్మాణాలు పుట్టుకొస్తూ ఆక్రమణలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. ఇటీవల కాలంలో యథేచ్ఛగా భారీ భవంతులు నిర్మాణాలు పుట్టుకొచ్చాయన్నారు. చెరువుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ నిర్మాణాలను కూడా తొలగించి మరి ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బైరమల్‌గూడలోని చెరువు ఆరున్నర ఎకరాలకు గాను రెండు ఎకరాలు మిగిలిందన్నారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో ఆక్రమణలు తొలగించాలని కోరారు. మన్సూరాబాద్ చిన్న చెరువు లో ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో భారీ భవంతులు నిర్మించారని ఆరోపించారు. ఫతుల్లాగూడ చెరువు పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ కూడా తొలగించి నిర్మాణాలు చేపట్టారని అన్నారు. హస్తినాపురంలోని చేపల చెరువు కనీసం ఆనవాళ్లు లేకుండా పోవడం దారుణమన్నారు. సాహెబ్ నగర్‌లోని కాప్రాయి చెరువు సుమారు 40 ఎకరాల గాను 12 ఎకరాలు మిగలడం చెరువులను ఇలా చెరపెట్టారన్న దానికి నిదర్శనం అని అన్నారు. 2020లో కురిసిన భారీ వర్షాలకు చెరువుల వాస్తవ ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ల పరిధి తేలిందన్నారు. కానీ ఆక్రమణలు మాత్రం ఆగటం లేదని, ఇకనైనా వాటిని నిలువరించాలన్నారు. మన్సూరాబాద్ పెద్ద చెరువు, సరూర్‌నగర్ చెరువు, బండ్లగూడ చెరువు, హయత్ నగర్‌లోని కుమ్మరి కుంట, బాతుల చెరువు, హతిగూడ చెరువు తదితర నియోజకవర్గంలోని చెరువుల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

మహిళలకు

ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ



- ఎమ్మెల్యే అహ్మద్ బలాల

నవతెలంగాణ - మలక్‌పేట్

మలక్‌పేట్‌లోని చౌనీ డివిజన్ జీహెచ్ఎంసీ గుడ్డిబౌలి కమ్యూనిటీ హాల్లో 50 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను మంగళవారం పంపిణీ చేసినట్టు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కుట్టు మిషన్లు ఉపయోగపడతాయని అన్నారు. ఇంటి దగ్గరే ఉంటూ స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలని మహిళలకు సూచించారు. మహిళలు నేటి పోటీ యుగంలో అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారన్నారు. ఉపాధి మార్గాలు పెంచుకోవడం కష్టం కాదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సలాం షాహిద్, ఏఐఎంఐఎం మలక్‌పేట్ మహిళా అధికారి నజిమ, కాలనీ వాసులు పాల్గొన్నారు.



కమిషనర్ ఆమ్రపాలిని కలిసిన కార్పొరేటర్



నవతెలంగాణ-వనస్థలిపురం

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఐఏఎస్‌ను మంగళవారం బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన రెడ్డి, నాగోల్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి



నవతెలంగాణ-హయత్‌నగర్

వరద బాధితులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి డిమాండ్ చేశారు. హయత్‌నగర్ మండల పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వలన రవాణా వ్యవస్థ తోపాటు పంట పొలాల రైతులు ఎంతో తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ అనేక గ్రామలు జలదిగ్బంధంలో ఉన్నాయని అన్నారు. వారికి నీళ్ళు, ఆహారం లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అంతేకాదు వారికి అంటు వ్యాదులు ప్రభలే ప్రమాదం ఉందని.. పునరావాస కేంద్రాల్లో ఉంచి ఆకోవాలని కోరారు. హైదరాబాద్ జంట నగరాల్లో లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయని, కరెంట్, తాగునీరు లేక జనాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వాపోయారు. వరదల్లో నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, మరణించిన కుటుంబాలకు పది లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంటువ్యాధులతో పాటు వైరస్ వ్యాప్తి అయ్యే అవకాశాలు ఉన్నందున డాక్టర్లు, మెడిసిన్స్‌ను అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌లో

గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు

- డిప్యూటీ కమిషనర్ సుజాత



నవతెలంగాణ-ఎల్బీనగర్

నగరంలో ప్రసిద్ధిగాంచిన మినీ ట్యాంక్ బండ్ సరూర్‌నగర్ చెరువులో గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ సుజాత అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు, వాటర్ రివర్స్ అధికారులు, టిఎస్‌పిసిడిసిఎల్ అధికారులుతో అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్, సివిల్ పోలీసుల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిమజ్జనానికి రూట్ మ్యాప్, భారీ క్రెన్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సుమారు 3 వేల విగ్రహాలు వస్తాయని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. వీధిలైట్లు, చెత్త సేకరణ కోసం కావాల్సిన సిబ్బందిని నియమించి.. అధికారులకు ఒక్కొక్క బాధ్యతను అప్పగిస్తున్నామన్నారు. 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గణేష్ నిమజ్జనానికి వచ్చే వాహనాలను పరిశీలిస్తామని తెలిపారు. డబుల్ బార్కెట్లను ఏర్పాటు చేసి రద్దీ లేకుండా చూస్తున్నట్టు పేర్కొన్నారు. మినీ ట్యాంక్‌బండ్‌గా పేరుగాంచిన సరూర్‌నగర్ చెరువులో నిమజ్జనానికి వందలాదిమంది రోజు వస్తారని, వారికి ఎమర్జెన్సీ అవసరం ఏదైనా ఏర్పడితే అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, డాక్టర్లతో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నిమజ్జనానికి తరలివచ్చే వారికి వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ తాగునీరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తామని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పేదల ఇండ్లకు ప్రత్యామ్నాయం చూపాలి

- రియాల్టర్స్ అసోసియేషన్ జేఏసీ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ - హయత్‌నగర్

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) పరిధిలోకి వచ్చే పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని తెలంగాణ రియాల్టర్స్ అసోసియేషన్ జేఏసీ అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. మన్సూరాబాద్‌లో ఉన్న రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా సంపాదించిన సొమ్మును రికవరీ చేయాలని అన్నారు. రాష్ట్రం ప్రభుత్వం హైడ్రా కమీషన్‌ను ఏర్పాటు చేయడం తెలంగాణ రియాల్టర్స్ అసోసియేషన్ జేఏసీ హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్ళను హైడ్రా నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్, చెరువులలో కట్టిన అపార్ట్మెంట్లు, ఇండ్లకు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు పర్మిషన్లు ఇవ్వడం మూలంగా వాటిని కొన్న పేదలు నష్టపోయారని వారి నుండి విముక్తి కలిగించాలని అన్నారు. ముందుగా పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రియాల్టర్స్ అసోసియేషన్ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా సదరు అధికారులు, వ్యాపారస్తుల ఆస్తులను జప్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు బత్తుల అంజయ్య, వెంకట్ రెడ్డి, జాని రజక మాదగోని సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డిని కలిసిన మేకల కావ్య



నవతెలంగాణ-జవహర్ నగర్

జవహర్ నగర్ నూతన కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డిని జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జిట్ట శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు శోభా రెడ్డి, నాయకులు ఆలూరి రాజశేఖర్, మేకల భార్గవ్ రామ్, ఉచల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలలో పర్యటించిన మేయర్



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జలమయమైన ప్రాంతాల ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటామని పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ అన్నారు. మంగళవారం స్థానిక కార్పొరేటర్ కె.సుభాష్ నాయక్‌తో కలిసి జలమయమైన ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో నండూరి రామ్మోహన్‌రావు వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత, సైన్స్‌ను ప్రజలకు సరళమైన భాషలో అందించిన నండూరి రామ్మోహన్ రావు 13వ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభను కమలానగర్ ఆఫీసులో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించగా నండూరి రామ్మోహన్ రావు చిత్రపటానికి జి. శివరామకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ.. ప్రజలందరికీ అర్థమయ్యే విధంగా మానవుడి పరిణామక్రమాన్ని నరావతారం అనే పుస్తకం ద్వారా, విశ్వ పరిణామక్రమాన్ని విశ్వరూపం పుస్తకం ద్వారా ప్రజలకు అందించారని చెప్పారు. ప్రముఖ విజ్ఞాన వేత్త జయప్రకాష్ మాట్లాడుతూ.. నండూరి రామ్మోహన్‌రావు పత్రికా సంపాదకులుగా పత్రికల్లో పనిచేశారని తెలిపారు. అయన అనేక ఇంగ్లీష్ పుస్తకాలను తెలుగులో అనువదించి తెలుగు ప్రజలకు అర్థమయ్యేలా చేశారని పేర్కొన్నారు. విశ్వరూపం, నరవతారం, లాంటి పుస్తకాలు ఆ తర్వాత విశ్వ దర్శనం రెండు భాగాలుగా రాశారని చెప్పారు. ప్రపంచ తాత్విక ధోరణులు, భారతీయ తాత్విక చింతనను వివరంగా రాశారని తెలిపారు. ఆయన రాసిన అనేక నవలలో పాటు రాజు పేద నవల మూడు భాషల్లో సినిమాలుగా వచ్చాయని చెప్పారు. వారు సాహిత్య రంగానికి చేసిన సేవలు ఎంతో అమూల్యమైనవి వివరించారు. స్ఫూర్తి గ్రూపు నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటానికి ముందు జాతీయ భావాలతో ఉన్న ఆంధ్ర పత్రిక సంపాదకత్వం నార్ల వెంకటేశ్వరరావు తర్వాత నండూరి రామ్మోహన్‌రావు స్వీకరించారని గుర్తు చేశారు. అనంతరం సబికులందరూ చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేకే ఉన్నికృష్ణన్, ఎం శ్రీనివాస్, శ్రీనివాసరావు, గౌసియా, శోభ, శ్రీమన్నారాయణ, జయ ప్రకాష్, ఋషి, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



- జీహెచ్ఎంసీ ఈస్ట్ జోన్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి

నవతెలంగాణ-కాప్రా

ఓల్డ్ మల్లాపూర్‌లోని పలు బస్తీలల్లో సీసీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వెంటనే సీసీ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ ఈస్ట్ జోన్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, ఈస్ట్ జోన్ సీనియర్ ఇంజనీర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే బండారి సమీక్ష



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కాపా మున్సిపల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చించి తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు డీసీ జగన్, ఎస్సీ అశోక్‌రెడ్డి, ఈఈ హరిలాల్, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బద్రుద్దీన్, నవీన్ గౌడ్, కాసం మహిపాల్ రెడ్డి, మహేష్ గౌడ్, ఇంద్రయ్య, బోదాసు నరేష్, గిల్బర్ట్ మహేష్, కొండల్ గౌడ్ పాల్గొన్నారు.

వినాయకుడి నిమజ్జనానికి చెరువులు పరిశీలన



నవతెలంగాణ-కాప్రా

వినాయకుడి నిమర్జనం చేసేందుకు కాప్రా పరిధిలోని చెరువులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కుషాయిగూడ సీఐ అంజయ్యతో కలిసి పరిశీలించారు. వినాయక నిమర్జనం చేసేటప్పుడు అవాంఛనీ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-జవహర్‌నగర్

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలను భూదాన్ పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు శృతి ప్రారంభించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా జవహర్ నగర్‌కు చెందిన చిరంజీవి జూనియర్ విభాగంలో గోల్డ్ మెడల్, సీనియర్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. విషయం తెలుసుకున్న జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ దంపతులు మంగళవారం వారి నివాసంలో చిరంజీవిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

విలీనం

- మున్సిపాల్టీల్లోకి ఓఆర్ఆర్ పరిధిలోని జీపీలు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనే అత్యధికం
- గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని పలు గ్రామాలు సమీప మున్సిపాల్టీల్లో విలీనం అయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటూ మంగళవారం గెజిట్ విడుదల చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనే అత్యధిక గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. తక్షణమే ఈ ఉత్వర్వులు అమల్లోకి రావాలని పేర్కొంది. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) పరిధిని విస్తరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకూ జీహెచ్ఎంసీ పరిధిలోకి తీసుకొస్తామనే విషయాన్ని కూడా పదేపదే ప్రస్తావించారు. ఇందులో భాగంగా జీపీలను విలీనం చేస్తూ తెలంగాణ పురపాలక చట్ట సవరణ ఆర్డినెన్స్ 2024ను ప్రభుత్వం జారీ చేసింది. ఈ మేరకు జీవో 73ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇక వీలీన జీపీలు గ్రామాలు పంచాయతీలు కావు.. అక్కడ పంచాయతీ ఎన్నికలు కూడా నిర్వహించరు. మరోవైపు కొంతకాలం తర్వాత ఈ మున్సిపాల్టీలను జీహెచ్ఎంసీ పరిధిలోకి తేనున్నట్టు సమాచారం. మున్సిపాల్టీల్లో విలీనం చేసిన గ్రామ పంచాయతీల్లో అత్యధికంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోనే ఉన్నాయి. జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీలను 7 మున్సిపాల్టీల్లో విలీనం చేశారు. ప్రస్తుతం మున్సిపాల్టీల్లో విలీనం అవడం.. ఆ తర్వాత గ్రేటర్‌లో కూడా కలిపితే ఔటర్‌ను ఆనుకుని ఉన్న ఈ గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. అదే సమయంలో ఇప్పటి వరకు పంచాయతీలుగా ఉన్న ఈ గ్రామాలకు పెద్ద పన్నుల్లేవు. విలీనమైనందున పన్నుల రాబడి కూడా బాగా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తున్నది.

మున్సిపాల్టీ	విలీన గ్రామాలు
దమ్మాయిగూడ	కీసర, యాద్‌గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి
నాగారం	బోగారం, గోధుమకుంట, కరీంగూడ, రాంపల్లి దాయార
మేడ్చల్	పూడూర్, రాయలపూర్
గుండ్ల పోచంపల్లి	మునీరాబాద్, గౌడవెల్లి
తూంకుంట	బొంరాస్‌పేట, శామీర్‌పేట, బాబాగూడ
ఘట్‌కేసర్	అంకుషాపూర్, మాదారం, ఎదులాబాద్, ఘనపూర్, మర్‌పల్లిగూడ
పోచారం	వెంకటాపూర్, ప్రతాప సింగారం, కొర్రెముల, కాచవాణి సింగారం, చౌదరిగూడ

రేషన్‌కార్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు

- మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి
- రేషన్ డీలర్స్‌తో సమావేశం





నవతెలంగాణ-నేరేడ్ మెట్

తెల్లరేషన్ కార్డు లేకపోవడంతో నిజమైన అర్హులు ప్రభుత్వం పథకాలను పొందలేక ఇబ్బందులు పడుతున్నారని, అంత్యోదయ కార్డును దివ్యాంగులకు, విడోస్, హెచ్ఐవీ, డయాలసిస్ పేషెంట్ల కు, కుష్టు వ్యాధిగ్రస్తులకు వర్తింపజేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కొత్త రేషన్ కార్డులు అర్హులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని రేషన్ డీలర్లతో సమావేశంను ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్లతో ప్రజలకు, రేషన్ డీలర్లకున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మూడునెలలు రేషన్ తీసుకోకుంటే కార్డులను తీసేశారని వాటిని వెంటనే పునరుద్ధరించాలన్నారు. రేషన్ కార్డు జారీ తర్వాత పుట్టిన పిల్లల పేర్లు చేర్చడం, పెండ్లి చేసుకుని అత్త గారింటికి వెళ్లిన ఆడ పిల్లల పేర్లను తొలగించి, కుటుంబంలోకి కొత్తగా వచ్చిన వారి పేర్లను చేర్చి, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని, ఇలా ఎప్పటికప్పుడు పేర్లను తొలగిస్తూ, అవసరమైన వారి పేర్లను చేర్చితే అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వడం ప్రభుత్వానికి కూడా సులభంగా ఉంటుందన్నారు. రేషన్ కార్డు జారిలో పారదర్శకత అధికారులు వ్యవహరి ంచాలని తెలిపారు.

రేషన్ డీలర్లు ఎదుర్కుంటున్న సమస్యలు

కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన ప్రకారంగా రేషన్ డీలర్లకు నెలకు రూ.5 వేలు ఇవ్వాలని, రేషన్ డీలర్లకు కమిషన్ పెంచాలని, గోడౌన్లలో నుండి సరైన తూకంతో బియ్యం సంచులను డీలర్లకు అందజేయాలని, డ్యామేజ్ లేకుండా సరఫరా చేయాలని అధికారులను కోరారు. రేషన్ డీలర్లకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే సదుపాయాలను వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ బాలరాజు, కార్పొరేటర్ లు విజయశాంతి శ్రీనివాస్ రెడ్డి, మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ నిరుగొండా జగదీష్ గౌడ్, రేషన్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షులు ఉప్పల సంతోష్ కుమార్, బాల్ రెడ్డి, చక్రధర్, రమేష్ సింగ్, శివకుమార్, కరుణానిధి, వెంకట హరి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జికె హనుమంత రావు, కరంచంద్, డోలీ రమేష్, మేకల రాముయాదవ్, మధుసుధన్, డిల్లి పరమేశ్ రెడ్డి, మల్లేష్ గౌడ్, జె కే సాయి గౌడ్, భాగ్యానందరావు, వంశీ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ - జవహర్ నగర్

పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్న సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం ఆర్మీ డెంటల్ కాలేజ్ వెనకాల కొంత మంది వ్యక్తులు పేకా ట ఆడుతున్నా రన్న పక్క సమాచారం తో ఎస్సై నర్సిరెడ్డి వారి బృందంతో పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న వడుపు రామకృష్ణ, వంగూరి శ్రీనివాస్, సయ్యద్ ఇక్బాల్, లోన చిట్టిబాబు అనే నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నా రు. వారి వద్ద ఉన్న ఆరు సెట్ల ప్లేయింగ్ కార్డ్స్, నాలుగు సెల్ ఫోన్లు, రూ. 1,16,480/- నగదు ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు నష్ట పరిహారం అందేలా చూస్తాం





- కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వర్షాలతో నష్టపోయిన బాధితులకు పరిహారం అందేలా చూస్తానని కార్పొరేటర్ వై. ప్రేవమ్ కుమార్ అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బీజేఆర్ నగర్‌లో ఓ ఇంటి ప్రహరీ గోడ కూలి పోయింది. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కూలిపోయిన ఇంటి ప్రహరీ గోడను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కూలిపోయి ఇంట్లో ఉంటున్న వృద్ధులు పోచయ్య, సిద్ధమ్మను వారి కూతురు తన ఇంటికి తీసుకెళ్లడం వల్ల ఎటువంటి ప్రాణానికి జరగలేదని తెలిపారు. బాధితులకు నష్టపరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్ రెడ్డి, డీఈ లౌక్య, బాబు, తిరుపతి, కిషోర్, వెంకట్ నర్సయ్య, పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి అండగా వాట్సాప్ గ్రూపు సభ్యులు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇంద్రా నెహ్రూ నగర్ బస్తీకి చెందిన సంతోష్ క్యాన్సర్ బారినపడి రెండేండ్ల నుండి చికిత్స పొందుతున్నాడు. క్యాన్సర్‌తో ఏ పని చేయలేక ఇంట్లోనే ఉంటున్న సంతోష్ భార్య సంగీత ఇండ్లలో పనిచేసు కుంటూ వారి ఇద్దరు పిల్లలను చూసుకుంటూ సంతోష్ వైద్యానికి ఖర్చులు ఎల్లదీస్తుంది. ఈ మధ్య సంతోష్‌ను తరచూ ఆస్పత్రికి తీసుకెళుతున్న సంగీత తన భర్త వైద్య ఖర్చులకు డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని మానవసేవే మాధవసేవ గ్రూప్ సభ్యురాలు అనితకు తెలియజేయడంతో సదరు విషయాన్ని గ్రూపు అడ్మిన్ కుమ్మరి రాజుకు దృష్టికి తీసుకువచ్చింది. సంతోష్ విషయాన్ని గ్రూపు అడ్మిన్ కుమ్మరి రాజు తమ గ్రూపులోని సభ్యులతో చర్చించి, కొంత మంది గ్రూపు సభ్యుల సహకారంతో మంగళవారం సంతోష్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల చెక్కుని గ్రూపు సభ్యుల చేతుల మీదుగా సంతోష్, సంగీతలకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రూపు అడ్మిన్ కుమ్మరి రాజు మాట్లాడుతూ మల్కాజిగిరిలోని ప్రజా ప్రతినిధులు, ఎన్జీవో ప్రతినిధులు, ప్రజలు, మానవతా దృక్పథంతో సంతోష్ వైద్యానికి సహాయం అందివ్వాలని కోరారు. ఎవరైనా తమ విరాళం అందజేయాలనుకుంటే 8712799902 గూగుల్ పే, ఫోన్ పే ద్వారా సహాయం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాట్సాప్ గ్రూపు సభ్యులు మహమ్మద్ రషీద్, అనిత, మల్లేష్ యాదవ్, సిద్ధి రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చెరువు అలుగును తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలి





నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు ఎర్ర చెరువు అలుగును అక్రమంగా తవ్వి వేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు గొంగళ్ల ప్రభాకర్ రెడ్డి, ఇటబోయిన అశోక్ యాదవ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ సోమవారం కొందరు ప్రయివేట్ వ్యక్తులు ఎర్ర చెరువు అలుగు వద్దకు వచ్చి జేసీబీతో అలుగును తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి మధు దృష్టికి తీసుకెళ్లగా తూతూ మంత్రంగా పరిశీలించి వెళ్లిపోయారని పేర్కొన్నారు. కాగా ఎర్ర చెరువు సమీపంలో ఉన్న కొంత మంది ప్రయివేట్ వెంచర్, గోదాం నిర్వాహకుల ప్రోత్సద్భులంతోనే అలుగును తీశారని ఆరోపించారు. ఇదే విషయమై స్థానిక ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా నేనే అలుగును తీసి వెయ్యమని చెప్పానని ఒక్కసారి, నేను చెప్పలేదని మరొక్కసారి పొంతనలేని సమాధానం ఇచ్చారు.

ప్రయివేట్ వెంచర్, గోదాం నిర్వాహకుల చేతిలో కీలు బొమ్మగా మారిన ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఎర్ర చెరువు అలుగు పోకముందే మట్టిని తీయడం ఎంతవరకు కరెక్టని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రయివేట్ వ్యక్తుల కబ్జాలను కాపాడేందుకే ఇరిగేషన్ అధికారులు పనిచేస్తున్నారని ఆరోపించారు.

పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదు

- కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

హైడ్రా అధికారులు పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదని కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. హైడ్రా అధికారులు తమ నిర్మాణాలను ఎప్పుడు కూలుస్తారోనని బిక్కుబిక్కుమని బతుకుతున్న ఆర్టీసీ కాలనీ, కృష్ణ నగర్, శివానంద నగర్ కాలనీవాసులను మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ మంగళవారం కలిసి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..40 ఏండ్లుగా 50, 80 గజాలలో ఇండ్లు కట్టుకుని నివాసం ఉంటున్న పేదవారి ఇండ్లను ఎలా కులుస్తారని ప్రశ్నించారు. మీకు అండగా నేనుంటానని, పేదవాడి జోలికి వస్తే మాత్రం ఊరుకునేది లేదని హైడ్రా అధికారులను హెచ్చరించారు. హైడ్రాధికారులు చెరువులను కాపాడుతున్నారా? సెప్టిక్ ట్యాంకులను కాపాడుతున్నారా? అని ప్రశ్నించారు. ప్రతిరోజు మూడు డివిజన్‌ల మురికి నీరు కలుస్తున్న బండ చెరువు సెప్టిక్ ట్యాంక్ అవుతుందన్నారు. ఎన్నో ఎండ్లుగా ఉంటున్న వారి ఇండ్లు కూల్చడానికి వస్తే మా శవాల మీదుగానే బుల్డోజర్లు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.

విపత్తులపై ప్రతిపక్షాల రాద్ధాంతం సరికాదు

- కాంగ్రెస్ మేడ్చల్ అసెంబ్లీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో అకాల వర్షాలతో రాష్ట్రం అతలాకుతలం అవుతుంటే ప్రతిపక్షాలు ప్రభుత్వ ంపై చౌకబారు విమర్శలు చేయటం సరికాదని కాంగ్రెస్ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. అకాల వర్షాలపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేసిన వాఖ్యలపై మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం సహా రాష్ట్ర ఉన్నతాధికా రులు అప్రమత్తంగా ఉండటం వల్లే ప్రాణనష్టం తగ్గిందన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండా 10 ఏండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు పిట్ట కూతలు కూయటం ఏంటని ప్రశ్నించారు. ఈ విపత్తును కేంద్రం దృష్టికి తీసుకెళ్లి అత్యవసర నిధులు తెచ్చేలా బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కృషి చేయాలని కోరారు. నాలుగు రోజులుగా అధికారులు యుద్ధ ప్రాతిపదికన వర్షానికి వెరవకుండా పనులు చేస్తున్నారని తెలిపారు. విమర్శలు మానుకొని మానవతా దృక్పథంతో విపక్షాల నాయకులు, కార్యకర్తలు సైతం వరద బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని హితవు పలికారు. బాధితులను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అత్యవసర నిధులు మంజూరు చేసిందన్నారు.

కరాటే పోటీలో విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-కాప్రా

ఓరుగల్లు డ్రాగన్ స్కూల్ ఆఫ్ జపాన్ కరాటే షాటోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీలలో చర్లపల్లి, కుషాయిగూడ చెందిన పలువు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనిపించారు. నిశాంత్, కుషాల్, అద్విక్ రెడ్డి, నిహాల్ బంగారు పతకాలు సాధించగా బ్రాహ్మిణి, కార్తీక్ వెండి పతకాలను సాధించారని కరాటే మాస్టర్ బుడిగే రవికుమార్‌గౌడ్ తెలిపారు. ఈ పోటీలు నిర్వహించిన ఆర్గనైజేషన్ సభ్యులు కరాటే మాస్టర్ బుడిగే రవికుమార్ గౌడ్‌ను శాలువాతో సన్మానించి మెమొంటో అందజేశారు. ఈ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా వచ్చిన హన్మకొండ అర్బన్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గెలిచిన విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

కుంగిన మేడ్చల్ పెద్ద చెరువు

రోడ్డు మూసివేత

నవతెలంగాణ- మేడ్చల్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మేడ్చల్ పెద్ద చెరువు అలుగు పోస్తూ పొంగిపొర్లుతోంది. కాగా మంగళవారం ఉదయం చెరువుకట్ట కుంగి కింది నుండి నీరు వెళ్తోంది. కాగా చెరువు కట్ట పై నుండి ప్రయాణికులు రాకపోకలు కొనసాగించకుండా పోలీసులు తాత్కాలికంగా రోడ్డును మూసివేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని పలువురు పట్టణ వాసులు కోరుతున్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
బుధవారం | సెప్టెంబర్ 04, 2024 | www.navatelangana.com

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



- సీఐ సందీప్ కుమార్

నవతెలంగాణ-నేరేడ్ మెట్

గణేష్ మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంతమైన వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని నేరేడ్‌మెట్ సీఐ సందీప్ కుమార్ అన్నారు. మంగళవారం నేరేడ్‌మెట్‌లోని మహాబోధి ఫంక్షన్‌హాల్‌లో గణేష్ మండపాల ఆర్గనైజర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునే ఆర్గనైజర్స్ అందరూ పోలీస్ వెబ్సైట్ నందు వారి డీటెయిల్స్‌ను ఇవ్వాలన్నారు. నవరాత్రుల యందు గణేష్ నిర్వాహకులు కచ్చితంగా ఉండాలని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వినాయక నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, సెక్టార్ ఎస్సై లు, మండపాల ఆర్గనైజర్స్, పాల్గొన్నారు.

6న ప్రయివేట్ టీచర్స్ లెక్చరర్స్ సన్మాన సభ

నవతెలంగాణ - జవహర్ నగర్

టీచర్ దేశానికి దిక్సూచి అని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సురేందర్ కర్నే అన్నారు. తెలంగాణ ప్రయివేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోసెప్టెంబర్ 6న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సన్మాన సభను విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయకుమారిని సన్మాన సభకు అతిథిగా హాజరుకావాలని ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రభుత్వ టీచర్ సేవ ఎంతో ప్రైవేట్ టీచర్ సేవ కూడా అంతే ఉంటుందని అని గుర్తు చేశారు. ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ తెలంగాణ రాష్ట్రంలో అన్ని స్కూల్స్, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ ఇతర అన్నీ కాలేజీలు కలుపుకొని చూస్తే దాదాపు 8 లక్షల మంది ఉంటారని, ప్రయివేట్ విద్యాసంస్థలలో పని చేస్తున్న టీచర్స్ లెక్చరర్స్ సేవలను గుర్తుగా, వారి ఎక్స్పీరియన్స్‌ను ప్రాతిపదికగా తీసుకుని గౌరవించుకుందామని, తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే గౌరవ సన్మాన సభలో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలి

- రంగుల విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు ...
- డీవైఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పసుల అంజయ్య



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణనాథులను ప్రతిష్ఠించి, పూజించాలని డీవైఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పసుల అంజయ్య ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రసాయనా రంగులతో తయారుచేసిన విగ్రహాలతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. మట్టి విగ్రహాలను ప్రతిష్టించుకుంటే కులవత్తిపై ఆధారపడిన కుమ్మరులకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రకతిలో మమేకమయ్యే, పర్యావరణ సమతుల్యత కాపాడే సహజ సిద్ధమైన పూలు మొక్కలు, ఆకులతో పూజించే ఆచారం కలిగి ఉన్న పండుగ అన్నారు. మట్టి గణపతి విగ్రహాలను తీసుకువచ్చి ప్రతి ఒక్కరూ పూజలు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో మనం కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, తదితర మెటీరియల్ తో తయారుచేసే విగ్రహాల వలన పర్యావరణం కాలుష్యం అవుతుందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే పూజలు చెయ్యాలని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పూజించే సంస్కృతి సాంప్రదాయాలు ప్రజల్లోకి విస్తత స్థాయిలో తీసుకొని వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. తమ కాలనీలలో మట్టితో చేసిన విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

చిన్నారులకు పజిల్ గేమ్స్, ఆటలు ఉండేలా చూడాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు ఆడుకుంటూ నేర్చుకునేలా పజిల్ గేమ్స్, ఆటలు ఉండేలా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. మంగళవారం దుండిగల్, బహదూర్ పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్ వాడీలను పరిశీలించి ఎంత మంది పిల్లలు ఉన్నారు..? వారి వయస్సు ఎంత..? ఎంత బరువు ఉన్నారు..? అని టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. బలహీనంగా ఉన్న పిల్లల బరువును చూసి వారికి పౌష్టికాహారంతో పాటు దగ్గరగా ఉన్న ప్రభుత్వాస్పత్రిలో చూపించి వారికి అవసరమైన మందులను అందించాలని సూచించారు. పిల్లలకు అందించే ఆహారం, గుడ్లను కలెక్టర్ పరీక్షించారు. మెనూ చార్ట్ ప్రకారం పిల్లలకు పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలు కలెక్టర్‌కు పువ్వులు అందించి రైమ్స్ పాడి వినిపించారు. కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి కష్టారెడ్డి, సీడీపీఓ శారద, సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'వార్తాలాప్'పై వర్క్‌షాప్

- ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారత ప్రభుత్వం ద్వారా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో పత్రికా విలేఖర్ల కోసం 'వార్తాలాప్' అనే అంశంతో మీడియా వర్క్ షాపును నేడు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా, జిల్లా కలెక్టర్ గౌతమ్ గౌరవ అతిథిగా హాజరు కానున్నారు. జర్నలిస్టులకు సైబర్ క్రైమ్స్, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నారు.

మృతుల కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కల్యాణి

నవతెలంగాణ-సిటీబ్యూరో

పని ఒత్తిడితో చనిపోయిన ఆశా కార్యకర్త కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కల్యాణి డిమాండ్ చేశారు. పని ఒత్తిడితో మరణించిన మక్తల్ మండలం కర్ణే ప్రాథమిక వైద్య కేంద్రం పరిధిలో పని చేస్తున్న ఆశా కార్యకర్త బి.లక్ష్మి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరుతూ మంగళవారం కుషాయిగూడ పీహెచ్‌సీ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రేవతి కల్యాణి మాట్లాడుతూ గత నెల 20వ తేదీన ఇంటింటి సర్వే చేసి వచ్చిన లక్ష్మి ఇంటి ముందే కండ్లు తిరిగి పడిపోతే హాస్పిటల్‌కు తరలించారని తెలిపారు. వారం రోజులు మృతురాలు లక్ష్మి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయినట్టు తెలిపారు. మలేరియా, టీబీ, డెంగ్యూ, లెప్రసీ తదితర అనేక సర్వేలు చేస్తూ ప్రజలకు ఆరోగ్య సూచనలు చెబుతూ పని ఒత్తిడితో ఆశా కార్యకర్తలు పని చేస్తున్నా ప్రభుత్వం ఇంకా పని పెంచుతూ మోయలేని భారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత చేసినా ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. గతంలో ప్రభుత్వం ప్రకటించినట్టు ఆశా కార్యకర్తలకు ఇన్సూరెన్స్ ద్వారా రూ.50 లక్షలు వెంటనే అందివ్వాలని డిమాండ్ చేశారు.



ప్రత్యామ్నాయ రోడ్డును పరిశీలించిన న్యాయవాదులు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ వద్ద కూకట్ పల్లి కోర్టు కాంప్లెక్స్‌కు రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో ప్రతిరోజు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతున్నదని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. మంగళవారం కోర్టుకు రావాడానికి కూకట్ పల్లి కోర్టు న్యాయవాదులు ప్రత్యామ్నాయ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రోడ్డుతో న్యాయమూర్తులు, న్యాయవాదులు,కక్షిదారులు కోర్టుకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటుపై అధ్యయనం చేసి రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులను కలిసి ప్రతిపాదించాలని నిర్ణయించారు. ప్రత్యామ్నాయ రోడ్డు పై సాధ్యసాధ్యాలను అధ్యయనం చేసి , సాధ్యమైనంత త్వరగా రోడ్డు సౌకర్యం కల్పించాలని సీనియర్ న్యాయవాదులు అధికారులను కోరారు.

'ఎంఎల్ఆర్ఐటీ'లో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మంగళవారం సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్‌ను నిర్వహించింది. ఇది యువకులకు వారి ప్రతిభ, వ్యవస్థాపక ఆలోచనలను ప్రదర్శించడానికి ఒక వేదికను అందిస్తుంది. ఇది ఆలోచన ఉత్పత్తి, సృజనాత్మకత ప్రక్రియను అధ్యయనం చేయడానికి, అర్థం చేసుకోవడానికి వాతావరణాన్ని అందిస్తుంది. ఈ ఈవెంట్‌లో పాల్గొనేవారు వ్యవస్థాపక ప్రతిభను, వారి ఆలోచనలను సమర్థవంతంగా ప్రోత్సహించే, వివరించే సామర్థ్యాన్ని ప్రదర్శించింది. విద్యార్థులు తమ వ్యవస్థాపక ప్రతిభతో పాటు వారి సృజనాత్మకత, ఆవిష్కరణ, వ్యాపార చతురతను ప్రదర్శించడానికి ఇది మరపురాని అవకాశం. ఈవెంట్ ఎంఎల్ఆర్ఐటీ విద్యార్థులందరికీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మద్దతు ఇవ్వాలని ప్రోత్సహించారు. దైవ క్లేసా-పౌరాణిక గేమ్, గ్రే వాటర్ మేనేజ్‌మెంట్, సంచారి-ట్రావెల్, టూరిజం లాంటి చాలా ప్రత్యేకమైన, వినూత్నమైన ఆలోచనలు ఉన్నాయి. ఇవి వినియోగదారు సామర్థ్యాన్ని పెంచాయి. వారి జీవితాలను సులభతరం చేశాయి. బడఘూర్‌వాలా టెక్ ప్రయివేటు లిమిటెడ్ నుంచి మనోజ్ బడగ్వాలా, ఆకాష్ రావు మల్లారెడ్డి-సియరీ ఇన్‌లో సీనియర్ ప్రాజెక్ట్ విశ్లేషకులు వారి ఆలోచనలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు రావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ బలరాం, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీ ఫౌండర్ సెక్రెటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఎంఎల్ఆర్ఐటీ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు సమన్వయంతో కృషి చేసి ఈ హకథాన్‌ను విజయవంతంగా నిర్వహించారు అని అభినందించారు.

జలకన్య పార్క్‌లో వ్యక్తి మృతి



నవతెలంగాణ - కూకట్ పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 జలకన్య హోటల్ వద్ద ఉన్న ఆలె నరేంద్ర పార్క్‌లో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే.. గత ఆరు నెలలుగా అదే పార్క్ లో ఉంటూ సమీప హోటల్లో పని చేసుకుని పూట గడుపుకునే ఓ అనాధ వ్యక్తి సోమవారం రాత్రి అదే పార్క్‌లో మరణించాడు. సమాచారం తెలుసుకున్న స్థానిక డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని, పోలీస్ వారికి సమాచారం అందించి మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. చనిపోయిన వ్యక్తి వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వాలని కార్పొరేటర్ పోలీస్ శాఖ వారికి సూచించారు. సమ్మారెడ్డి, సంపత్ రెడ్డి, రామకష్ణ చారి, నరసింగరావు, కష్ణ గౌడ్, శివ శంకర్, ఖదీర్ ఉన్నారు.

చెరువు సుందరీకరణ పనులను నాణ్యతతో చేపట్టాలి

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

చెరువు సుందరీకరణ , అభివద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్ నగర్ నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ అంబీర్ చెరువు సుందరికరణ పనులలో భాగంగా చేపడుతున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబీర్ చెరువు సుందరీకరణ, సంరక్షణ,అభివద్ధి పనులు తుది దశలో ఉన్నాయన్నారు. గుర్రపు డెక్క తొలగింపు పనులలో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. చెరువు సుందరీకరణ లో భాగంగా చెరువు కట్ట పటిష్ట పరిచేలా పునరుద్ధరణ, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి కాల్వ నిర్మాణం, అలుగు మరమ్మతులు, చెరువు కట్ట బలోపేతం ,పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని పేర్కొన్నారు చెరువు సంరక్షణ లో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం , చెరువు అలుగు నిర్మాణము , చెరువు సుందరికరణ పనులు చేపడుతున్నామన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులకు తెలియచేశారు. ప్రణాళికతో పనులు చేపట్టాలన్నారు. చెరువులను సంరక్షించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం అని అన్నారు. అంబీర్ చెరువును సుందరవనంగా, శోభితవర్ణంగా తీర్చిదిద్దుతామన్నారు. చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి చెరువులను సంరక్షిస్తామన్నారు. చెరువు అపరిశుభ్రం వలన పేరుకుపోయిన గుర్రపు డెక్క వలన దోమల పెరగడంతో స్థానికులు పలుమార్లు ఎమ్మెల్యేకు పిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే. చెరువును దత్తత తీసుకొని సొంత నిధులతో చెరువును శుభ్రపరిచి సుందరీకరణ చేయిస్తున్నారు. ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామన్నారు. తామర పువ్వులను పెంచి కలుషితం కాకుండా చెరువును సుందరీకరిస్తామన్నారు. చెరువులు కలుషితం కాకుండా, కబ్జాలకు గురికాకుండా చెరువులను పూర్తి స్థాయి లోసంరక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు, మహిళ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి అండగా సారా



నవతెలంగాణ-సిటీబ్యూరో

సెవెన్ రేస్ ఫౌండర్ డాక్టర్ సారా పేద విద్యార్థికి అండగా నిలిచారు. కాప్రా ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన మహేశ్వరి అనే పేద విద్యార్థిని ఆర్థికంగా ఆదుకున్నారు. చాలా పేద ఫ్యామిలీ కావడంతో మహేశ్వరిని గీతం జూనియర్ కాలేజీలో జాయిన్ చేశారు.

మురికి కాలువలో పడి వ్యక్తి మృతి



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి ఓ వ్యక్తి మతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితం వెంకట్ గౌడ్ (48) అనే వ్యక్తి తన కూతురి ఇంటికి వెళ్తున్నట్టు ఇంట్లో వారికి చెప్పినట్లు సమాచారం. అయితే మంగళవారం ఉదయం జీడిమెట్ల గ్రామం గాంధీ విగ్రహం వెనుక మురికి కాలువలో పడి మతి చెంది కనిపించినట్టు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చెట్ల కొమ్మల తొలగింపు పనులు పరిశీలన



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వినాయక నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జీహెచ్‌ఎంసీ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలో వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు చర్యలను ఎలక్ట్రికల్, అర్బన్ బయో డైవర్సిటీ అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లా డుతూ గణేష్ ఉత్సవాలు ప్రారంభం నుంచి ముగిసేంత వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలుగకుండా శోభాయాత్ర జరిగే రూట్లలో విగ్రహాల తరలింపులో ఆటంకం లేకుండా అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ దాసు, ఎలక్ట్రికల్ లైన్ మెన్ సురేష్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, నాయకులు కుమార స్వామి, నిరంజన్ గౌడ్, నిఖిల్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



- హెల్పింగ్ హార్ట్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద అనాధ విద్యార్థులకు చేయూతనందించే దిశగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని హెల్పింగ్ హార్ట్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం సి.ఆర్.డబ్ల్యూ. డి.రెయిన్బో టీం,(బందం)హైదరాబాద్,హైరింగ్ మేనేజర్ జోన్న విలియమ్స్, టీం లీడర్ షేక్ అలీంల సహకారంతో,హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట డివిజన్ మఖ్దుం నగర్ లోని 80 అనాధ,పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు,టిఫిన్ బాక్స్ లు, పెన్సిళ్ళు,ఎరేజర్,పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా సి.ఆర్.డబ్ల్యూ.డి సంస్థ సామాజిక సేవ బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని సంస్థ టీం ప్రతినిధి అలీం అన్నారు. హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్ మాట్లాడుతూ నిరాధారణకు గురైన అనాధలకు,పేద విద్యార్థుల కోసం ఇంతటి సహాయ సహకారాలు అందిస్తున్న సంస్థ కు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త మధుబాబు చికిలే, సభ్యులు ఇన్నారెడ్డి, యూసుఫ్ ఖాన్, షఫీ,అన్సారీ,పాషా,తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుల నరసమ్మకు ఘన నివాళి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సంఘ సేవకురాలు కీర్తిశేషులు బొగ్గుల నరసమ్మ (సరోజని)రెండో వర్ధంతి పురస్కరించుకొని మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్ పద్మ ఫోటో స్టూడియో ప్రాంగణంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పలువురు రాజకీయ నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. భర్త బొగ్గుల సత్తయ్య ముదిరాజ్, కుమారుడు బొగ్గుల సురేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, జగద్గిరిగుట్ట వైశ్య సంఘం అధ్యక్షులు, పార్శి ప్రకాష్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరితో కలగొలుపుగా ఉంటూ పలకరించే నరసమ్మ మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకతి ప్రేమికుడు,సామాజికవేత్త కోల రవీందర్ ముదిరాజ్, మనుమడు బొగ్గుల నోమేష్ ముదిరాజ్, కుటుంబ సభ్యులు బొగ్గుల సుగుణవతి, శారద,యాదగిరి ముదిరాజ్, వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తేరాల శ్రీనివాస్ గుప్త, వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయ చైర్మెన్ రేగురి ప్రవీణ్ గుప్తా, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు కూరపాటి కరుణాకర్ రాజు,పాండాల శ్రీనివాస్ గౌడ్,కూరపాటి శ్రీరామరాజు,జనుముల జగన్ ముదిరాజ్, ఎస్.నరేందర్ రాజు,పి. వీరాచారి,ప్రమోద్ బి.చిన్నగౌడ్,రుద్ర అశోక్,ఎర్రం శ్రీనివాస్ గుప్తా,తమ్మయ్య తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

తండ్రి నారాయణరావుకు ఎమ్మెల్యే నివాళులు..



నవతెలంగాణ - కూకట్ పల్లి

ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు తండ్రి కీర్తి శేషులు మాధవరం శివయ్య గారి నారాయణరావు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యేను కలిసిన డిప్యూటీ కమిషనర్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్
జీహెచ్ఎంసీ సర్కిల్ 19 కు డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన జకియా సుల్తానా జూబ్లీహిల్స్ శాసన సభ్యులు బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్‌ను వారి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి బొకే ఇచ్చారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సిటీబ్యూరో
ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీతాఫల్మండి 2024-25 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫాకల్టీ) నియామకానికి ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా. ఎం రామ చంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు (1), హిస్టరీ (1), పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (1), కామర్స్ (1) లలో అతిథి అధ్యా పకుల నియామకం జరుగుతుందన్నారు అర్హతలు పీజీలో 55 శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం), సంబంధిత సబ్జెక్టులలో పీజీతో పాటు NET/SLET/SET/Ph.D అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు తేది 05-07-2024 లోగా దరఖాస్తు చేసుకోగలరని కళాశాల ప్రిన్సిపాల్ డా. రాంచంద్రం తెలియజేశారు. సమాచారం కోసం ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్ర దించగలరన్నారు. 9885197765, 996608164, ఎన్‌జీ కృష్ణమూర్తి వైస్ ప్రిన్సిపాల్.

జీహెచ్ఎంసీ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ
వర్ష కాలం నేపథ్యంలో జీహెచ్ఎంసీ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి సూచించారు. మంగళవారం తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో అధికారులు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే మోతే శోభన్ రెడ్డితో కలిసి డిప్యూటీ మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. తార్నాక డివిజన్ లో జరుగుతున్న పలు అభివద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలనీ, వర్ష సూచనల కారణంగా ఈ సమయంలో రోడ్లపైన ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదని ఆదేశించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఫాగ్గింగ్, స్ప్రేయింగ్ ను మరింత వేగంగా చేపట్టాలని సూచించారు.ఇండ్ల నుంచి సేకరించిన చెత్తను జీవీపీ పాయింట్ వద్ద నుంచి త్వరగా తరలించి, దోమలతో రోగాలు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ తీగలు, వీధి దీపాలు చెట్లను కప్పేయకుండా సాయంత్రం వేళలో వెలుగులు ఉండేలా చూడాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి వారికి సురక్షిత ప్రాంతాలను తరలించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా డివిజన్ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్ని సైతం ఎప్పటికప్పుడు పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ డీఈ వెంకటేష్, ఇంజినీరింగ్ డివిజనల్ ఇంజినీర్ సువర్ణ, ఏఈ వెను, ఎన్టమొలజీ రాజశేఖర్, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థుల డిమాండ్ల సాధనకు కృషి చేస్తాం

- ఎంపీ ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ కాంగ్రెస్ నేత వీహెచ్
- రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర స్థాయి సదస్సు



నవతెలంగాణ-కల్చరల్
బీసీ విద్యార్థుల డిమాండ్ల సాధనకు కృషి చేస్తామని రాజ్య సభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర శాసన మండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి హనుమంత రావులు హామీ ఇచ్చారు రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా కృష్ణయ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు విద్య ముఖ్య మని చదువు వల్ల హక్కులు అవగాహనలోకి వస్తాయని అన్నారు. బీసీ విద్యార్థులకు న్యాయ బద్ధం గా పొందవలసిన సౌకర్యాలు గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని చెప్పారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ బీసీ, ఎస్సీ ఎస్టీ హాస్టల్ లో సౌకర్యాలు సరిగ్గా లేవని పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని అన్నారు. కాంగ్రెస్ నాయకులు హనుమంత రావు మాట్లాడుతూ బీసీ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెడతాను అన్నారు. రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామ కృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఫీజుల బకాయిలు వెంటనే మంజూరు చేయాలని. మెస్ చార్జీలు పెంచాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి బీసీ విద్యార్థికి విదేశీ విద్యా ఉపకార వేతనం మంజూరు చేయాలని తదితర డిమాండ్ల పరిష్కరించాలని కోరారు. వేదిక పై జాతీయ కన్వీనర్ గుజ్జు కృష్ణ, గుజ్జు సత్యం, నీలం వెంకటేష్, మల్లేష్, నంద గోపాల్ పాల్గొన్నారు.

నైతిక విలువలపై యువతకు అవగాహన కల్పిస్తాం

- జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం



నవతెలంగాణ-బంజారాహిల్స్
దేశంలో స్త్రీలు, బాలికలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలకు సమాజంలో నైతిక విలువ లోపించడమే కారణమని జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం ఆవేదన వ్యక్తం చేసింది. నైతిక విలువలను పెంపొందించేందుకు నెలరోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు హింద్ క్యాంపెయిన్ కన్వీనర్ డాక్టర్ అస్రా మోహిస్సిన్ తెలిపారు.మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఖతీజ మెహవీన్, సాజిదా బేగం,ఇస్రాత్ భానులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... నిందితులకు ఎంతటి కఠిన శిక్షలు విధించినా సమాజంలో ఈ తరహా నేరాలు ఆగడం లేదన్నారు. పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో బాల, బాలికలకు నైతిక విలువలను ఆయా కుటుంబ పెద్దలు బోధించే వారని చెప్పారు. దీంతో సమాజం నేర రహితంగా ఉండేదని తెలిపారు. చట్టాలు ఎంత పదునుగా ఉన్నా నేరాలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. దీనంతటికీ కారణం నైతిక విలువల లోపం అని గుర్తించిన తాము బాల బాలికలకు, యువతకు విస్తృత అవగాహన కల్పించేందుకు నడుం బిగించినట్టు చెప్పారు. ఇందులో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాల యాలు, జన సమూహాలు అధికంగా ఉండే చోట అవగాహన చేపడతామని చెప్పారు. యవ్వన దశలో చోటు చేసుకున్న మార్పులతో కొంతమంది యువత పెడదోవ పడుతున్నారని వారిని సమాజ హితం కోసం నడిపించడం మన అందరి బాధ్యత అని తెలిపారు.

ప్రవీణ్ కుమార్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-ఓయూ
వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన బొంపల్లి ప్రవీణ్ కుమార్‌కు ప్రసిద్ధ ఉస్మానియా విశ్వవిద్యాలయం, సోషల్ వర్క్ విభాగం నుంచి డాక్టరేటును ప్రదానం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సి. ధీరజ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ (ఎన్ఐఆర్‌డీ) రాజేంద్రనగర్ పర్యవేక్షణలో "అండర్ స్టాండింగ్ ట్రాన్స్ జెండర్ ఐడెంటిటీ,ఎక్స్లూషన్, అండ్ దేర్ సోషల్ ఐసోలేషన్: ఏ సోషలాజికల్ స్టడీ ఆఫ్ హైదరాబాద్" అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పణకు గాను డాక్టరేట్ అందుకున్నారు. ఈ పరిశోధన పత్ర సమర్పణకు ఆర్థిక సహాయం అందించిన రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్ ఢిల్లీ వారికి, డాక్టర్ సి. ధీరజకు, ఓయూ సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగానికి చెందిన టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అంతర్జాతీయ,జాతీయ స్థాయిలో వివిధ విశ్వవిద్యాలయాలలో 8 వరకు పరిశోధన పత్రాలను సమర్పించగా ప్రచురితం అయ్యాయని తెలిపారు. డాక్టరేట్ సాధించడం పట్ల ప్రొఫెసర్లు, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మట్టిగణపతులను ప్రతిష్టించడం మంచి పరిణామం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- వెంకయ్య నాయుడుకి మొదటి మట్టి గణపతి



నవతెలంగాణ- జూబ్లీహిల్స్
మట్టిగణపతులను ప్రతిష్టించడం చాలా మంచి పరిణామం అని ,భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. మంగళవారం శ్రీ వాసవి యువ జన సేవ సంఘం ఆధార్యం లో మొదటి మట్టి గణప తిని వెంకయ్య నాయుడుకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూసుఫ్ గడ్ డివిజన్ శ్రీకష్ణ నగర్‌లో గత 15 ఏండ్లుగా మట్టి గణపతి ప్రచారం చేయడం, మట్టిగణపతులనే ప్రతిష్టించడం అభినందనీ యమని పేర్కొన్నారు. ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించడం చాలా అవసరం అన్నారు. ఈ కార్యక్రమం లో యువజన సంఘం ప్రతినిధులు పుట్టా రామకష్ణ(సీనియర్ జర్నలిస్ట్), అట్లూరి రామకృష్ణ, ఎ.సూర్య రావు. పుట్టా బుజ్జి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి మహెూత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ- బేగంపేట్
ఈ నెల 7 నుంచి 17వ తేదీ వరకు తమ ఆలయంలో నిర్వహించే శ్రీ వినాయక చవితి మహెూత్సవాలకు హాజరు కావాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సికింద్రాబాద్ లోని శ్రీ గణేష్ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిసి ఆహ్వానాన్ని, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఆహ్వానాన్ని అందజేసిన వారిలో చైర్మెన్ సత్యనారాయణ, హన్మంతరావు, వినోద్ కుమార్, జయరాజ్, ఆలయ సూపరింటెండెంట్ నారాయణ మూర్తి తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రులపై దాడిని ఖండిస్తున్నాం

- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు



నవతెలంగాణ-ఓయూ
వర్షం కారణంగా ముంపునకు గురైన గ్రామాలను పర్యవేక్షించడానికి బయలుదేరిన మాజీ మంత్రులు హరీశ్ రావు, పువ్వాడ అజయ్,సబితా ఇంద్రారెడ్డి, జగదీష్ రెడ్డిల వాహనాలపై కాంగ్రెస్ నాయకుల దాడిని ఖండిస్తున్నట్టు బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగబాలు తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ముందు చూపు లేని కారణంగా ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో చోటుచేసుకున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సరైన వసతులు కల్పించకుండా వరద బాధితుల మతికికారణమైందన్నారు.ముంపునకు గురై చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం నుండి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎమర్జెన్సీ సినిమాను నిషేధించండి



- ప్రొ.గాలి. వినోద్ కుమార్

నవతెలంగాణ-ఓయూ
సిక్కులను దేశ ద్రోహులుగా చిత్రికరిస్తూ తీసిన ఎమర్జెన్సీ సినిమాను నిషేధించాలని సౌత్ ఇండియా జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గురుద్వారా వద్ద మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో రెండు శాతం ఉన్న సిక్కులు 80 శాతం దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించారాని తెలిపారు. ఈ దేశ భూమిపుత్రులను దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ తీసిన ఎమర్జెన్సీ సినిమాను వెంటనే నిషేధించి కంగనా రనౌత్ ఎంపీ పదవిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

'క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ అభివృద్ధికి సహకరించండి'



నవతెలంగాణ - జూబ్లీహిల్స్
క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ అభివృద్ధి చేస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరమ్ మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ కార్యక్రమంలో జే. సి. ఆఫ్ ప్రెసిడెంట్ బిషప్ డా. కే. విద్య సాగర్, జనరల్ సెక్రటరీ రెవ. ఎస్. యేసు రాజు, ఎన్. విజయ్ కుమార్, ఎం. రాకేష్, క్రిస్టోఫర్ ఆనంద్, డేవిడ్, విలియం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితునికి యువ నేత రామేశ్వర్ గౌడ్ ఆసరా



నవతెలంగాణ-ఓయూ
తార్నాకలోని నాగార్జున నగర్ కాలనీలోని ఓ అపార్ట్మెంట్‌లో ఆకుల విష్ణు వాచ్ మ్యాన్‌గా పని చేస్తున్నాడు. చిన్న రేకుల ఇంట్లో ఆయన కుటుంబం నివసిస్తోంది. ఇటీవలే కురిసిన వర్షాలకు రేకుల ఇల్లు పాక్షికంగా ధ్వంసం కావడంతో తనను ఆదుకోవాలని విష్ణు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ తో పాటు సికింద్రా బాద్ శాసనసభ్యులు పద్మారావు గౌడ్‌ను కోరారు. వెంటనే స్పందించిన బీఆర్ఎస్ సికింద్రాబాద్ నియోజకవర్గ యువ నేత తీగుళ్ళ రామేశ్వర గౌడ్ మంగళవారం విష్ణు నివాసాన్ని సందర్శించారు. విష్ణు కుటుంబాన్ని ఆదుకుంటామని, వారి బాగోగులను చూసుకుంటామని రామేశ్వర గౌడ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తన వంతు వ్యక్తిగత ఆర్థిక సహకారం కూడా అందించారు. రామేశ్వర గౌడ్‌కు విష్ణు కుటుంబసభ్యులు కతజ్ఞతలు తెలిపారు.

ఎల్ఓసీ అందజేసిన రామేశ్వర్ గౌడ్
వారాసిగుడా ప్రాంతానికి చెందిన అంజూమ్ సదా అనే మహిళా తీవ్ర అనారోగ్యానికి గురికాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించి రూ. 3 లక్షల ఎల్.ఓ.సి పత్రాన్ని చికిత్స కోసం సమకూర్చారు. మంగళవారం సీతాఫలమండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసీ పత్రాన్ని రోగి కుటుంబసభ్యులకు బీఆర్ఎస్ యువ నేత తీగుళ్ళ రామేశ్వర గౌడ్, సమన్వయకర్త రాజా సుందర్‌లు అందజేశారు.





నిరంతర అధ్యయనం విజయానికి సోపానం

- ప్రముఖులు

నవతెలంగాణ-కల్చరల్
నిరంతర అధ్యయనం విషయ పరిజ్ఞానం విజయానికి సోపానం అని ప్రముఖులు పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై గ్రూప్ 1, 2 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన సదస్సు 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మెన్ కృష్ణ ప్రదీప్ నిర్వహణలో రెండు రోజుల పాటు జరిగింది. ముగింపు రోజు మంగళ వారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ చైర్మెన్ గంట చక్ర పాణి హాజరై మాట్లాడుతూ పరీక్ష కు ప్రిపేర్ అయ్యే విధానం రాసే పద్ధతి తెలిపేరు. సిలబస్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ ప్రొఫెసర్ చింతా గణేష్ గ్రూప్ 1, 2 పరీక్షలు సిలబస్ గురించి చెప్పారు

ఆంధ్ర జ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమంలో మీడియా పాత్ర అంశంపై మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కళా ప్రక్రియాలు ఆంధ్ర ప్రాంత పత్రికలు క్రియాశీలక పాత్ర పోషించాయని తెలిపారు. నైజాం పాలనలో తెలుగు పత్రికలు లేవని ఉర్దూ పత్రిక చేతిలో ఉండటం గొప్ప గా భా వించే వారని తెలిపారు తెలుగు వారిలో భాషా స్పృహ పెరిగిన తరువాత శ్రీ కృష్ణ భాషా నిలయం గ్రంథాలయం ఏర్పడిందన్నారు గ్రంథాలయం లోనే సమావేశాలు జరిగేవని చెప్పారు. ఆంధ్ర ప్రాంతం లో తొలి దిన పత్రిక ఆంధ్ర పత్రిక కాగా తెలంగాణ అస్తిత్వ వాదం తో గోల్కొండ పత్రిక ఆవిర్భవించడం జరిగిందని తెలిపారు. తొలి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నిధులు, నియామకాలు అంశం కాగా అప్పటి పత్రికలు పాత్ర అంతగా లేదని తెలిపారు. మలి ఉద్యమంలో ఆంధ్ర ప్రాంతంలో బలమైన వ్యతిరేక గొంతులు లేనందున ఆంధ్ర ప్రాంత వాసులు నిర్వహించే పత్రికలు కూడా తెలంగాణ ఉద్యమానికి ప్రాధాన్యత ఇచ్చాయని నిధులు నియామకాలతో పాటు వ్యవసాయ ఆధారిత నీళ్ళు అంశం కూడా చేరిందని తెలిపారు. సామాజిక మాధ్యమాల విశ్రుతి పత్రికలు కళా ప్రక్రియలు విద్యార్థులను గ్రామ ప్రాంతాల ప్రజలను 2009 నుంచి తెలంగాణ సాధన వరకు ఉద్యమ బాట నడిపించాయని వివ రించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ అపజయం వస్తే నిరాశ చెందక విజయానికి మెట్లుగా భావించి నిరంతర ప్రయత్నం తో లక్ష్యం సాధించవచ్చని తెలిపారు

కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



నవతెలంగాణ-బంజారాహిల్స్
కాలుష్యరహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కాలుష్య నియంత్రణ మండలి, సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.నాగేశ్వరరావు మట్టి గణపతి ప్రాముఖ్యతను వివరించారు. ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వ) వృక్ష శాస్త్ర విభాగం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో మట్టి గణపతి వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఈ అంశంపై క్విజ్ ప్రోగ్రాం ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు.

కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ బి రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగ సందర్భంగా చెరువు మట్టితోనే గణపతిని చేయాలని మట్టి గణపతి మహాగణపతి అని అన్నారు. మట్టి గణపతిని వినియోగించి పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని సూచించారు. బోటనీ డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... అడవులు గాలి నీరు నేల, చెరువులు జీవవైవిధ్యం పర్యావరణ పరిరక్షణతో భవిష్యత్తు తరాలకు వాతావరణ మార్పుల నివారణకు సహకరించాలని కోరారు. ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగులు వంటివి వినియోగించాలని సూచించారు.

ఈ సందర్భంగా విభూతి బ్రదర్స్ కల్చర్ సొసైటీ ప్రెసిడెంట్ వి. ప్రశాంత్,బృందం వారు కళా ప్రదర్శన ప్రదర్శించారు. విద్యార్థులు ఈ ప్రదర్శనను ఆసక్తికరంగా తిలకించారు.ఇదే కార్యక్రమంలో మట్టి గణపతిని పూజించాలానే తెలిపే గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో, డాక్టర్ కృష్ణమోహన్ (అసోసియేట్ ప్రొఫెసర్), డాక్టర్ ఎన్ హరికృష్ణ (ఐక్యూఏసీ), డాక్టర్ జి శ్రీను (ఎన్ఎస్ఎస్), డాక్టర్ వి ప్రభాకర్,(హెచ్ఓడీ కామర్స్) తదితర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-బంజారాహిల్స్
ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి , పి.జె.ఆర్ ఫౌండేషన్ చైర్ పర్సన్ పి విజయ రెడ్డి, ఆధ్వర్యంలో మంగళవారం ఖైరతాబాద్ వెజిటేబుల్ మార్కెట్ లో గల నిశుల్క్ ప్రభాత్ హై స్కూల్, గవర్నమెంట్ ప్రాక్టీసింగ్ హై స్కూల్ (వాసవి సేవా కేంద్రం) లలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కరాటే రమేష్,ప్రవీణ్ యాదవ్, కిషోర్ కుమార్,సచ్ దేవ్(నాని), కరామత్ కార్యక్రమంలో నిశుల్క్ ప్రభాత్ హై స్కూల్ ప్రిన్సిపల్ కరుణాకర్ రెడ్డి,గవర్నమెంట్ ప్రాక్టీసింగ్ హై స్కూల్ ప్రిన్సిపల్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
బుధవారం | సెప్టెంబర్ 04, 2024 | www.navatelangana.com

భారీ వర్షాలపై ప్రభుత్వం అప్రమత్తంగానే ఉంది

- 5 వేల క్యూసెక్కుల నీళ్లు వస్తే.. హిమాయత్ సాగర్ ఓవర్ ఫ్లో అయ్యే అవకాశం
- ఈ విపత్కర సమయంలో రాజకీయాలు చేయడం సరికాదు
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- హిమాయత్ సాగర్ జలాశయాన్ని పరిశీలించిన మంత్రి





నవతెలంగాణ-సిటీబ్యూరో

వాతావరణ శాఖ ఉత్తర తెలంగాణకు రెడ్ అలర్ట్ ప్రకటించినందున భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భారీ వర్షాలపై ప్రభుత్వం కూడా అప్రమత్తంగానే ఉందని చెప్పారు. మంగళవారం మంత్రి హిమాయత్ సాగర్ జలాశయాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, శశాంకలతో కలిసి పరిశీలించారు. ఒక్క వర్షం వచ్చిన హిమాయత్‌సాగర్ జలాశయం పూర్తిగా నిండి పోతుందని, జలయశయం నిండితే కింద ఉన్న ప్రాంతాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లకు మంత్రి ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఒక వర్షం పడితే పూర్తిగా 5 వేల క్యూసెక్కుల నీళ్లు వస్తే.. 10 గంటల్లో జలాశయం నిండి ఓవర్ ఫ్లో కానుందని.. ప్రభుత్వం తరుపున అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తుందన్నారు. ప్రతిపక్షాలను కోరుతున్నా.. ఈ విపత్కర సమయం.. ఇది రాజకీయాలకు సమయం కాదన్నారు. రాజకీయాలు అసెంబ్లీ వేదికనో.. ఎన్నికలు వచ్చినప్పుడు చూసుకుందామని తెలిపారు. ప్రజలు కష్టాల్లో ఉన్నారని, ఒకరు అమెరికాలో ఉండి.. మరొకరు ఫాంహౌస్‌లో ఉండి ట్విటర్ వేదికగా విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రస్తుత మరణాలన్ని ప్రమాదవశాత్తు జరిగాయన్నారు. ఎక్కడా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగినవి కావన్నారు. చనిపోయిన కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నామన్నారు. భారీ వర్షాల వల్ల ఇబ్బందులు కలగకుండా అందరినీ అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం హెడ్ క్వార్టర్స్ వదిలిపెట్టకుండా నిరంతరం 24 గంటలు పని చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలో పర్యటిస్తున్నారన్నారు. భారీ వర్షాల వల్ల లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని.. ప్రాథమిక అంచనా మేరకు రూ.5 వేల కోట్లపైన ఉంటుందని తెలిపారు. జాతీయ విపత్తుగా తీసుకొని.. తక్షణమే రూ.2వేల కోట్లు ఆర్థిక సహకారం చేయాలని కేంద్రానికి కోరుతున్నామన్నారు. ఆస్తి, పంట, ఆర్థిక నష్టంతో పాటు రోడ్లు భారీగా దెబ్బతిని నష్టం జరిగిందన్నారు. గతంలో ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు వస్తే.. హైదరాబాద్ ప్రజలకు పరిహారం ఇయ్యని పరిస్థితి ఉండేదని, కరీంనగర్ జిల్లా కొండగట్టులో 69 మంది చనిపోతే కనీసం ఒక్కరు వచ్చి పరమర్శించని పరిస్థితి ఉండేనని గుర్తుచేశారు. తమను అడిగే ముందు.. వారి ప్రభుత్వ పరిపాలనను చూసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అవసరమైతే తప్ప బయటకు రావద్దని మంత్రి ప్రజలను కోరారు. 33 జిల్లాల కలెక్టర్లు గ్రామ కార్యదర్శి నుంచి మొదలు సీఎస్ వరకు 24/7 పని చేస్తున్నారని తెలిపారు. ఎక్కడైనా ఆపద ఉండి విపత్తు కలిగితే కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. బడ్జెట్‌లో మొండిచేయి చూపినట్టుగా కాకుండా కేంద్రం సహకరించాలన్నారు. ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, ప్రజలు ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ మేయర్ లతా ప్రేమ్ గౌడ్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు కుత్బుల్లా పూర్, గాజుల రామారం జంటసర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాలలో చెట్లు ప్రమాదభరితంగా మారాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఏపీహెచ్‌బీ కాలనీలో పలు వీధులలో ప్రమాదభరితంగా విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మలను మంగళవారం కాలనీ స్థానిక సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏర్వ సాయికిరణ్, కమిటీ సభ్యులతో పాటు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఏర్వ శంకర య్యలు సంబంధిత సిబ్బందితో దగ్గరుండి తొలగించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సాయి బాబా, శ్రీనుభాష, జగన్మోహన్, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్
- అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాలి
- పేట్ బషీరాబాగ్ సీఐ
- గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం



నవతెలంగాణ-శామీర్‌పేట

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తుంకుంట మున్సిపాలిటీ దేవరయంజాల్‌లో మంగళవారం పేట్ బషీరాబాగ్ సిఐ గణేష్ శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పేట్ బషీరాబాద్ సీఐ మాట్లాడుతూ అందరి సహకారంతో వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, ఆలయ కమిటి మాజీ చైర్మన్ పన్నాల వీరారెడ్డి, కౌన్సిలర్ నర్సింగ్ రావు గౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు రాజు గౌడ్, సాయి గౌడ్, ఎస్ఐ, పోలీసు సిబ్బంది, యువజన సంఘాలు పాల్గొన్నారు

నేటి సినిమాలలో హీరోలు ఏం సందేశం ఇస్తున్నారు?



● హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధా రాణి

నవతెలంగాణ-కల్చరల్

నాటి సినిమాలలో అక్కినేని వంటి నటులు కథా నాయకులుగా ఉదాత్త పాత్రలులో నటించి సమాజానికి మంచి సందేశం ఇచ్చే వారని మరి నేడు స్మగ్లింగ్ విలనిజం వున్న హీరోలు సినిమాలు వస్తున్నాయని హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధా రాణి అన్నారు. అక్కినేని నటించిన ప్రేమాభిషేకం సినిమా 550 రోజులు ఆడటానికి కారణం అక్కినేని పాత్రలో వున్న వ్యక్తిత్వం అని చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ రాగ సప్త స్వరం నిర్వహణలో విఖ్యాత నటులు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సాంస్కృతిక సంస్థల అధిపతులు, పత్రికా రంగం విలేఖరులు ప్రభ, సంతోషం సురేష్, అంజి బాబు, హేమ లత, ఆర్.వీ.రమణ, రమేష్ బాబు, బాల కృష్ణలకు ఆత్మీయ సత్కారం ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రాధా రాణి చేసి మాట్లాడారు. అక్కినేని దేవుడిని నమ్మరు అనీ మనిషి నీ మంచిని నమ్ముతారని తనూ నాస్తికురాలునేనని చెప్పారు. క్రమశిక్షణ లక్ష్యం వుంటే ఎంచుకున్న రంగం లో ఎవరెస్ట్‌కు ఎదుగవచ్చునీ అయన నిరూపించారన్నారు. అధ్యక్షత వహించిన తిరుమల గ్రూప్ అధినేత నంగనూరి చంద్ర శేఖర్ మాట్లాడుతూ చెప్పింది ఆచరించటం అక్కినేని లక్షణం అన్నారు. తక్కువ లాభం వుంటే ఎక్కువ టర్న్ ఔట్ వుంటుంది అన్న వ్యాపార సూత్రం అయన నుంచి నేర్చుకున్నాను అని చెప్పారు. తెలుగు దేశం నాయకురాలు నన్నపనేని రాజకుమారి సభ ప్రారంభం చేసి మాట్లాడుతూ అక్కినేని సంఘీకాలు ఎన్‌టీఆర్ పౌరాణికాలు సినిమాలు వారిని మించిన వారు లేరని తెలిపారు. సంస్థ నిర్వాహకులు రాజ్య లక్ష్మి స్వాగతం పలుకుతూ అక్కినేని తమ సంస్థ నిర్వహించిన కార్యక్రమమే చివరిది అని తెలిపారు. వంశీ రామరాజు శ్రీ మణి తదితరులు పాల్గొన్న సభకు అహల్య వందన సమర్పణ చేశారు. తొలుత అక్కినేని సినిమాలలో నీ పాటలు ఆమని, బాల కామేశ్వర రావు రామ కృష్ణ తదితరులు మధురంగా గానం చేశారు.

బీఆర్ఎస్ నాయకులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన జనజీవనం అస్తవ్యస్తమై తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు బృందంపై దాడిని తీవ్రంగా ఖండి స్తున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు పత్రికా ప్రకటన ద్వారా ఖండించారు. హరీష్ రావు దాడులకు ఎప్పుడు భయ పడరని తుమ్మల మనుషులు గుండాల రాళ్ల దాడి చేయడం వెనుక సీఎం బాధ్యత వహించాలని ప్రజలకు వరద బాధి తులకు సహాయం చేయడం చేతకాక తక్షణ సహాయం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపైన దుర్బుదితో భౌతికదాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. అది పోలీస్‌ల సమక్షంలో దాడులకు పాల్పడడం పక్కా ముందస్తు ప్రణాళికగానే పరిగణించుకోవాలని గుండాల పైన పోలీస్‌లు నాన్‌బెయిలబుల్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలి

- జలమండలి ఈడీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

వచ్చిన ఫిర్యాదులను సాధ్యమైంత త్వరలో పరిష్కరించాలని జలమండలి ఎక్సక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ అధికారులను ఆదే శించారు. మంగళవారం డివిజన్ 3 పరిధిలోని విజయనగర్ కాలనీ సెక్షన్ ఆఫీస్‌ను సందర్శిం చారు. సెక్షన్ ఆఫీస్‌లో రికార్డులను పరిశీలిం చిన ఈడీ మాట్లాడుతూ.. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కలుషిత నీరు సరఫరా కాకుండా అన్ని చర్యలూ చేపట్టాలని, రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ వినోద్ భార్గవ, జీఎమ్ సుబ్రహ్మణ్యం డీజీఎం, మేనేజర్లు పాల్గొన్నారు.

కలుషిత నీటికి చెక్

- నీటి నాణ్యత పరీక్షలు రెట్టింపు
- వర్షాల నేపథ్యంలో తాగునీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి
- మూడంచెల్లో తాగునీటి క్లోరినేషన్ ప్రక్రియ





నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యం లో జలమండలి అధికారులు మరింత అలర్ట్ అయ్యారు. నీటి నాణ్యత పరీక్షలు రెంట్టింపు చేశారు. మూడంచె ల్లో తాగునీటి క్లోరినేషన్ ప్రక్రియను ప్రారంభించారు.

మూడంచెల క్లోరినేషన్

జలమండలి సరఫరా చేస్తున్న తాగునీటిలో తగిన మోతాదు లో క్లోరీన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకోసం మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియను అవలంభిస్తున్నారు. మొదటి విడతగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల(డబ్ల్యూటీపీ) వద్ద క్లోరినేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. రెండో దశలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల(ఎంబీఆర్) వద్ద క్లోరినేషన్ చేయనున్నారు. చివరగా సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ చేయిస్తారు. ప్రజలకు సరఫరా అవుతున్న నీటిలో కచ్చితంగా 0.5 పీపీఎం క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నగర ప్రజలకు శుద్ధమైన నీరు అందించేందుకు ఐఎస్ఓ 10500 - 2012 ప్రకారం అన్ని జాగ్రత్తలను జలమండలి తీసుకుంటుంది.

బస్తీల్లో క్లోరిన్ బిల్లలు పంపిణీ

నగరంలోని బస్తీలు, వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నీటి సరఫరాపై జలమండలి మరింత జాగ్రత్తగా వ్యవ హరిస్తోంది. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకుగానూ ప్రజలు ఇళ్లలో నిల్వ చేసుకున్న నీటి నాణ్యతపై కూడా దష్టి పెట్టారు. నిల్వ చేసిన నీటిని శుద్ధి చేసుకోవడం కోసం ప్రజలకు క్లోరిన్ బిల్లలను పంపిణీ చేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలు, బస్తీలు, లోతట్టు ప్రాంతాల్లో ఇప్పటివరకు జలమండలి 8.80 లక్షల క్లోరిన్ బిల్లలను పంపిణీ చేశారు. క్లోరిన్ బిల్లలను ఉపయోగించి నీటిని ఎలా శుద్ధి చేసుకోవాలనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

సమన్వయం కోసం ప్రత్యేక కమిటీ

వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు నగరంతో పాటు ఓఆర్ఆర్ పరిధిలోని వాటర్ లాగింగ్ పాయింట్లు, ఓవర్ ఫ్లో, కలుషిత నీరు తదితర అంశాలను పర్య వేక్షించడానికి ఎండీ అశోక్ రెడ్డి ఉన్నత స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ లో సర్కిల్ 4, రెవిన్యూ డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్, సర్కిల్ 1, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, సర్కిల్ 5 ఆపరేషన్ డైరెక్టర్ 2 స్వామి, సర్కిల్ 4 ఆపరేషన్ డైరెక్టర్-1 విజయ రావు, సర్కిల్ 3,6(ఓఆర్ఆర్ పరిధి) పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారు. అంతేకాకుండా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, విద్యు త్, శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పనిచేస్తారు.

రెండో రోజూ బస్తీల్లో పర్యటించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

నీటి సరఫరాలో మురుగునీరు కలువకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. రెండోరోజు మంగళవారం ఆయన హఫీస్ పేట్‌లోని సాయినగర్, యూత్ కాలనీ, మజీద్ బండ, ఇజ్జత్ నగర్ ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శించారు. రెట్టింపు సంఖ్యలో శాంపిళ్లు సేకరించి పరీక్షించిన తర్వాత సరఫరా చేయాలన్నారు. క్లోరిన్ సైతం తగిన మోతాదులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో క్లోరిన్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మంచి నీటి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మరోవైపు రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మ్యాన్ హెూళ్లు ఉప్పొంగితే వెంటనే పూడిక తీయాలని వివరించారు. వాటి నుంచి తీసిన వ్యర్థాల్ని (సిల్ట్) వెంటనే అక్కడ్నుంచి తొలగించాల ని ఆదేశించారు. ఎక్కువ లోతు ఉన్న మ్యాన్ హెూళ్లపై మూతలు, సేఫ్టీ గ్రిల్స్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని, జలమండలి, జీహెచ్ఎంసీ వాటర్ లాగింగ్ పాయింట్లను నిత్యం పర్యవేక్షించాలని, డ్రైనేజీ పనులకు సంబంధించిన వ్యర్థాలను తక్షణం తొలగించాలని , అలాగే మంచి నీటి పైపు నాలా క్రాసింగ్ వద్ద చెత్త చేరకుండా జీఎంలు జాగ్రత్త వహించాలని సూచించారు. పనులు చేస్తున్నప్పుడు కచ్చితంగా సేఫ్టీ ప్రోటోకాల్ పాటించాలని, బారీకేడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ పర్యటనలో ఎండీతోపాటు డైరెక్టర్ ఆపరేషన్స్ విజయరావు, జీఎం బ్రిజేష్, డీజీఎంలు, మేనేజర్లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో కస్టమర్ కేర్

నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హెూల్స్ మూతలను తెరవకూడదని ఏండీ అశోక్‌రెడ్డి సూచించారు. ఎక్కడై నా మ్యాన్‌హెూల్స్ మూత ధ్వంసం అయినా, తెరిచి ఉంచినట్లు తెలిస్తే జలమండలి కస్టమర్ కేర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాల న్నారు. అలాగే కలుషిత నీరు, ఇతర సమస్యలకు జలమండలి కస్టమేర్ కేర్ 155313కి ఫిర్యాదు చేయాలని కోరారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి





- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం కింగ్ కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి ఆస్పత్రి లోని ప్రతి వార్డును సందర్శించారు. ఓపి, జ్వరంతో ఆస్పత్రిలో చేరిన రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి, పీడియాట్రిక్, ఆంటనెంటల్ వ్యాయామశాల తదితర వార్డులను సందర్శిం చారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న ఆహారం, మందు లు, డాక్టర్ల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ప్రతిరోజు నమోదు అవుతున్న అవుట్ పేషెంట్ల లిస్టు, అందిస్తున్న సేవలు, అందుబాటులో ఉన్న వైద్యుల వివరాలను మంత్రికి వివరిం చారు. ఆస్పత్రి సేవలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అన్నారు. సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యం లో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలనీ ఆదేశిం చారు. విద్య, వైద్యం రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి అందాలన్నారు. రానున్న రోజుల్లో 85 నుంచి 90శాతం రానున్న రోజులు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే అవసరం లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులను పటిష్ట చేస్తామన్నారు. రూరల్, సెమీ రూరల్, అర్బన్ ఆస్పత్రులపై ప్రభుత్వం సంపూర్ణ అవగా హనతో ఉందని చెప్పారు. పేదలు పట్టణానికి కేవలం సూపర్ స్పెషాలిటీ ట్రీట్మెంట్ కోసమే రావాలన్నారు. గాంధీ ఆస్పత్రిలో వైద్య విద్యార్థుల కోసం సుమారు రూ. 70 కోట్ల అంచనతో హాస్టల్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఐవీఎఫ్ సెంటర్స్ సమస్య రాష్ట్రంలో గత ఆరేండ్లుగా ఉందని అన్నారు. రానున్న ఏడు నుంచి పది రోజుల్లో ఐవీఎఫ్ కేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపారు. ఆస్పత్రిలో ఆధు నాతన ఆపరేషన్ థియేటర్ల కోసం శంకుస్థాపన చేస్తామని చెప్పారు. ఆస్పత్రి ఆవరణలోని ఆయుష్ ఆయుర్వేద ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టియాన, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, డీఎంఈ డాక్టర్ వాణి, జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్.ఎం.ఓ డాక్టర్ సాధన పీడియాట్రిప్ వైద్య నిపుణులు, డాక్టర్ సంతోష్ బాబు,ఆయుర్వేద వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ రావు, డా. రామదాస్, తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన స్వేచ్ఛ విశృంఖలత్వానికి దారితీస్తుంది!



నవతెలంగాణ-ధూల్‌పేట్

మితిమీరిన స్వేచ్ఛ విశృంఖలత్వానికి దారితీస్తుందని జమాఅతె ఇస్లామీ హింద్ ఉమెన్స్ వింగ్ సెక్రటరీ ఖతీజా మెహ్విన్ అన్నారు. ఛత్తాబజార్ లోని జమాఅతె ఇస్లామీహింద్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం క్యాంపెయిన్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇష్టా నుసారంగా వ్యవహరించడం ప్రమాదకరమన్నారు. నైతిక జీవితాన్ని గడప డం చాలా అవసరం అనే అవగాహనను ప్రోత్సహించేందుకు 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' ప్రచార ఉద్యమానికి శ్రీకారం చుట్టామని క్యాంపెయిన్ కన్వీనర్ డాక్టర్ అస్రా ముహ్సినా అన్నారు. ఈ సమావేశంలో జెఐహెచ్ సెక్రటరీలు సాజిదాబేగం, ఇష్రత్ బానోలు పాల్గొన్నారు.

వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

- అవినాష్ కాలేజీలో నేను సైతం కార్యక్రమం..
- ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వ్యాపార సముదాయాలో రక్షణ, భద్రతను పూర్తిస్థాయిలో అందిపుచ్చుకోవచ్చని ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి అన్నారు. మంగళవారం సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బడి చౌడిలోని అవినాష్ కాలేజీలో నేను సైతం కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, కళాశాల ఓఎస్‌డి కపిల్, ప్రిన్సిపల్ జ్యోతి ద్వేవేది, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క సీసీ టీవీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా రక్షణ, భద్రతతో పాటు తమ పరిస రాలలో ఎటువంటి సంఘటనలు జరిగిన వాటిని కెమెరా లలో చూసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. దీనితోపాటు ఎటువంటి నేరాలు జరిగిన పోలీసులకు త్వరగా గుర్తించి నేరాలను అరికట్టేందుకు దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమ ంలో సుల్తాన్ బజార్ ఎస్ఐలు మధుసూదన్, నరేష్, శ్వేత, పోలీస్ సిబ్బంది కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ చెరువును ఆక్రమణల నుంచి రక్షించండి

- హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన రమణి మాల్యాల

నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ పరిధిలోని బాచుపల్లి పత్తి కొండ చెరువును ఆక్రమణల నుంచి కాపాడాలని కాంగ్రెస్ నాయకురాలు రమణి మాల్యాల హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్‌ను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10ఎకరాల్లో విస్తరించి ఉన్న చెరువులో నాలుగు ఎకరాలు ఆక్రమణకు గతంలోనే గురైందని, ఎస్సార్ కాలేజ్ శ్రీరామ్ స్కూల్ భవనాలు, సప్తపది ఫంక్షన్ హాల్ ఎఫ్‌టిఎల్‌లోనే నిర్మించారని, 2021 లోనే పలు ఫిర్యాదులు చేయడంతో అప్పటి రెవెన్యూ అధికా రులు సీజ్ చేసి నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ స్థానిక ప్రజాప్రతినిధులకు మున్సిపల్ రెవెన్యూ అధికారులు సహకరించి తిరిగి సీల్ తొలగించి వాడుకుంటున్నారని తెలి పారు. అయితే నిజాంపేట్ మున్సిపల్ అధికారులు ఇటీవల భవనాల్లోకి వర్షపు నీరు వస్తుందని ఆ భవనాలు సీజ్ చేయ డం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, హైడ్రా, రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు పత్తికొండ చెరువు ఎఫ్టీఎల్ లో అక్రమ నిర్మాణాలు తొలగించి చెరువును కాపాడాలని రమణి మాల్యాల ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

- పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలిగా జి.అనసూయ



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ఇటీవల జరిగిన మహాసభల్లో సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ మేరకు మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో నూతన కమిటీ నాయకుల సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులుగా జి.అనసూయ (హైదరాబాద్), ప్రధానకార్యదర్శి అందే మంగళప్రద (మంచిర్యాల) ఉపాధ్యక్షులు ఎం.జ్యోతి, సరిత, జ్యోతి కార్యదర్శులు సీత, హరిత, వై.గీత కోశాధికారి జానకి, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఝాన్సీ, తిరుపతమ్మ, ఉపేంద్ర, రజిత, కావేరి, అరుణ, హారతి, లక్ష్మీకోటమ్మ, సుభద్ర, కవిత, అరుణ, నర్సమ్మ, కళావతి, బుచ్చమ్మ, పుష్పతో పాటు 25 మందితో ఎన్నికయింది. నూతన కార్యవర్గం పీఓడబ్ల్యూ ఆశయాలకు లక్ష్యాలకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. ఈ మహాసభలో పలు తీర్మా నాలను చేయటం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు జీ.అనసూయ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగళప్రద మాట్లాడు తూ.. మహిళలపై హింసకు కారణమవుతున్న మద్యం, మాదకద్రవ్యాలు, అశ్లీల సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలని, జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ చట్టం చేసి అమలు చేయాలని, మహిళలకు సంబంధించిన చట్టాలు గృహ హింస చట్టం, పనిస్థలాలలో లైంగిక వేధింపుల వ్యతిరేక చట్టం, 498ఏ స్త్రీల ఆస్తిహక్కు వంటి చట్టాలను బలోపేతం చేసి పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. వేగంగా ముందుకు వస్తున్న ఫాసిస్ట్ విధానాలకు, మనువాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలకు కృషి చేస్తా

మీడియా అకాడమీ చైర్మెన్ కే. శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇచ్చే విధంగా కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కే. శ్రీనివాస రెడ్డి అన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యపై ఇప్పటికే పలు మార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, త్వరలో కొత్త పాలసీ రూపకల్పన ద్వారా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తో పాటు పలువురు ప్రతినిధులు మంగళవారం మీడియా అకాడమీ చైర్మెన్ కే. శ్రీనివాస్ రెడ్డిని కలిసి జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య, తమ సొసైటీ విషయాల పై చర్చించారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. తమ సొసైటీ 2008లో ఏర్పడిందని, అప్పటి నుంచి మూడు దఫాలుగా జర్నలిస్టుల నుంచి సభ్యత్వం తీసుకోవడం జరిగిందని, ప్రస్తుతం సొసైటీలో 1300 మంది సభ్యులున్నారని అధ్యక్షుడు మామిడి సోమయ్య వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వివిధ పత్రికలు, ఛానళ్లలో పని చేస్తున్న సీనియర్ జర్నలిస్టులు చాలా ఏండ్లుగా ఇండ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉందని, అయతే ఏ విధంగా ఇవ్వాలన్న విషయంలో కసరత్తు చేయాల్సి ఉన్నందున దీనికి కొంత సమయం పడుతుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ఉన్న 1300 మంది జర్నలిస్టుల అర్హత, సీనియారిటీ ప్రకారం లిస్టు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు యర్రమిల్లి రామారావు, కరుణాకర్, అంజిరెడ్డి, నాగవాణి, టి. శాంతి తదితరులు పాల్గొన్నారు.

దేశ సేవలో సీఆర్‌పీఎఫ్ సేవలు అమోఘం



నవతెలంగాణ-ధూల్‌పేట్

దేశ రక్షణ సేవలో సీఆర్‌పీఎఫ్ దళం సేవలు అమోఘమని 2సిగ్నల్ కమాండెంట్ 'ఓం హరీ' అన్నారు. సీఆర్‌పీఎఫ్ 2సిగ్నల్ 56 వ్యవస్థాపక దినోత్సవం సంద ర్భంగా మంగళవారం హైదరాబాద్ పాతబస్తీ చాంద్రాయణగుట్ట సెగ్మంట్ బార్కాస్ సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పారామిలట్రీ దళలలో సెంట్రల్ రిజ్వర్ పోలీస్ ఫోర్స్ ప్రత్యేక స్థానమన్నారు. దేశ రాష్ట్ర సరిహద్దు పరిరక్షణ, ముష్కరుల ఏరివేత, వీటితో పాటు కుబింగ్ సమయంలో సమాచారం వ్యవస్థ చేరవేర్చ డంలో సిగ్నల్ విభాగం కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రతి ఏటా వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. మన దేశంలో ఏటా నాలుగు కోట్ల యూనిట్ల రక్తం అవసరం కాగా కేవలం 4లక్షల యూనిట్లు మాత్రమే లభ్యమవుతోంద న్నారు. నగరంలో కూడా కొన్ని లక్షల యూనిట్ల రక్తం అవసరం కాగా వేల యూనిట్ల మాత్రమే లభ్యమవుతుంద న్నారు. ప్రతి రెండున్నర సెకన్లకు ఒకరికి రక్తం అవసరం అవుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక తెలుపుతోం దన్నారు. రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేం దుకు, చైతన్యం కల్పించేందుకు ప్రభుత్వాలు, ఆస్పత్రులు సంస్థలు, శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ఒక ఆరోగ్యవంతుడైన వ్యక్తి ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయవచ్చని, ఒక యూనిట్ రక్తాన్ని దానం చేయడం అంటే ఒక మనిషి ప్రాణం కాపాడటమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అధికారి 2వైసీ ఉత్తమ్ బెన ర్జీ, రెడ్‌క్రాస్ సంస్థ వైద్యులు, వెంకట్‌రెడ్డి, పరమేశ్వర్ జానార్దన్‌రెడ్డి, 56మంది జావాన్లు రక్తదానం చేశారు.

గ్రామపంచాయతీ కారోబార్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ముషీరాబాద్

గ్రామపంచాయతీ కారోబార్ నూతన కమిటీని మంగళవారం బాగ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా సాదుల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా వంగ రవీందర్, సెక్రటరీగా పండి స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మా బతుకులను 51 జీవో ద్వారా నాశనం చేశాడని, బీఆర్ఎస్ పార్టీ అరాచక పాలనకు ప్రజలు విసిగెత్తి కాంగ్రెస్‌ను గెలిపించుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీద నమ్మకం ఉందని ప్రగాఢ విశ్వాసాన్ని తెలియజేశారు. గ్రామ పంచాయతీ సమస్యల ను పరిష్కరించుకోవడానికి కృషి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలు ఉండాలని కోరారు.

చిట్యాల ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తాం

- చిట్యాల ఐలమ్మ ప్రజా సంక్షేమ సంఘం ఆవిర్భావ సమావేశంలో వక్తలు



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రపంచానికే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట పాఠాన్ని నేర్పిన వీరనారీ చిట్యాల ఐలమ్మ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాలని పలువురు వక్తలు తెలిపారు. మం గళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చిట్యాల ఐలమ్మ ప్రజా సంక్షేమ సంఘం ఆవి ర్భావ సమావేశం వ్యవస్థాపక అధ్యక్షులు ఐలమ్మ మనవడు చిట్యాల రామచంద్రం, అధ్యక్షులు చిట్యాల శ్వేత ఐలమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతి థులుగా సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ ఇది ఒక పెద్ద పోరాటం కావాలని తెలంగాణలో జరిగిన పోరాటాలు ఎక్కడ జరగలేదన్నారు. ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మాట్లాడుతూ విస్నూరు రామచంద్రారెడ్డి దుర్మా ర్గాన్ని ఎదురించిన వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. మన ఓటును మనమే వేసుకోవాలని మన రాజ్యాన్ని మన మే ఏలుకోవాలని హితవుపలికారు. ప్రజాస్వామ్య దేశంలో మన ఓటు మనమే వేసుకునే హక్కు పోటీ చేసే హక్కు ఉంటుందన్నారు. రాజ్యాధికారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. టీపీఎస్‌కే అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐలమ్మ నుండి మనం పోరాట చరిత్రను, ఎదిరించే సాహసాన్ని నేర్చుకోవాలన్నారు. అడుక్కుంటే వచ్చేది బిక్ష అవుతుంది.. పోరాడితే వచ్చేది హక్కు అవుతుం దన్నారు. దొడ్డికొమరయ్య మరణం 04 జులై 1946 జరిగిన తర్వాత నల్ల నరసింహులు, ధర్మ భిక్షం, ఆరుట్ల కమలాదేవి, బీమ్ రెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం సహకారంతో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ఉధృతం చేసిందన్నారు. ఐలమ్మ సమగ్రమైన చరిత్రను వెలి కితీయాలని అందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమం లో చిట్యాల ఐలమ్మ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు చిట్యాల శ్వేత, ఐలమ్మ మనువడు చిట్యాల రామచంద్రం, ప్రొఫెసర్ జంపన్న, ప్రొఫెసర్ రాములు, భూపతి వెంక టేశ్వర్లు, బి.వి.కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ మానవి
బుధవారం 4 సెప్టెంబరు 2024
www.navatelangana.com
హైదరాబాద్

చిప్స్ తింటున్నారా...?

చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ ఇష్టపడి తినే స్నాక్స్‌లో చిప్స్ ఒకటి. రకరకాల రంగుల కవర్స్‌తో ఆకర్షణీయంగా ప్యాక్ చేసిన చిప్స్‌ను చిన్నారులు ఎంతో ఇష్టపడి తింటుంటారు. అయితే చిప్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు తెలిస్తే మాత్రం ఇకపై వాటిని తినాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు..



ఎక్కువ కాల నిల్వ ఉంచేందుకు ఇందులో సోడియంను ఎక్కువగా ఉపయోగిస్తారు. సోడియం ఎక్కువగా ఉండే ఫుడ్ తీసుకోవడం వల్ల రక్తపోటు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అలాగే వీటి తయారీలో ఉపయోగించే నూనె కూడా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. మరీ ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యాన్ని చిప్స్ క్రమంగా దెబ్బతీస్తాయి. చిప్స్‌లో ఉండే ట్రాన్స్ ఫ్యాట్ కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ధమనుల్లో రక్త ప్రసరణను అడ్డుకుంటుంది. దీంతో ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. శరీరంలో అనారోగ్యకరమైన కొవ్వు పెరగడానికి చిప్స్ కారణంగా చెబుతున్నారు. దీనివల్ల బరువు పెరిగే అవకాశం ఉంటుంది. మరీ ముఖ్యంగా చిన్నారుల్లో ఊబకాయానికి చిప్స్ కారణమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిలో ఫైబర్ కంటెంట్ అనేది అస్సలు ఉండదు. దీంతో చిన్నారుల్లో మలబద్ధకానికి కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంకా మరెన్నో అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని నిపుణులు తెలిపారు.

స్ఫూర్తినిచ్చే జీవితాలు



జీవితం ఎవరికీ పూల బాట కాదు. ఎన్నో అడ్డంకులు ఎదురవుతాయి. అందునా మహిళలు మరింత వివక్షను, ఇబ్బందులును ఎదుర్కోవలసి వస్తుంది. అలాంటి అడ్డంకులను ధైర్యంగా, దృఢ సంకల్పంతో అధిగమిస్తున్న మహిళలు ఎందరో ఉన్నారు. వారి స్ఫూర్తిదాయకమైన కథలు మనల్ని భావోద్వేగాలకు గురిచేస్తాయి. ఏమీ సాధించలేకపోతున్నామంటూ కుంగిపోతున్న వారిలో కొత్త ఉత్తేజాన్ని ఇస్తాయి. అలాంటి కొందరు మహిళల విజయపు చిరునవ్వులను మనమూ ఆస్వాదిద్దాం...

92 ఏండ్ల అథ్లెట్

పానా దేవి గోదారా... 92 ఏండ్ల వయసులోనూ క్రీడా పురస్కారాలను గెలుచుకుంటున్నారు. మహిళలు వారి జీవితంలో ఏ దశలోనైనా వారి కలలను అనుసరించేలా ప్రేరేపిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పూణేలో జరిగిన 44వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2024లో ఏకంగా ఆమె మూడుసార్లు స్వర్ణం సాధించారు. 100 మీటర్ల రేసు, డిస్కస్ త్రో, షాట్‌పుట్ ఈవెంట్‌లలో తన సత్తా చాటుకున్నారు ఈ బామ్మ. పానా దేవి రాజస్థాన్‌లోని అఖిసర్ గ్రామానికి చెందినవారు. స్థానిక స్టేడియంలో శిక్షణ పొందుతున్న పిల్లలను చూసి ఆమె కూడా పరుగెత్తడం మొదలుపెట్టారు. తన మనవడు జైకిషన్ ప్రోత్సాహంతో విజయపథంలో దూసుకుపోతున్నారు. ఒక్క పరుగులోనే కాదు షాట్‌పుట్, డిస్కస్ త్రో పోటీలలో కూడా పాల్గొనడం ప్రారంభించారు. తన సంకల్పం, కుటుంబ మద్దతు, ప్రోత్సాహం ఆమెను జిల్లా నుండి రాష్ట్ర స్థాయి పోటీలకు తీసుకువెళ్లింది. చివరకు జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఆమె ప్రతిరోజూ రెండు గంటలు కఠినమైన శిక్షణ చేస్తారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటారు. పానా దేవి వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, అభిరుచులను కొనసాగించడానికి ప్రతిబంధకం కాదని నిరూపిస్తున్నారు.



ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి

జ్యోతి రాత్రే... 55 ఏండ్ల ఈమె ఈ ఏడాది ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి రికార్డులను బద్దలు కొట్టారు. కరోనా సమయంలో జ్యోతి రాత్రే హిమాచల్ ప్రదేశ్‌లోని డియో టిబ్బా పర్వతాన్ని అధిరోహించడానికి నాలుగు గోడలను విడిచిపెట్టారు. పర్వతారోహణ పట్ల ఆమెకున్న అభిరుచికి ఇది నాంది పలికింది. అప్పటి నుండి ద్వీపం శిఖరం (నేపాల్), కాకసస్ పర్వతాలలోని ఎల్బ్రస్ పర్వతం, కిలిమంజారో (టాంజానియా), మౌంట్ అకాన్‌కాగువా (అర్జెంటీనా), ఆస్ట్రేలియాలోని మౌంట్ కోస్కియుజ్‌కోలను జయించారు. ఇది ఆమె రెండవ ప్రయత్నం. మొదట 2023లో తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగా విఫలమైంది. రెండవ ప్రయత్నంలో కూడా అడ్డంకులను ఎదుర్కొంది. కానీ బొలీవియన్ అధిరోహకుడు డేవిడ్ హ్యూగో అయావిరి క్విస్పే నేతృత్వంలోని 15 మంది సభ్యుల బృందం ఆమెకు విజయవంతమైన ఆరోహణకు సహాయపడింది. జ్యోతి ఎవరెస్ట్ పర్వతాన్ని 8,848.86 మీటర్లను తాకారు. ఆమె పర్వతారోహణ ప్రయాణంలో నిజంగా చెప్పుకోదగ్గ మైలురాయిగా నిలిచారు. మే 2018లో 53 ఏండ్ల వయసులో సంగీతా బహ్ల్ నెలకొల్పిన రికార్డును ఆమె బద్దలు కొట్టారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన భారతదేశపు అత్యంత పెద్ద మహిళ అనే గౌరవాన్ని జ్యోతి సంపాదించుకున్నారు.



బాల్య వివాహం వ్యతిరేకించింది

జి నిర్మల... బాల్య వివాహం నుండి బయటపడిన ఆమె ఇంటర్మీడియట్ పరీక్షలో ఆంధ్రప్రదేశ్‌లో టాపర్‌గా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో ముగ్గురు అక్కలతో కలిసి పెరిగింది. ఆర్థికంగా వెనుకబడిన తల్లిదండ్రులు సహజంగా కోరుకునేది ఆడపిల్లలకు పెండ్లి చేయడమే. ఆమె ముగ్గురు అక్కల పెండ్లి తర్వాత కుటుంబ బరువు నిర్మల భుజాలపై పడింది. అయితే ఆమె ఒత్తిడికి తలొగ్గడానికి నిరాకరించింది. ఆమె తన కష్టాన్ని జిల్లా కలెక్టర్ జి.సృజనకు తెలియజేసింది. ఆమె కష్టాలను చూసి చలించిన కలెక్టర్ రంగంలోకి దిగి నిర్మలను బాల్య వివాహం నుంచి రక్షించారు. ఐపీఎస్ కావాలనేది నిర్మల లక్ష్యం. దీని కోసం అహర్నిశలూ శ్రమిస్తుంది. ఆమె ఇప్పటికే తన సామర్థ్యాన్ని నిరూపించుకుంది. మొదటి ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 440కి 421 స్కోర్‌తో అగ్రస్థానంలో నిలిచింది. విజయపథంలో ఎలాంటి అడ్డంకినైనా అధిగమించగలరనడానికి నిర్మల సాధించిన ఈ విజయమే నిదర్శనం.



పార్కిన్సన్స్ వారియర్

కిరణ్ కమ్దార్... ఈ పార్కిన్సన్స్ యోధురాలు ప్రతిరోజూ వంద మంది ఆసుపత్రి రోగులకు, నిరుపేదలకు ఆహారం అందిస్తున్నారు. కిరణ్ కమ్దార్ ఏడేండ్లుగా పార్కిన్సన్స్ వ్యాధితో పోరాడుతున్నారు. ఈ వ్యాధి కారణంగా ఆమె శారీరకంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ మూడేండ్లుగా 62 ఏండ్ల ఆమె తన శారీరక పరిమితులను అధిగమిస్తూ ఇతరులను చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. నిస్వార్థంగా మహారాష్ట్రలోని పాల్ఘర్‌లోని డిఎం పెటిట్ ప్రభుత్వ ఆసుపత్రిలో వంద మంది రోగులకు, వారి కుటుంబాలకు ఉచితంగా ఖిచ్డీని తయారు చేసి అందిస్తున్నారు. 2021లో కరోనా మహమ్మారి సమయంలో రోగుల అవసరాలు గుర్తించి ఆమె తన సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 5 గంటలకు నిద్రలేచి ఖిచ్డీని తయారుచేసి అందిస్తున్నారు. ఇంటికి దూరంగా ఉంటున్న వారికి ఇంటి ఆహారాన్ని అందిస్తూ వారి కండ్లలో ఆనందాన్ని చూస్తున్నారు. 'నేను నా శరీరంపై నియంత్రణ లేకుండా కష్టపడుతున్నాను. కానీ చేస్తున్న పనిని నేను ఇష్టపడుతున్నాను' అని ఆమె పంచుకున్నారు. 'నా వైకల్యం నా అతిపెద్ద సవాలు అయినప్పటికీ, నన్ను నేను ముందుకు తీసుకెళ్లేందుకు, నన్ను నేను ఇష్టపడేందుకు ఇది నాకెంతో ఉపయోపడుతుంది' అని ఆమె నవ్వుతూ చెబుతున్నారు. అంతే కాదు సెరిబ్రల్ పాల్సీ ఉన్న తన కొడుకును చూసుకుంటూ ఖాళీ సమయంలో నిరుపేద పిల్లలకు పాఠాలు కూడా బోధిస్తున్నారు.



నిద్రలోకి జారుకోవాలా..

నిద్ర మనిషికి చాలా అవసరం. రెండు రోజులు తిండి లేకపోయినా ఉండొచ్చు. కానీ ఒక రోజు నిద్ర సరిగా లేకపోయినా.. మనిషి మనిషిగా అస్సలు ఉండలేరు. శరీరంలో హార్మోన్లు కూడా ఇన్ బ్యాలెన్స్ అవుతాయి. మంచి నిద్ర కోసం ఎంతో పరితపిస్తూ ఉంటారు. కానీ ఇప్పుడున్న రోజుల్లో నిద్ర అనేది చాలా కష్టంగా మారుతుంది. పనుల ఒత్తిడి, టెన్షన్ల కారణంగా నిద్ర అనేది అస్సలు పడటం లేదు. దీని వలన అనేక దీర్ఘకాలిక సమస్యల బారిన పడుతున్నారు. రాత్రి పూట సరిగా నిద్రపోకపోతే డయాబెటీస్, క్యాన్సర్, బీపీ వంటి సమస్యలు ఎటాక్ చేస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే మంచి నిద్ర కోసం పరితపించే వాళ్లు ఇప్పుడు చెప్పే ఈ చిన్న చిట్కాలు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. నిద్ర క్వాలిటీ పెరుగుతుంది. ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. మరి ఆ చిట్కాలు ఏంటో ఇప్పుడు చూసేయండి.



గోరు వెచ్చని పాలు:


రాత్రి పడుకునే ముందు గోరు వెచ్చని పాలు తాగితే మంచి నిద్ర పడుతుందని ఇంట్లో పెద్ద వాళ్లు, ఆరోగ్య నిపుణులు కూడా చెబుతూ ఉంటారు. అంతే కాదు పలు అధ్యయనాల్లో రాత్రి పడుకునే ముందు గోరు వెచ్చని పాలు తాగడం వల్ల మంచి నిద్ర పడుతుందని తేలింది. కాబట్టి మంచి నిద్ర పట్టాలంటే గోరు వెచ్చని పాలు తాగండి.

బాదం పాలు:

రాత్రి పూట గాఢ నిద్రలోకి జారుకోవాలంటే.. బాదం పాలు కూడా ఎంతో చక్కగా హెల్ప్ చేస్తాయి. ఎందుకంటే బాదం పాలలో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది మంచి నిద్రను ప్రేరేపిస్తుంది. అంతే కాకుండా శరీరంలోని కండరాలను కూడా రిలాక్స్ చేస్తుంది.

పదిలోపు డీఎస్సీ ఫలితాలు!

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలకు సంబంధించిన తుది కీ విడుదలపై విద్యాశాఖ అధికారుల కసరత్తు పూర్తయ్యింది. బుధవారం తుది కీ విడుదలయ్యే అవకాశమున్నది. ఈ దిశగా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జులై 18 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 2,79,957 మంది దరఖాస్తు చేయగా, 2,45,263 (87.61 శాతం) మంది అభ్యర్థులు రాతపరీక్షలకు హాజరయ్యారు. 34,694 (12.39 శాతం) మంది గైర్హాజరయ్యారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండితులు, సెకండరీ గ్రేడ్ టీచర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు సంబంధించిన ప్రశ్నాపత్రాలకు మాధ్యమాల వారీగా వేర్వేరుగా ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లను గతనెల 13న పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ప్రాథమిక కీపై 28 వేలకుపైగా అభ్యంతరాలు వచ్చాయి. వాటిని సబ్జెక్టు నిపుణులు పరిశీలించారు. బుధవారం తుది కీని విడుదల చేస్తారు. ప్రశ్నాపత్రాల్లో ఉండే తప్పులను గుర్తించడం, వాటికి మార్కులు కలుపుతారా? లేదంటే ఆ ప్రశ్నలను తొలగిస్తారా? అన్నది బుధవారం స్పష్టత రానుంది. ఇంకోవైపు డీఎస్సీ రాతపరీక్షలో రెండు విడతల్లో 18 ప్రశ్నలు తిరిగి వచ్చాయి. వాటిపైనా విద్యాశాఖ అధికారులు వివరణ ఇవ్వనున్నారు. ఈనెల పదో తేదీలోగా డీఎస్సీ ఫలితాలను ప్రకటించే అవకాశమున్నది. తొలుత గురుపూజోత్సవం సందర్భంగా గురువారం డీఎస్సీ ఫలితాలను ప్రకటించాలని భావించినప్పటికీ వీలు కావడం లేదని తెలిసింది. టెట్ మార్కులను కలిపి డీఎస్సీ జనరల్ ర్యాంకింగ్ లిస్టు (జీఆర్‌ఎల్)ను ప్రకటిస్తారు. ఆ తర్వాత రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా జిల్లాల వారీగా పోస్టుల వారీగా 1:3 నిష్పత్తి చొప్పున మెరిట్ జాబితాను విద్యాశాఖ విడుదల చేస్తుంది. ధ్రువపత్రాల పరిశీలన ముగిసిన తర్వాత 1:1 నిష్పత్తిలో జిల్లాల వారీగా ఉపాధ్యాయ పోస్టుల వారీగా అభ్యర్థుల ఎంపిక జాబితాను ప్రకటిస్తారు. ఆ తర్వాత ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తారు.

న్యాయ సంస్కరణలకు 23వ లా కమిషన్ ఏర్పాటు

న్యూఢిల్లీ : న్యాయ సంస్కరణల కోసం 23వ లా కమిషన్‌ను కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది నిరుపయోగంగా మారిన, రద్దు చేయగల చట్టాలను గుర్తించడం, పేదలను ప్రభావితం చేసే చట్టాలను తనిఖీ చేయడం, కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఏదైనా చట్టంపై తన అభిప్రాయాలను తెలియజేయడం వీలుగా కమిషన్‌ను తెచ్చామని మోడీ సర్కార్ అంటోంది. 2024 సెప్టెంబర్ 1 నుంచి 2027 ఆగస్టు 31 వరకు(మూడేండ్లపాటు) లా కమిషన్ కాల పరిమితి నిర్ణయించారు. ఈ కమిషన్‌లో చైర్మెన్, నలుగురు సభ్యులు, కార్యదర్శులు లీగల్ అఫైర్స్, లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్‌లు ఎక్స్-అఫీషియో సభ్యులు, ఐదుగురు పార్ట్ టైమ్ సభ్యులు ఉంటారు. అయితే ఈ కమిషన్ చైర్మెన్‌తో సహా సభ్యులను ప్రభుత్వం ఇంకా నియమించలేదు. 2020లో రూపొందించిన 22వ లా కమిషన్ నిబంధనల మాదిరిగానే, కొత్త ప్యానెల్ "రాష్ట్ర పాలసీకు సంబంధించిన ఆదేశిక సూత్రాల వెలుగులో ప్రస్తుత చట్టాలను పరిశీలించడం, మెరుగుదల, సంస్కరణల మార్గాలను సూచించడం వంటి బాధ్యతలను కలిగి ఉంది. ఆదేశిక సూత్రాలను అమలు చేయడానికి, రాజ్యాంగ ప్రవేశికలో పేర్కొన్న లక్ష్యాలను సాధించడానికి అవసరమైన చట్టాలు చేయడం" వంటివి ప్రతిపాదిస్తుంది. "ఆహార భద్రత, నిరుద్యోగంపై ప్రపంచీకరణ ప్రభావాన్ని పరిశీలించాలని, అట్టడుగువర్గాల ప్రయోజనాల పరిరక్షణకు చర్యలను సిఫారసులు చేయాలని" కూడా కమిషన్‌ను కేంద్ర ప్రభుత్వం కోరింది. ఇది గత 22వ కమిషన్ నిబంధనలలో కూడా ఉంది.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- తొమ్మిదిమంది మావోయిస్టుల కాల్చివేత
- మృతుల్లో ఆరుగురు మహిళలు



దంతేవాడ అడవుల్లో జల్లెడ పడుతున్న భద్రతా బలగాలు (ఫైల్ ఫొటో)

చర్ల : ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లోని లోహగావ్, పురంగెల్, అండ్రి దండకారణ్య గుట్టల్లో పోలీసు కాల్పుల్లో మంగళవారం తొమ్మిదిమంది మావోయిస్టులు చనిపోయారు.. పోలీసుల కథనం ప్రకారం గుట్టల్లో మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. పోలీసులను చూసిన మావోయిస్టులు కాల్పులు జరపగా పోలీసులు ఎదురు కాల్పులు జరిపారని స్థానిక మీడియా తెలిపింది.. ఘటనా స్థలం నుంచి తొమ్మిదిమంది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్టు దంతెవాడ ఎస్పి గౌరవ్ రాయ్ తెలిపారు. మృతులను పశ్చిమ బస్తర్ దర్బా డివిజన్ కమిటీ సభ్యులుగా,ఘటనా స్థలి నుంచి ఎస్ఎల్ఆర్ రైఫిల్, 303 రైఫిల్, బిజిఎల్ లాంచర్లు, 12 బోర్ రైఫిల్, 315 బోర్ గన్‌తో సహా భారీ మొత్తంలో ఆయుధాలు, దైనందిక సామగ్రి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పి తెలిపారు. ఘటనా స్థలానికి అదనపు బలగాలను పంపినట్టు చెప్పారు. ఇది ఎన్‌కౌంటర్ కాదని, పోలీసులే హతమార్చి ఎన్‌కౌంటర్‌గా చిత్రించారని హక్కుల కార్యకర్తలు విమర్శించారు.

మావోయిస్టులను తుడిచిపెట్టే వరకూ యుద్ధం కొనసాగుతుందని ఛత్తీస్‌గఢ్ సిఎం విష్ణుదేవ్‌సాయి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జోన్‌లో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ 153 మంది మావోయిస్టులను భద్రతా దళాలు కాల్చివేశాయని బస్తర్ పోలీసులు తెలిపారు. 669 మందిని అరెస్టు చేశామని, 656 మంది లొంగిపోయారని పేర్కొన్నారు. బీజాపూర్ జిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో 13 మంది మావోయిస్టు గ్రూపులకు చెందిన 13 మంది క్రియాశీల సభ్యులను అరెస్టు చేసి, మంగళవారం జైలుకు పంపినట్టు తెలిపారు.

సీఎంకు పాలనపై పట్టులేదు

(మొదటిపేజీ తరువాయి)

ఇంట్లో 4 నుంచి 10 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు చెబుతున్నారని చెప్పారు. వరదల్లో చిక్కుకున్న ప్రజానీకానికి ప్రభుత్వం తాగునీరు అందించలేని దుస్థితి దాపురించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వరద బాధితులకు రూ.20లక్షలు ఇవ్వాలని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని, అదే మాటను ఇప్పుడు వారు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేలు ఏమాత్రం సరిపోవన్నారు. వారికి రూ.2 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఇప్పటి వరకు ముంపు ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ జరగలేదన్నారు. వరదల్లో చిక్కుకుని రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది మృతిచెందితే.. ప్రభుత్వం మాత్రం 16 మందని చెప్పడం దురదృష్టకరమన్నారు. గతంలో పంట నష్ట పోయిన రైతాంగానికి ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని అప్పటి ప్రభుత్వాన్ని ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అదే మాట మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.30 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట పొలాల్లో ఇసుక మేటలతో నష్టం కలిగిన రైతాంగానికి రూ.50 వేలు ఇవ్వాలని అన్నారు.

వరద ప్రాంతాల్లో..

తొలుత ఖమ్మంరురూరల్ మండలంలోని రాజీవ్ స్వగృహ కల్ప, జలగంనగర్, ఖమ్మం నగరంలోని వెంకటేశ్వర నగర్, మోతీనగర్, గొల్ల బజార్‌లలోని వరదల్లో నష్టపోయిన ప్రజలను బీఆర్ఎస్ నేతలు పరామర్శించారు. 48వ డివిజన్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రవన్న సేవా ఆధ్వర్యంలో 6 లక్షల విలువ చేసే బియ్యం, కాయకూరలను మాజీ మంత్రి హరీశ్‌రావు పంపిణీ చేశారు. ప్రకాష్ నగర్ వరద బ్రిడ్జిపై ఉధృతిలో చిక్కుకున్న 9 మందిని కాపాడిన ఏడుగురిని శాలువా కప్పి అభినందించారు.

ప్రభుత్వ అసమర్థత వల్లే సాగర్ కాలువకు గండి

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లనే సాగర్ కాలువకు గండి పండిందని మాజీ మంత్రులు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం, కాగిత రామచంద్రాపురం గ్రామ సమీపంలో నాగార్జున సాగర్ ఎడమ కాలువ కట్ట 132కిలో మీటర్ వద్ద పడిన గండి ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ముఖ్యమంత్రి, మంత్రుల బాధ్యతారాహిత్యమే ఇంతటి నష్టానికి కారణమైందన్నారు. ప్రమాద సమయాల్లో ఓపెన్ చేసే ఎస్కేప్ ఛానల్ ఉన్నప్పటికీ ఉదాసీనంగా వ్యవహరించారని విమర్శించారు. ఎస్కేప్‌ను తెరవాలని రైతులు చెబుతున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం పెడచెవిన పెట్టి వారి కన్నీటికి కారణమైందన్నారు. వరదల్లో చిక్కుకున్న వారి కోసం కనీసం ఒక్క హెలికాప్టర్ తీసుకురాలేకపోయారని, విలాసాల కోసమే హెలికాప్టర్ వాడుతున్నారని విమర్శించారు. సాగర్ ఎడమ కాల్వ గండి పాపం ఖమ్మం జిల్లా మంత్రులదే అన్నారు. ఖమ్మం ప్రజల నుంచి తిరుగుబాటు వచ్చాకే మంత్రులు తేరుకున్నారన్నారు. అనంతరం ఇసుక మేట వేసిన పంట పొలాలను పరిశీలించారు. రైతులు ధైర్యంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించేవరకు తాము పోరాడుతామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, గాదరి కిషోర్, చిరుమర్తి లింగయ్య కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్ నాయకుల కార్లపై దాడి

ఖమ్మం నగరం మంచికంటి నగర్‌లో మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతల కార్లపై కొంతమంది రాళ్లతో దాడి చేశారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ గూండాలను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం సీపీని కలిసి వినతిపత్రం అందజేశారు.

మంత్రాల నెపంతో వ్యక్తి దారుణ హత్య

- తీవ్రంగా గాయపడిన ఇద్దరు మహిళలు
- మురికి కాలువలో పడేసి కర్రలు, రాళ్లు, చెప్పులతో దాడి

నవతెలంగాణ-టేక్మాల్



మంత్రాల నెపంతో కొందరు గ్రామస్తులు మూకుమ్మడిగా తెల్లవారుజామునే ఓ కుటుంబంపై విచక్షణారహితంగా దాడి చేశారు. మురికి కాలువలో పడేసి కర్రలు, రాళ్లు, చెప్పులతో కొట్టారు. ఈ దాడిలో ఆ ఇంటికి చుట్టపుచూపుగా వచ్చిన వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం గొల్లగూడెం గ్రామంలో జరిగింది. ఇందుకు సంబంధించి బాధితురాలు బురుజుకాడి గంగమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం మండలం ఏటిగడ్డ మాందాపురం గ్రామానికి చెందిన రాములు గంగమ్మ మేనమామ. ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రిలో చూపించుకునేందుకు గొల్లగూడెంలో గంగమ్మ ఇంటికొచ్చాడు. అయితే, మంత్రాలు చేస్తున్నారంటూ మంగళవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో గ్రామస్తులు కొందరు గంగమ్మ ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో ఉన్న వాళ్లను బయటకు లాగి కర్రలు, రాళ్లతో విచక్షణారహితంగా కొట్టారు. వారు ఎంత వారించినా.. ప్రాధేయపడినా వదిలిపెట్టలేదు. 'మాకు ఎలాంటి మంత్రాలూ రావు.. ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రిలో చూపించుకునేందుకు మా మేనమామ రాములు ఇక్కడికి వచ్చాడు" అని చెప్పినా వినిపించుకోలేదు. ఇంటి ముందర ఉన్న మురికి కాల్వలో పడేసి తన్నుకుంటూ కొట్టారు. తీవ్రంగా కొట్టడంతో రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. గంగమ్మతోపాటు బాలమణి అనే మహిళపైనా దాడి చేశారు. బురుజు కాడి విట్టల్, ఆయన భార్య ఇందిర, మరికొందరు గ్రామస్తులు రాములును కొట్టి చంపారని గంగమ్మ కన్నీటిపర్యంతమయ్యారు. గాయపడిన గంగమ్మ, బాలమణి జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
డీఎస్పీ ప్రసన్న కుమార్

మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, అల్లాదుర్గం సీఐ రేణుక పోలీసు సిబ్బందితో గొల్లగూడెం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రసన్నకుమార్ చెప్పారు. రాములు మృతదేహాన్ని జోగిపేట ఆస్పత్రికి తరలించారు.

ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం

(మొదటిపేజీ తరువాయి)

రషీద్ గూడ, ఘంసీమిగూడ విలీనం

- నార్సింగి మున్సిపాలిటీలో.. మీర్జాగూడ గ్రామపంచాయతీ
- తుక్కుగూడ మున్సిపాలిటీలో.. హర్షగూడ గ్రామపంచాయతీ
- మేడ్చల్ మున్సిపాలిటీలో.. పూడూరు, రాయిలాపూర్ గ్రామపంచాయతీలు
- దమ్మాయిగూడ మున్సిపాలిటీలో.. కీసర, యాద్గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లి
- నాగారం మున్సిపాలిటీలో.. బోగారం, గోదాముకుంట, కరీంగూడ, రాంపల్లి దాయార గ్రామాలు
- పోచారం మున్సిపాలిటీలో.. వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల,

కాచివానిసింగారం, చౌదరిగూడ విలీనం

ఘట్‌కేసర్ మున్సిపాల్టీలో.. అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్,ఘనాపూర్, మర్పల్లిగూడ విలీనం

8 గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో..మునీరాబాద్, గౌడవెల్లి పంచాయతీలు , 8 తూంకుంట మున్సిపాలిటీలో.. బొంరాసి పేట, శామీర్ పేట, బాబాగూడ పంచాయతీలు విలీనం

చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తాం...

(మొదటిపేజీ తరువాయి)

మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అశ్వినీ తల్లి నేజీ, ఆమె కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించి ఓదార్చారు. అశ్వినీ అన్న అశోక్‌కు ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తామని

ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆ కుటుంబానికి ఇల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

ఆకేరు ప్రవాహం శాస్త్రీయ సర్వే చేపడతాం...

ఆకేరు వాగు ప్రవాహంపై శాస్త్రీయ సర్వే చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆకేరు వాగు పొంగడంతో ప్రతి సారి తాము ముంపు బారిన పడుతున్నామని సీతారాం తండా వాసులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఆకేరు ప్రవాహంపై శాస్త్రీయంగా అంచనా వేసి నూతన వంతెన నిర్మిస్తామని, నీటిని సమీపంలోని చెరువులు, కుంటలకు మళ్లించే ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆకేరు వాగు వరదతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామన్నారు. ఆకేరు వాగు ప్రవాహ ఉధృతి ఎలా ఉంటుంది.. గతంలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకున్నాయా? అని ముఖ్యమంత్రి స్థానికులను ప్రశ్నించారు. ప్రతిసారి వాగు పొంగడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, రహదారి గతంలోనూ తెగిందని స్థానికుడు జర్పుల లక్ష్మణ్ ముఖ్యమంత్రికి తెలిపారు. సీతారాం తండాలో ఇండ్లు మునిగిన వారిని సీఎం ఓదార్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాము తీవ్రంగా నష్టపోయామని, ఆకేరు వాగు పొంగిన ప్రతిసారి తమ తండాతో సమీపంలోని మరో రెండు తండాలకు నిద్ర ఉండడం లేదని, తమను రక్షించాలని ముఖ్యమంత్రిని తండా వాసులు కోరారు.. ఆకేరు వాగు పొంగి ఇండ్లలోని పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు, సర్టిఫికెట్స్ తడిచిపోయినందున ఒకే ఎఫ్ఐఆర్ దాఖలు చేసి అందరికీ నూతన కార్డులు, సర్టిఫికెట్స్, పాసు పుస్తకాలు మంజూరయ్యేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.



పోలీసు, అధికారులకు రెవెన్యూ సిబ్బందికి అభినందనలు

గతంలో ఎన్నడూ లేనంతగా మహబూబాబాద్ జిల్లాలో వర్షపాతం నమోదైనా ముందస్తు జాగ్రత్తలు చేపట్టడంతో ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గించగలిగామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో చోటు చేసుకున్న పంట, ఆస్తి నష్టాలపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి తిలకించారు. అనంతరం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని.... ఎకరాకు రూ.పది వేల చొప్పున పంట నష్ట పరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. జిల్లాలో ముంపు బారిన పడిన 680 మందిని సహాయక శిబిరాలకు తరలించామని సీఎం చెప్పారు. సీతారాం తండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలిచిన ఎస్సై నగేష్ కి అభినందనలు తెలిపారు. జిల్లాలో విపత్తు సమయంలో సత్వరం స్పందించిన పోలీసు, రెవెన్యూ సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. జిల్లాల్లో విపత్తుల సమయంలో ఏం జరిగింది.. ఆ సమస్యను ఎలా అధిగమించారు... ఎలా సహాయక చర్యలు తీసుకున్నారనే దానిపై బ్లూబుక్ రూపొందించుకోవాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి సూచించారు.

ఏనాడైనా బాధితులను పరామర్శించారా..?


పదేండ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఏనాడైనా వరద, ప్రమాద బాధితులను పరామర్శించారా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. వరద బాధితుల వద్దకు ఏనాడూ కేసీఆర్ వెళ్లలేదని, సొంత నియోజకవర్గం మాసాయిపేటలో రైలు ప్రమాదంతో చిన్నారులు చనిపోయినా, హైదరాబాద్ ఓఆర్ఆర్ లో పశు వైద్యురాలు లైంగికదాడికి, హత్యకు గురైతే కనీసం వాళ్ల కుటుంబ సభ్యులను కేసీఆర్ పరామర్శించలేదని ముఖ్యమంత్రి మండిపడ్డారు. అమెరికాలో ఎంజాయ్ చేస్తున్న కేటీఆర్ క్షేత్రంలో ఉండి సహాయక చర్యలు చేపడుతున్న మంత్రులపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లలో దోచుకున్న రూ.లక్ష కోట్ల నిధుల్లో రూ.వెయ్యి కోట్లో... రూ. రెండు వేల కోట్లో సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇవ్వాలని కేసీఆర్ కుటుంబానికి ముఖ్యమంత్రి సూచించారు. సమీక్షలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మురళీ నాయక్, రామచంద్ర నాయక్, యశస్వినీ రెడ్డి, గండ్ర సత్యానారాయణరావు, నాగరాజు, కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు...

వరద సహాయక చర్యలు చేపట్టేందుకు గానూ ముఖ్యమంత్రి ఉపశమన నిధి (సీఎంఆర్ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ ఒక రోజు మూల వేతనం రూ.135 కోట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెక్ రూపంలో అందజేశారు. వారికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. మహబూబాబాద్ కు చెందిన పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయి సింధు రాష్ట్రంలో వరద సహాయక చర్యలకు తాను దాచుకున్న రూ.3 వేలను ముఖ్యమంత్రికి అందజేశారు. విద్యార్థినిని ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్రంలోని స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు.



ఖమ్మంలో ....



మహబూబాబాద్‌లో పంట నష్టం..



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు



పోలాండ్ భామ, టాప్ సీడ్ ఇగా స్వైటెక్ యుఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. యు.ఎస్ ఓపెన్‌లో గతంలో క్వార్టర్స్‌కు చేరుకున్న సీజన్‌లో చాంపియన్‌గా నిలిచిన ఇగా స్వైటెక్.. అదే ప్రదర్శన ఈ సీజన్‌లోనూ పునరావృతం చేసేందుకు సిద్ధమవుతోంది. మెన్స్ సింగిల్స్ టైటిల్ ఫైట్ సైతం ఆసక్తికరంగా మారింది. జానిక్ సినర్, అలెక్స్‌లు పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు.

సూపర్ స్వైటెక్

- క్వార్టర్‌ఫైనల్లో పోలాండ్ భామ
- సినర్, అలెక్స్ సైతం ముందంజ

యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2024

నవతెలంగాణ-న్యూయార్క్

వరల్డ్ నం.1, టాప్ సీడ్ ఇగా స్వైటెక్ (పోలాండ్) యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. సూపర్ ఫామ్ కొనసాగించిన స్వైటెక్ ప్రీ క్వార్టర్ ఫైనల్లో వరల్డ్ నం.16 సమ్సోనోవపై వరుస సెట్లలో విజయం సాధించింది. సుమారు గంటన్నర పాటు సాగిన పోరులో 6-4, 6-1తో స్వైటెక్ అలవోక విజయం సాధించింది. వరుస సెట్లలో మూడు బ్రేక్ పాయింట్లు సాధించిన టాప్ సీడ్.. ప్రత్యర్థి సమ్సోనోవకు ఒక్క బ్రేక్ పాయింట్‌ను సైతం కోల్పోలేదు. మూడు ఏస్‌లతో మెరిసిన స్వైటెక్ పాయింట్ల పరంగా 63-45తో ఎదురులేని విజయం సాధించింది. స్వైటెక్ 12 గేమ్ పాయింట్లు సాధించగా.. సమ్సోనోవ ఐదు గేమ్ పాయింట్లకే పరిమితమైంది. తొలి సర్వ్‌లోనే 88 శాతం పాయింట్లు గెల్చుకున్న స్వైటెక్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. గతంలో యు.ఎస్ ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరుకున్నప్పుడు పోలాండ్ భామ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. బ్రెజిల్ భామ హదాద్ సైతం మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపింది. కరోలినా వొజ్నియాకిపై మూడు సెట్ల సమరంలో పైచేయి సాధించింది. 6-2, 3-6, 6-3తో వొజ్నియాకిపై హదాద్ గెలుపొందింది. ఐదు ఏస్‌లు, ఐదు బ్రేక్ పాయింట్లతో చెలరేగిన హదాద్.. వొజ్నియాకి నిలకడగా పోటీనిచ్చినా నిలబడింది. వొజ్నియాకి సైతం నాలుగు ఏస్‌లతో పాటు మూడు బ్రేక్ పాయింట్లు సాధించింది. పాయింట్ల పరంగా 101-88తో హదాద్ ఆధిపత్యం నిరూపించుకుంది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో స్వైటెక్‌తో జెస్సికా పెగులా..కరోలినా ముచోవాతో హదాద్.. సబలెంకతో జెంగ్..ఎమ్మా నవారాతో బడోసలు తలపడనున్నారు.



సినర్ ముందంజ :

పురుషుల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరేట్లు నొవాక్ జకోవిచ్, కార్లోస్ అల్కరాస్‌లు ఇంటిముఖం పట్టగా.. టాప్ సీడ్, వరల్డ్ నం.1 జానిక్ సినర్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. ప్రీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో అమెరికా ఆటగాడు, 14వ సీడ్ టామీ పాల్‌పై 7-6(7-3), 7-6(7-5), 6-1తో సినర్ సూపర్ విక్టరీ నమోదు చేశాడు. తొలి రెండు సెట్లు టైబ్రేకర్‌కు దారితీయగా.. మూడో సెట్‌లో సినర్ తనదైన క్లాస్ చూపించాడు. 10 ఏస్‌లు కొట్టిన సినర్.. నాలుగు బ్రేక్ పాయింట్లతో మెరిశాడు. సుమారు మూడు గంటల పాటు సాగిన మ్యాచ్‌లో సినర్ పాయింట్ల పరంగా 116-93తో పైచేయి సాధించాడు. ఇద్దరు ఆసీస్ ఆటగాళ్ల తలపడిన మరో మ్యాచ్‌లో అలెక్స్ విజయం సాధించాడు. 6-0, 3-6, 6-3, 7-5తో జోర్డాన్ థామ్సన్‌పై సాధికారిక విజయం సాధించాడు. తొలి సెట్‌ను ఏకపక్షంగా నెగ్గిన అలెక్స్‌కు తర్వాత వరుసగా మూడు సెట్లలో గట్టి పోటీ ఎదురైంది. రెండో సెట్‌ను జోర్డాన్‌కు కోల్పోయినా.. ఆ తర్వాత వరుసగా రెండు సెట్లలో అలెక్స్ పైచేయి సాధించాడు.

అక్టోబర్ 18 నుంచి ప్రొ కబడ్డీ

హైదరాబాద్‌లో తొలి అంచె పోటీలు

ముంబయి: ఈ ఏడాది పది సీజన్ల పండుగ జరుపుకున్న ప్రొ కబడ్డీ లీగ్ (పీకెఎల్) 11వ సీజన్‌కు సరికొత్తగా ముస్తాబవుతోంది. అక్టోబర్ 18 నుంచి హైదరాబాద్ వేదికగా ప్రొ కబడ్డీ సీజన్ 11 ఆరంభం కానుంది. ఈ మేరకు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదకొండవ సీజన్ నుంచి ప్రొ కబడ్డీ లీగ్ పాత పద్దతిలోనే జరుగనుంది. సీజన్ మొత్తం మూడు వేదికల్లోనే నిర్వహించనున్నారు. అక్టోబర్ 18న ఆరంభ మ్యాచ్ సహా తొలి అంచె పోటీలు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయి. నవంబర్ 10 నుంచి నోయిడా ఇండోర్ స్టేడియంలో రెండో అంచె పోటీలు, డిసెంబర్ 3 నుంచి పుణెలోని బ్యాడ్మింటన్ ఇండోర్



స్టేడియంలో లీగ్ దశ చివరి అంచె పోటీలు షెడ్యూల్ చేశారు. ప్లే ఆఫ్స్ షెడ్యూల్, వేదిక వివరాలను లీగ్ దశ చివర్లో వెల్లడించనున్నారు. ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్ టైటిల్ వేటలో 12 జట్లు బరిలోకి దిగుతున్నాయి.



పవన్ కళ్యాణ్   ఎన్టీఆర్   బాలకృష్ణ

ఉభయ తెలుగు రాష్ట్రాల వరద బాధితుల కోసం..

బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్, ఎన్టీఆర్ భారీ విరాళం



ఎస్.నాగవంశీ, ఎస్.రాధాకృష్ణ, త్రివిక్రమ్, సిద్దు జొన్నలగడ్డ



అనన్య నాగళ్ళ, విశ్వక్‌సేన్, బన్నీ వాస్, వెంకీ అట్లూరి

ప్రకృతి విపత్తుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలను ఆదుకునేందుకు తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు ఎప్పుడూ ఓ అడుగు ముందే ఉంటారు. దేశవ్యాప్తంగా ఎక్కడ ఏం జరిగినా సరే.. మేమున్నామంటూ ఆపన్న హస్తం అందిస్తూ తమ మంచి మనసుని చాటుకుంటారు. ప్రస్తుతం వరదల వల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. వీరిని ఆదుకునేందుకు తెలుగు సినీ ప్రముఖులు మరోమారు తమ గొప్ప మనసుని చాటుకున్నారు.

ప్రస్తుతం తెలుగు నేలను వరద ముంచెత్తుతోంది. ఈ విపత్కర పరిస్థితులలో బాధాతప్త హృదయంతో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు నా బాధ్యతగా బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను. రెండు రాష్ట్రాలలో మళ్ళీ అతి త్వరలోనే సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆశిస్తున్నాను.

\- బాలకృష్ణ

వరదల కారణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కొన్ని ప్రాంతాల ప్రజలు చాలా కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి తరుణంలో తెలుగు రాష్ట్రాలకు సాయం అత్యవసరం. ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయాను. నావంతు చేయూతగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రూ.50 లక్షలు, తెలంగాణ రాష్ట్రానికి రూ.50 లక్షలు విరాళంగా అందిస్తున్నాను.

\- ఎన్టీఆర్

భారీ వర్షాల వల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న ఆస్తి, ప్రాణ నష్టాలు మమ్మల్ని ఎంతగానో కలచి వేశాయి. ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు త్వరగా కోలుకోవాలని ఆశిస్తూ, మా వంతు సాయంగా ఏపీకి రూ.25లక్షలు, తెలంగాణకు రూ.25లక్షలను ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేస్తున్నాం.

\- దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు ఎస్.రాధాకృష్ణ (చినబాబు), ఎస్.నాగవంశీ

ఏపీ ఉప ముఖ్యమంత్రి, హీరో **పవన్‌కళ్యాణ్** ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. కోటి రూపాయలను, ఏపీ సీఎం. రిలీఫ్ ఫండ్‌కురూ.15లక్షలు, తెలంగాణ రిలీఫ్ ఫండ్‌కు రూ.15 లక్షలను **హీరో సిద్ధు జొన్నలగడ్డ**, అలాగే కథానాయిక **అనన్య నాగళ్ళ** సైతం రూ.2.5లక్షల చొప్పున, దర్శకుడు-రచయిత **వెంకీ అట్లూరి** రూ.5 లక్షల చొప్పున, **హీరో విశ్వక్‌సేన్** రూ.15 లక్షల చొప్పున రెండు రాష్ట్రాలకు విరాళం అందించారు. నిర్మాత **బన్నీ వాస్** 'ఆయ్' కలెక్షన్లలో 25% విరాళంగా ప్రకటించారు.

నవచిత్రం


పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



గోపీచంద్

గోపీచంద్, డైరెక్టర్ శ్రీను వైట్ల కలయికలో రూపొందుతున్న స్టైలిష్ యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వం'. మేకర్స్ ప్రమోషన్స్‌ను స్టార్ట్ చేస్తూ ఈ చిత్ర టీజర్‌ను రిలీజ్ చేశారు. నరేష్ వాయిస్ ఓవర్‌తో టీజర్ స్టార్ట్ అవుతుంది. గోపీచంద్, కావ్యా థాపర్ పాత్రల పరిచయం, వారి క్యారెక్టర్స్‌లో కామెడీ స్పార్క్ ఆకట్టు కున్నాయి. టీజర్‌లో నటీనటులతో కామెడిక్ సీన్స్ హిలేరియస్‌గా ఉన్నాయి. టీజర్ చివరి భాగంలో యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ అదిరి పోయాయి. ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్‌ని ఎఫెక్టివ్‌గా బ్యాలెన్స్ చేస్తూ టీజర్‌ని ప్రజెంట్ చేశారు శ్రీను వైట్ల. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్ పై నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ మూవీ నిర్మాణ విలువలు టాప్ క్లాస్‌లో ఉన్నాయి. అక్టోబర్ 11న దసరాకి ఈ సినిమా విడుదల కానుంది.

అద్భుతమైన మెలోడీగా.. అదంతేలే



వైభవి శాండిల్య, ధృవ సర్జా

ధృవ సర్జా టైటిల్ పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'మార్టిన్'. ఎ.పి.అర్జున్ దర్శకత్వంలో వాసవీ ఎంటర్‌ప్రైజెస్, ఉదయ్ కె.మెహతా ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ఉదయ్ కె.మెహతా, సూరజ్ ఉదయ్ మెహతా ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ను నిర్మిస్తున్నారు. అక్టోబర్ 11న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ అవుతుంది.

ఈ నేపథ్యంలో సోమవారం ఈ సినిమా నుంచి మేకర్స్ ఓ లవ్ మెలోడీ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. 'అదంతేలే..' అంటూ సాగే పాటను రామజోగయ్య శాస్త్రి రాశారు. మణిశర్మ పాటలకు స్వరాలందిస్తున్నారు. శ్రీకృష్ణ, శ్రుతికా సముద్రాల పాటను అద్భుతంగా పాడారు. ఇమ్రాన్ సర్దారియా కొరియోగ్రఫీ అందించారు. నటుడు, దర్శకుడు అర్జున్ ఈ చిత్రానికి కథను అందించటం ఓ విశేషమైతే, రవి బస్రూర్ బ్యాగ్రౌండ్ స్కోర్‌ను సమకూర్చటం మరో విశేషం.



అవన్నీ ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయి

విజయ్, డైరెక్టర్ వెంకట్ ప్రభు కాంబోలో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). ఎజిఎస్ ఎంటర్‌టైన్ మెంట్ ప్రై లిమిటెడ్ పై కల్పాతి ఎస్.అఘోరమ్, కల్పాతి ఎస్.గణేష్, కల్పాతి ఎస్.సురేష్ నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ పాన్ ఇండియా మూవీ తెలుగు వెర్షన్‌ను గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ఈనెల 5న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.

మాకు ఈ సినిమా అవకాశం ఇచ్చిన నిర్మాత అర్చనకి థ్యాంక్స్. బిగ్గెస్ట్ స్టార్ కాస్ట్‌తో చాలా గ్రాండ్‌గా నిర్మించిన సినిమా ఇది. ట్రైలర్, టీజర్‌కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మైత్రి మూవీ మేకర్స్ రవి, నవీన్ మేమంతా కలిసి ఈ సినిమాని మైత్రి మూవీస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీగా విడుదల చేస్తున్నాం. విజయ్ కెరీర్‌లో హయ్యస్ట్ రిలీజ్. ఎర్లీ మార్నింగ్ షోస్ ప్లాన్ చేస్తున్నాం. సినిమా తప్పకుండా బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ అవుతుంది.

\- డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి

డైరెక్టర్ వెంకట్ ప్రభు మాట్లాడుతూ,'ఇది హోల్ సమ్ ఎంటర్‌టైనర్. థియేటర్స్‌లో అందరూ చాలా బాగా ఎంజాయ్ చేస్తారు. విజయ్‌ని చాలా కొత్తగా ప్రజెంట్ చేశాం. ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో వర్క్ చేయడం ఇదే తొలిసారి. విజయ్, అలాగే ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ 25వ సినిమాని డైరెక్టర్ చేయడం ఆనందంగా ఉంది. ఏడాదిలో ఈ సినిమా చేశాం. ఇదే సినిమా హాలీవుడ్‌లో చేస్తే చాలా టైం, బడ్జెట్ తీసుకుంటారు. ఇలా చేయడానికి రాజమౌళి స్ఫూర్తి. ఆయనకి నేను పెద్ద ఫ్యాన్‌ని. మైత్రీ మూవీ మేకర్స్‌కి థాంక్స్. వారు ఈ సినిమాని రిలీజ్ చేయడం ఒక హానర్‌గా భావిస్తున్నాను' అని తెలిపారు.

మైత్రీ మూవీ మేకర్స్ నా ఆల్ టైం ఫేవరేట్ మూవీ 'పుష్ప'ని నిర్మించారు. ఈ సినిమా కూడా గొప్ప విజయాన్ని సాధిస్తుంది. మ్యాగ్జిమం స్క్రీన్స్‌లో రిలీజ్ జరుగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్‌తో భాగస్వామ్యం అవ్వడం ఆనందంగా ఉంది. ఇది మా 25వ సినిమా. విజయ్, డైరెక్టర్ వెంకట్ ప్రభుకి థ్యాంక్స్. యువన్ వండర్‌ఫుల్ మ్యూజిక్ ఇచ్చారు' అని నిర్మాత అర్చన కల్పాతి చెప్పారు. ప్రశాంత్, స్నేహ, మీనాక్షి చౌదరి, లైలా, మ్యూజిక్ డైరెక్టర్ జీవన్ శంకర్ రాజా తదితరులు ఈ చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

శ్వాగ్ రిలీజ్‌కి రెడీ



శ్రీ విష్ణు

హీరో శ్రీవిష్ణు 'రాజ రాజ చోరా' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత డైరెక్టర్ హసిత్ గోలీతో 'శ్వాగ్' చిత్రాన్ని చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా, మేకర్స్ మూవీ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. దసరాకి దాదాపు 10 రోజుల ముందుగా అక్టోబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయ బోతున్నారు. పండుగ సెలవులు సినిమాకు ఫేవర్‌గా ఉండ బోతున్నాయి. సినిమా విడుదలకు దాదాపు నెల రోజుల సమయం ఉంది. రెగ్యులర్ అప్‌డేట్‌లతో రావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో రీతూ వర్మ హీరో నటిస్తుండగా, మీరా జాస్మిన్, సునీల్, దక్షనాగార్కర్, శరణ్య ప్రదీప్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిబొట్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతి ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: వేదరామన్ శంకరన్, సంగీతం: వివేక్ సాగర్, ఎడిటర్: విప్లవ్ నైషధం, ఆర్ట్ డైరెక్టర్: జి.ఎం. శేఖర్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనునాగవీర.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణ

ఇంకా జలదిగ్బంధంలోనే...

ఏపీలో ఆహారం, మంచినీటి కోసం పాట్లు

సహాయక చర్యలు ముమ్మరం



విజయవాడ : ఇంకా వరద నీటిలోనే ప్రజలు అల్లాడుతున్నారు. బుడమేరు, కృష్ణా నది వరదల కారణంగా ముంపున కు గురైన ప్రాంతాల్లో బాధితుల ఆర్తనాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. వరదలు తగ్గుముఖం పట్టినా ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాలోని అనేక ప్రాంతాలు ఇంకా జలదిగ్బంధనం లోనే ఉన్నాయి. రాష్ట్రంలో 4.15 లక్షల మంది వరద ముంపునకు గురయ్యారు. 17 మంది చనిపోయారు. అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. 163 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి 43,417 మందిని తరలించారు. 197 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందిస్తున్నారు. ఇంకా ముంప నీటిలోనే ఉన్నవారికి డ్రోన్లు, హెలికాప్టర్లు, బోట్లు సాయంతో ఆహారం, మంచినీరు, పాలు పంపిణీ చేస్తున్నారు. ఇంకా చాలా ప్రాంతాల్లో ఆహారం అందలేదు. ఆహారం, సహాయక సామగ్రిని లారీలు, ట్రాక్టర్లతో ముంపు ప్రభావిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. అక్కడి నుంచి వాటిని ముంపు బారిన పడ్డ బాధితుల వద్దకు బోట్లలో చేరవేయాలి. కానీ, లోతట్టు ప్రాంతాలకు అవి చేరడం లేదు. పంపిణీ బృందాలు ప్రధాన రహదారులను దాటి ముంపుల్లో ఉన్న వీధుల్లోపలికి రావట్లేదని, తాము ఆకలితో అల్లాడిపోతున్నామని బాధితులు వాపోతున్నారు. ముఖ్యంగా సింగ్‌నగర్, జక్కంపూడి కాలనీ, భవానీపురంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఇళ్లల్లో యువకులు ఉంటే వారు ఎలాగోలా బయటకొచ్చి మిగతా కుటుంబ సభ్యుల కోసం ఆహారాన్ని తీసుకెళ్లగలుగుతున్నారు. వృద్ధులు, మహిళలు, నడివయస్కులు ఉన్నవారు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమను రక్షించమని పలువురు బాధితులు వేడుకుంటున్నారు. వరద వచ్చి మూడు రోజులైనా అధికారులు తమవైపు చూడడంలేదని వాపోతున్నారు. తమ వారి ఫోన్లు పని చేయడం లేదని బాధితుల బంధువులు ఆందోళన చెందుతున్నారు. అనేకమంది బాధితులు భవనాలపైనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇంకా విద్యుత్తు పునరుద్ధరణ జరగలేదు. వరదలో చిక్కుకున్న బాధితుల అవస్థలను ఆసరాగా తీసుకుని ప్రయివేటు బోటు, ట్రాక్టర్ల యజమానులు ఇంకా డబ్బులు వసూలు చేస్తూనే ఉన్నారు.

వరద బాధితులను విరాళాలు ఇచ్చి ఆదుకోండి

- సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి

అమరావతి : వరద ముంపులో సర్వం కోల్పోయిన బాధితులను విరివిగా విరాళాలిచ్చి ఆదుకోవాలని రాష్ట్ర ప్రజానీకానికి సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల 17 మంది చనిపోయారని తెలిపారు. కృష్ణానది, బుడమేరుకు గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూలేనంత వరద రావడం వల్ల లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. వందల ఇళ్లు కూలిపోయాయని, ఇంట్లో సామాన్లు, నిత్యావసరాలు పనికిరాకుండా పోయాయని పేర్కొన్నారు.

వరద సహాయ కార్యక్రమాల్లో సిపిఎం భాగస్వామిగా ఉందని, బాధితులకు వసతి, ఆహారం, నీరు అందించడానికి కార్యకర్తలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సహాయం సరిపోదని, మరింత కావాలంటే రాష్ట్ర ప్రజానీకమంతా తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

విరాళాలు ఈ బ్యాంకు అకౌంట్‌కు పంపండి

అకౌంట్ పేరు :సీపీఐ(ఎం) పీపుల్స్ రిలీఫ్ ఫండ్,
అకౌంటు నెంబరు : 62109192143
బ్యాంకు పేరు : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా,
ఐఎఫ్ఎస్‌సి కోడ్ : SBIN 0020343
బ్రాంచ్ పేరు : బీసెంట్ రోడ్ బ్రాంచ్, విజయవాడ

విరాళం పంపిన తరువాత ఆ సమాచారాన్ని 9490099018కు వాట్సాప్ లేదా ap@cpim.org మెయిల్‌కు పంపించాలని ఆయన కోరారు.



సింగ్‌నగర్ ముంపు ప్రాంతం నుండి సహాయక శిబిరానికి తరలిస్తున్న బాధిత మహిళతో మాట్లాడుతున్న చంద్రబాబు

భారత వృద్ధి 7 శాతంగా ఉండొచ్చు : ప్రపంచ బ్యాంక్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ఇంతక్రితం 6.6 శాతంగా ఉండొచ్చని పేర్కొనగా.. తాజాగా ఆ అంచనాలను పెంచింది. వ్యవసాయ రంగం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో రికవరీ ఆశించిన స్థాయిలో ఉండటంతో జీడీపీ పెరగొచ్చని పేర్కొంది. ప్రపంచ భౌగోళిక రాజకీయ సవాళ్లు ఉన్నా భారత్ ఆర్థికవ్యవస్థ రాణిస్తుందని విశ్లేషించింది. 2024 జూన్ త్రైమాసికంలో జీడీపీ 6.7 శాతానికి మందగించినప్పటికీ ప్రపంచ బ్యాంక్ జీడీపీ అంచనాలను పెంచడం గమనార్హం.

దక్షిణాదిలో ఫ్లిక్స్ బస్ విస్తరణ

హైదరాబాద్ : దక్షిణాదిలో ఆరు కొత్త మార్గాలకు తమ కార్యకలాపాలను విస్తరించినట్లు గ్లోబల్ ట్రావెల్ టెక్ లీడర్ అయిన ఫ్లిక్స్‌బస్ ఇండియా తెలిపింది. దక్షిణాదిలో కొత్తగా 6 మార్గాలను పరిచయం చేయడంతో ఇక్కడి మార్కెట్‌లోకి ప్రవేశించినట్లు తెలిపింది. సెప్టెంబర్ 10 నుంచి కొత్త సేవలు ప్రారంభమవుతాయని గ్లోబల్ ఫ్లిక్స్ సిఒఒ మాక్స్ జ్యూమర్ తెలిపారు. తొలుత బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్, కోయంబత్తూరు, మధురై, తిరుపతి, విజయవాడ, బెల్గాం మధ్య సర్వీసులను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపింది. చెన్నయ్, హైదరాబాద్, బెంగళూరుకు రోజువారి బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు వెల్లడించింది.

హెచ్‌ఎస్‌బీసీ ఎంఎఫ్ నుంచి కొత్త ఫండ్

ముంబయి : హెచ్‌ఎస్‌బిసి మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఎక్స్‌పోర్ట్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను ప్రారంభించనున్నట్టు పేర్కొంది. ఇది సెప్టెంబర్ 5న తెరిచి.. 2024 సెప్టెంబర్ 19న ముగుస్తుందని తెలిపింది. ఇందులోని ఫండ్స్‌ను ఎగుమతిలో నిమగ్నమైన లేదా ప్రయోజనం పొందాలని భావిస్తున్న కంపెనీల ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెట్టనుంది. ఈ పథకం నిఫ్టీ 500 టోటల్ రిటర్న్ ఇండెక్స్‌ను ట్రాక్ చేస్తుందని తెలిపింది.

జాబ్ ఛాన్స్

- రెండేండ్ల కిందటి అభ్యర్థులకు ఇన్ఫోసిస్ నియామకాలు

బెంగళూరు : రెండేండ్ల కిందటి క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికయిన వారిని ఇన్ఫోసిస్ ఇప్పుడు ఉద్యోగాల్లోకి తీసుకుంటుంది. 2022లో ఎంపిక చేసిన ఇంజినీరింగ్ పట్టభద్రులకు నియామకాలు ఇవ్వడాన్ని ప్రారంభించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే పలువురికి జాయినింగ్ తేదీలు, ఆఫర్‌కు సంబంధించిన సమాచారం అందినట్లు వెల్లడించాయి. క్యాంపస్ నియామకాల్లో ఎంపికైన 1000 మందికి ఇప్పటికే ఆఫర్ లెటర్‌లను కంపెనీ జారీ చేసిందని ఐటీ సంఘం నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్ (నైట్స్) వెల్లడించింది.

వరద బాధిత కస్టమర్లకు ఉచిత సేవలు

- నిస్సాన్ మోటార్స్ వెల్లడి

హైదరాబాద్ : దేశంలోని వివిధ ప్రాంతాల్లో వరదల వల్ల నష్టపోయిన వినియోగదారుల కోసం ప్రత్యేక సహాయక చర్యలు అందిస్తున్నట్లు నిస్సాన్ మోటార్ ఇండియా తెలిపింది. వరదలతో సతమవుతున్న కంపెనీ వినియోగదారులకు ఉచితంగా తమ వాహనాల కోసం రోడ్‌సైడ్ అసిస్టెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించింది. ప్రత్యేకంగా నిస్సాన్ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. వరదల్లో చిక్కుకున్న వాహనాలను సమీపంలోని కంపెనీ సర్వీస్ వర్క్‌షాప్‌కు తీసుకెళ్లడానికి వీలుగా ఉచిత రోడ్‌సైడ్ అసిస్టెన్స్ సేవలను ప్రారంభించినట్టు తెలిపింది. దాంతోపాటు బీమా వాహనాలకు క్లెయిమ్ ప్రాసెస్ ఫీజు రూ.1000 మినహాయించినట్టు పేర్కొంది.

వరద ప్రాంతాల్లో రీచార్జ్ గడువు పెంపు : ఎయిర్‌టెల్

హైదరాబాద్ : వరద ప్రభావిత ప్రాంతాల్లో తమ ఖాతాదారులకు మద్దతుగా నిలువాలని టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ నిర్ణయించింది. తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈ క్లిష్ట సమయంలో తమ ప్రీపెయిడ్ ఖాతాదారులకు వ్యాలిడిటీ ముగిసిన, రీఛార్జ్ చేయలేని కస్టమర్‌లు అదనంగా నాలుగు రోజులు అపరిమిత కాలింగ్‌తో పాటు రోజుకు 1.5 జీబీ ఉచిత మొబైల్ డేటాను అందిస్తున్నట్లు పేర్కొంది. పోస్ట్ పెయిడ్ ఖాతాదారులు బిల్లు చెల్లింపు గడువు తేదీలను 7 రోజులు పొడిగిస్తున్నట్లు తెలిపింది.

ఐటీ టవర్‌తో వందలాది మందికి ఉద్యోగాలు

- సీసీఐ పునరుద్ధరణకు కృషి
- వరదలు తగ్గాక.. పంట నష్టంపై సర్వే : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్, రూరల్

ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డులో రూ.40కోట్లతో నిర్మిస్తున్న ఐటీ టవర్‌తో స్థానికంగా వందలాది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మంత్రి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పర్యటించారు. ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ నిర్మాణం, సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ, పెన్‌గంగ నది బ్రిడ్జి, నిర్మల్‌లో వరద ప్రాంతాల్లో పరిశీలించారు.

ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ నిర్మాణ పనుల వివరాలను ఇంజినీర్ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మ్యాప్‌లను పరిశీలించి, త్వరతగతిన పనులు పూర్తి చేసేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మూడెకరాల్లో టవర్ ఫేస్‌ను అభివృద్ధి చేయడంతో 537 మంది ఉపాధి పొందొచ్చని, నిర్మాణ పనుల్లో పురోగతి ఉందని అన్నారు. జనవరి చివరి వరకు పనులు పూర్తవుతాయని తెలిపారు. సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీని పున:ప్రారంభించేందుకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. గతంలోనే కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామిని కలిసి ఫ్యాక్టరీ పునరుద్ధరణ అంశంపై చర్చించామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతం ఆదిలాబాద్‌లో ఉన్న ఏకైక పరిశ్రమ సీసీఐ అని, దాన్ని పునరుద్ధరించేలా అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.



తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగ బ్రిడ్జిని మంత్రి సందర్శించారు. నదిలో వరద పరిస్థితిని గమనించి జిల్లా అధికార యంత్రాగానికి తగు సూచనలు చేశారు. రాష్ట్రంలో వానలు, వరదల పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మహబూబాబాద్ పర్యటనలో బిజీగా ఉండటంతో ఇక్కడి పరిస్థితిని సమీక్షించేందుకు తాను వచ్చానని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి మానవ ప్రయత్నంలో లోపం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గు ముఖం పట్టిన తర్వాత పంట నష్టంపై సర్వే చేసి రైతులకు నష్టపరిహారం అందించే విధంగా ప్రభుత్వం తగు ఏర్పాట్లు చేస్తుందన్నారు. పెన్‌గంగ బ్రిడ్జిని సందర్శించి తిరిగి వస్తున్న క్రమంలో కామాయి, మాండగడ గ్రామస్తులను కలిసి మంత్రి మాట్లాడారు. తమకు రోడ్డు సౌకర్యం కావాలని, వరదలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని మంత్రికి విన్నవించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివేళలా ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.నిర్మల్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో కలిసి పలు కాలనీల్లో మంత్రి శ్రీధర్‌బాబు పర్యటించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు జలమయమైన జీఎస్ఆర్ కాలనీని పరిశీలించారు.

వర్షాలతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. మంత్రి వెంట ఎమ్మెల్యే పాయల శంకర్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, నిర్మల్ కలెక్టర్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలా, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఉన్నారు.

మంత్రాల నెపంతో వ్యక్తి దారుణ హత్య

- తీవ్రంగా గాయపడిన ఇద్దరు మహిళలు
- మురికి కాలువలో పడేసి కర్రలు, రాళ్లు, చెప్పులతో దాడి



నవతెలంగాణ-టేక్మాల్

మంత్రాల నెపంతో కొందరు గ్రామస్తులు మూకుమ్మడిగా తెల్లవారుజామునే ఓ కుటుంబంపై విచక్షణారహితంగా దాడి చేశారు. మురికి కాలువలో పడేసి కర్రలు, రాళ్లు, చెప్పులతో కొట్టారు. ఈ దాడిలో ఆ ఇంటికి చుట్టపుచూపుగా వచ్చిన వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం గొల్లగూడెం గ్రామంలో జరిగింది. ఇందుకు సంబంధించి బాధితురాలు బురుజుకాడి గంగమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం మండలం ఏటిగడ్డ మాందాపురం గ్రామానికి చెందిన రాములు గంగమ్మ మేనమామ. ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రిలో చూపించుకునేందుకు గొల్లగూడెంలో గంగమ్మ ఇంటికొచ్చాడు. అయితే, మంత్రాలు చేస్తున్నారంటూ మంగళవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో గ్రామస్తులు కొందరు గంగమ్మ ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో ఉన్న వాళ్లను బయటకు లాగి కర్రలు, రాళ్లతో విచక్షణారహితంగా కొట్టారు. వారు ఎంత వారించినా.. ప్రాధేయపడినా వదిలిపెట్టలేదు. 'మాకు ఎలాంటి మంత్రాలూ రావు.. ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రిలో చూపించుకునేందుకు మా మేనమామ రాములు ఇక్కడికి వచ్చాడు" అని చెప్పినా వినిపించుకోలేదు. ఇంటి ముందర ఉన్న మురికి కాల్వలో పడేసి తన్నుకుంటూ కొట్టారు. తీవ్రంగా కొట్టడంతో రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. గంగమ్మతోపాటు బాలమణి అనే మహిళపైనా దాడి చేశారు. బురుజు కాడి విట్టల్, ఆయన భార్య ఇందిర, మరికొందరు గ్రామస్తులు రాములును కొట్టి చంపారని గంగమ్మ కన్నీటిపర్యంతమయ్యారు. గాయపడిన గంగమ్మ, బాలమణి జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
డీఎస్పీ ప్రసన్న కుమార్

మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, అల్లాదుర్గం సీఐ రేణుక పోలీసు సిబ్బందితో గొల్లగూడెం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రసన్నకుమార్ చెప్పారు. రాములు మృతదేహన్ని జోగిపేట ఆస్పత్రికి తరలించారు.

విద్య, జ్ఞానం చాలా పదునైన అస్త్రాలు

- మహిళా శక్తిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి : హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ బి.జగదీశ్వర్‌రావు
- ఘనంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వ్యవస్థాపక దినోత్సవం



నవతెలంగాణ-రాజేంద్రనగర్

విద్య, జ్ఞానం అనేవి చాలా పదునైన అస్త్రాలని, విద్య అంటే కేవలం తరగతి గదులు, డిగ్రీలు అన్న భావన నుంచి బయటకు రావాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ బి.జగదీశ్వర్‌రావు అన్నారు. రాష్ట్రానికి కీలకంగా ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వ్యవసాయ రంగంలో ఒక ఆభరణంలా పని చేస్తోందని చెప్పారు. మంగళవారం రంగారెడ్డి జిల్లాలోని అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో విశ్వవిద్యాలయం పదో వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధ్యాపకులు, విద్యార్థులు నిరంతరం నేర్చుకోవడంపైనే దృష్టి పెట్టాలని, అప్పుడే వికసిత భారత్ సాధ్యమవుతుందని అన్నారు. మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలని, టెక్నాలజీలను ఉపయోగించుకుని తయారీ రంగంలో ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా మహిళా శక్తిని పూర్తిస్థాయిలో సద్వినియోగపరుచుకుంటే దేశం ప్రపంచంలో ప్రథమ స్థానానికి వెళ్తుందని చెప్పారు. ఇండ్లల్లోనే పిల్లలకు విలువలు నేర్పితే సమాజంలో అపసవ్య ధోరణులు తలెత్తవని అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన టెక్నాలజీలే రానున్న వందేండ్లలో సమాజాన్ని శాసించనున్నాయని వివరించారు. ఇందిరాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి మహామహులు గతంలో ఉమ్మడి వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారని, ఆ వారసత్వం కొనసాగింపుగా పదేండ్ల కిందట ఏర్పాటైన ఈ యూనివర్సిటీ మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు.వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఇన్‌చార్జి ఉపకులపతి ఎం.రఘునందన్‌రావు మాట్లాడుతూ.. పదేండ్లలోనే యూనివర్సిటీ బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అనేక మైలురాళ్లు సాధించిందని వివరించారు. తెలంగాణ సోనా సహా సుమారు 67 నూతన వంగడాలని విడుదల చేశామన్నారు. అవసరాలకు అనుగుణంగా కొత్త కళాశాలల్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం రుణమాఫీ సహా అనేక రైతు కేంద్రీకృత పథకాలను అమలు చేస్తోందన్నారు. అందుకు అనుగుణంగా మనమందరం రైతాంగం సేవలకి పునరంకితం కావాలని కోరారు. అంతకుముందు రిజిస్ట్రార్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి స్వాగతోపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులకు, బోధన, బోధనేతర సిబ్బందికి పురస్కారాలు అందజేశారు. వేడుకలు ప్రారంభానికి ముందు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, రైతులు, విద్యార్థులు, విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతులు, అధికారులు పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం

- పరిశీలించిన అటవీ అధికారులు



నవతెలంగాణ-కుభీర్

నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి(బి) గ్రామంలో అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసమైంది. బాధిత రైతు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్డి(బి) గ్రామానికి చెందిన జంగాల లక్ష్మీ తన మూడెకరాల 20 గుంటల్లో మొక్కజొన్న సాగు చేశారు. అయితే, పంట చేతికి వచ్చే సమయంలో అడవి పందులు ధ్వంసం చేయడంతో రైతు కంటతడి పెట్టుకున్నారు. దాదాపుగా రూ.లక్ష 50వేల వరకు నష్టపోయారు. కాగా, మొక్కజొన్న పైరును అటవీ శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. బాధిత రైతుకు పరిహారం అందించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు. ఈ సందర్భంగా అటవీశాఖ సెక్షన్ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పంటను అడవి పందులు పూర్తిగా నాశనం చేశాయన్నారు. నష్టపోయిన రైతుకు నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్ రాజేష్ ఉన్నారు.